ప్రతిపక్షం
www.prathipaksham.in
సోమవారం 24.11.2025 | Published from: Hyderabad | సంపుటి: 18 సంచిక: 244 పేజీలు:12 వెల రూ. 5/-
@prathipaksham | prathipaksham tv telugu


ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500 విజేత లక్ష్య 12

పంచాయతీలకు 'ఉత్తుత్తి' నజరానా!

ఏకగ్రీవం చేసుకున్నా సహాయం నిల్

మాట నిలుపుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం



- పాలకవర్గాల గడువు ముగిసినా చిల్లిగవ్వ రాలే!
- తీవ్రంగా నిరాశ చెందిన సర్పంచులు, ప్రజలు
- ఈసారి ఇంకా నోరు మెదపని కాంగ్రెస్ సర్కారు
- నజరానా ప్రకటించినా ఇచ్చేది అనుమానమే
- అయినా, చాలా చోట్ల ఏకగ్రీవాలకు యత్నాలు
- పల్లెలు అభివృద్ధి చెందాంటే దండిగా నిధులు కావాలి
- ఎంపీలు, ఎమ్మెల్యేలు ముందుకు రావాలంటున్న ప్రజలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 23: రాష్ట్రంలో ఏకగ్రీవ పంచాయతీలకు ఈ సారైనా నిధులు కేటాయిస్తారా? లేదా? అన్న సందేహం ప్రజలలో వ్యక్తమవుతోంది. గత ఎన్నికలలో నాటి బీఆర్ఎస్ప్రభుత్వం ఏకగ్రీవ పంచాతీలకు ప్రభుత్వం తరపున రూ.10 లక్షలు, ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్ నుంచి మరో రూ.10 లక్షలు నజరానా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రభుత్వ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1500కు పైగా పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షలతో గ్రామాలు అభివృద్ధికి నోచుకుంటాయన్న ఆశ గ్రామ ప్రజలలో వ్యక్తమైంది. దీంతో పలు గ్రామాలలో పోటీ ఉన్నా కొన్ని పంచాయతీలలో నచ్చజెప్పి, మరి కొన్ని పంచాయితీలలో వేలం నిర్వహించి ఏకగ్రీవం చేసుకున్నారు. అయిదేళ్ల

..:: మిగతా 2లో

స్థానిక ఎన్నికల వేళ కేటీఆర్ అరెస్ట్ అయితే, ప్రజలలో ఆయన పట్ల సానుభూతి పెరిగి బీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్‌గా మారుతుందన్న ధోరణిలో ఆ పార్టీ నేతలున్నారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేసినా, ధర్నాలు, నిరసనలు చేస్తే లోకల్ బాడీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కే మైలేజ్ వస్తుందంటున్నారు. కాగా, ఎంత అవినీతి జరిగిందన్నది ప్రజలు పట్టించుకోరని, అవినీతి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే చూస్తారనేది కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. దానికి విరుగుడుగానే, బీఆర్ఎస్ పార్టీ భూస్కామ్‌ను తెరమీదకు తెచ్చారనే చర్చ ప్రజలలో విస్తృతంగా జరుగుతోంది.



బస్తీమే సవాల్!

భూస్కామ్ వర్సెస్ ఈ కార్ రేస్!.. 'లోకల్' పోరు వేళ హీటెక్కిన తెలంగాణ

- అధికార, విపక్షాల ఆరోపణల యుద్ధం
- సడన్ గా కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి
- కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగిసిందన్న కాంగ్రెస్
- కేసులో పస లేదంటున్న బీఆర్ఎస్ నేతలు
- 5 లక్షల కోట్ల భూ కుంభకోణానికి కుట్రలు
- సీఎం రేవంత్, ఆయన సోదరుల మీద విమర్శలు
- విరుచుకుపడుతున్న కేటీఆర్, హరీశ్ రావు
- కేటీఆర్ అరెస్ట్ అయితే లాభమెవరికి! నష్టమెవరికి ?
- రసవత్తరంగా మారుతున్న రాష్ట్ర రాజకీయాలు

మాణిక్యప్రభు గుర్రంపల్లి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23 : తెలంగాణలో రాజకీయాలు ఎప్పుడూ హీటెక్కుతూనే ఉన్నాయి. ప్రస్తుతం అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీల మధ్య భూస్కామ్, ఫార్ములా ఈ కారు రేస్అంశం రసవత్తరంగా మారింది. జూబ్లీహిల్స్ఉప ఎన్నికలోనూ ఇరుపార్టీల మధ్య రాజకీయం రంజుగా నడిచింది. ఒకరిపై ఒకరు తీవ్రంగా ఆరోపణలు చేసుకున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అటు బీజేపీని ఇరుకున పెట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించిన వేళ మరోమారు రాజకీయం హీటెక్కింది. ఫార్ములా ఈ కారు రేస్ కేసు పాతదే. కాకపోతే, సరికొత్త ఆరోపణలు కాక రేపుతున్నాయి. రేవంత్ రెడ్డి, ఆయన సోదరుల మీద బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు కొత్తేమీ కాదు. ఈసారి మాత్రం ఏకంగా రూ. ఐదు లక్షల కోట్ల విలువైన భూములను కొట్టేసే కుట్రకు తెరలేపారని బీఆర్ఎస్ ఒంటి కాలిపై లేస్తోంది. అటు స్థానిక ఎన్నికల వేళ కేటీఆర్ ను

..:: మిగతా 2లో



గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు అదరహో అనాలే

- అనుమతి లేకుండా చీమ కూడా దూరొద్దు
- పాసులు లేకుంటే అనుమతించొద్దు
- పలు దేశాల అంబాసిడర్లు పాల్గొనే అవకాశం
- అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించాలి
- భద్రతా ఏర్పాట్లు అతి కట్టుదిట్టంగా ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, నవంబర్ 23: ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ సర్కార్ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనుంది. ఈ సమ్మిట్ ఏర్పాట్లపై సీఎం రేవంత్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల ప్రతినిధులు, అంబాసిడర్లు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాస్‌లు లేకుండా ఎవరు ఎంట్రీ కావడానికి వీలు లేదని, సమ్మిట్‌కు సంబంధం లేని వారికి ఎట్టి పరిస్థితులలోనూ అనుమతి ఇవ్వకూడదని సీఎం స్పష్టం చేశారు. శాఖల వారీగా పకడ్బందీగా అధికారులకు ఎంట్రీ ఉంటుందని వెల్లడించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తానని చెప్పుకొచ్చారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది రాకూడదని చెప్పారు. బందోబస్తుకు వచ్చే పోలీస్ సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమ్మిట్‌కు హాజరయ్యే మీడియాకు కూడా తగిన ఏర్పాట్లు చేయాలని సీఎం పేర్కొన్నారు. అనంతరం సీఎం భారత్ ఫ్యూచర్ సిటీ లో నిర్మిస్తున్న భారత్ స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించారు.


రెండు వేల మంది విదేశీయులు

ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి సుమారు రెండు వేల మంది ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను మరింత పెంచడం, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడం ఈ సమ్మిట్ ముఖ్య ఉద్దేశం. అంతర్జాతీయ స్థాయిలో తన విజన్, పాలసీలను ప్రదర్శించడానికి ఈ సమ్మిట్ ఒక ముఖ్య వేదికగా కానుందని రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది.

సత్యసాయి మనుషులలో దేవుడు

- ప్రేమతో మనుషులను గెలిచారు
- విద్య, వైద్యం, తాగునీటికి దారి చూపారు
- 140 దేశాలలో బాబా భక్తులు, సేవలు
- శతజయంతి వేడుకలలో టీ సీఎం రేవంత్
- కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేశారు
- ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు





ప్రతిపక్షం ప్రత్యేక ప్రతినిధి

పుట్టపర్తి, నవంబర్ 23: సత్యసాయి మనుషులలో దేవుడిగా శాశ్వత స్థానం ఏర్పరచుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని హిల్‌వ్యూ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో ఆయన మాట్లాడారు. సత్యసాయి మానవ సేవే మాధవ సేవ అని బోధించడమే కాకుండా అమలు చేశారని పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీటి సమస్యలను పరిష్కరించి చూపించారని కొనియాడారు. జీవితంలో ఓ లక్ష్యాన్ని చేరడానికి అవసరమైన ధైర్యాన్ని అందించారని, 140 దేశాలలో సత్యసాయిబాబాకు భక్తులున్నారని తెలిపారు. వారు ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్నారన్నారు. సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలు తెలంగాణాలో అధికారికంగా నిర్వహించాలని ప్రకటించినట్లు తెలిపారు. ప్రేమ ద్వారా ఏదైనా సాధించవచ్చని సత్యసాయిని రూపించారని, ఆయన ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వాలు కూడా చేయలేని పనులను చేసి చూపించారన్నారు. ముఖ్యంగా కేజీ టు పీజీ విద్య ప్రతి ఒక్కరికి అందించారన్నారు. పాలమూరు వంటి వలస జిల్లాకు తాగునీటి సదుపాయం కల్పించారన్నారు. సంతోషం ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, తమిళనాడు మంత్రి శేఖర్‌బాబు, ఛత్తీస్‌గఢ్, మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు హాజరయ్యారు.

'దైవం మానుష రూపేణా' అన్నట్టుగా

ఆధ్యాత్మిక భావన, ప్రశాంత జీవనం, ముక్తిమార్గంతో కోట్ల మంది జీవితాలను సత్యసాయి ప్రభావితం చేశారని ఏపీ ముఖ్యమంత్రి

..:: మిగతా 2లో

'ఎస్టీ'ల నుంచి
లంబాడాలను తొలగించాలి

- ఎలుగెత్తి చాటిన 'ధర్మయుద్ధం' మహాసభ
- మహాసభకు పోటెత్తిన ఆదివాసీలు
- తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- ప్రధాన రహదారి నుంచి వాహనాల మళ్లింపు

ప్రతిపక్షం ఆదిలాబాద్ బ్యూరో

నవంబర్ 23: 'తుడుందెబ్బ' ఆధ్వర్యంలో ఆదివారం ఉట్నూర్‌లో జరిగిన ఆదివాసీల 'ధర్మ యుద్ధం బహిరంగ సభకు' ప్రజలు పోటెత్తారు. స్థానిక మండల కార్యాలయ మైదానంలో జరిగిన మహాసభకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. గత అనుభవాల దృష్ట్యా ఈ మహాసభను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. ఉట్నూర్ వైపు వెళ్లే అన్ని రహదారులను పోలీసులు

..:: మిగతా 2లో





సింధ్ రాష్ట్రం భారతదేశంలో కలవవచ్చు

పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రం భవిష్యత్తులో భారతదేశంలో కలవవచ్చని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సింధ్ ఇపుడు భారత్‌లో భాగం కాకపోయినా, ఇక్కడి నాగరికతతో ఇప్పటికీ ముడిపడి ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు.

11



బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్

జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ప్రజలకు ఏ మాత్రం తెలియని పార్టీలకు కూడా లక్షల ఓట్లు రావడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపారు.

11



చండీఘర్ ను లాక్కోవాలంటే కుదరదు

పంజాబ్, హర్యానా రాజధాని చండీఘర్ లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఇందు కోసం తేవాలను కున్న రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లును పంజాబ్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.

11



ఢిల్లీలో 200 కోట్ల భారీ డ్రగ్స్ స్వాధీనం

దేశ రాజధాని ఢిల్లీలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టును నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు రట్టు చేశారు. రూ.200 కోట్లకు పైగా విలువగలిగిన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

11

రాష్ట్రీయం

పంచాయతీలకు 'ఉత్తుత్తి' నజరానా!

మొదటిపేజీ తరువాయి

పదవీ కాలం పూర్తి అయినా ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా దక్కలేదు. నజరానా కోసం సర్పంచులు గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలను నిత్యం అడిగినా ఇప్పుడు, అప్పుడంటూ దాట వేశారు.

నజరానా ఇప్పుడైనా ఇస్తారా?

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కానుంది. రాష్ట్రవ్యాప్తంగా 12,760 గ్రామ పంచాయతీలు, 1,12,534 వార్డులున్నాయి. ఈ ఎన్నికలలో ఏకగ్రీవానికి పలు గ్రామాల ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ప్రజలు ఐకమత్యంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పల్లెలను తీర్చిదిద్దుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాను ప్రకటించింది. పాలకవర్గాల పదవీకాలం ముగిసినా చిల్లిగవ్వ కూడా ఇవ్వనే లేదు. అటు ఎమ్మెల్యేలు, ఎంపీలు తమకిచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఏకగ్రీవంగా గెలిచినవారు చెబుతున్నారు. మరి ఈసారి రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు పచ్చ జెండా ఊపిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు సైతం చేస్తున్నది. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏకగ్రీవ పాలక వర్గాలకు నజరానాలను ఇప్పటివరకూ ప్రకటించలేదు. ఒకవేళ ప్రకటించినా ప్రజల స్పందన ఏ విధంగా ఉంటుందన్నది ఇక్కడ చర్చనీయాంశం. గత ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఏకగ్రీవాలు చేసుకుంటే ఎలాంటి నిధులు అనేవి రాక, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చలేకపోయామని మాజీలు అభిప్రాయ పడుతున్నారు.

బస్తీమే సవాల్!

మొదటిపేజీ తరువాయి

విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడం, కౌంటర్‌గా బీఆర్ఎస్ భూస్కామ్ అంటూ రచ్చ చేస్తుండటంతో రాష్ట్రంలో రాజకీయం మరోసారి వేడెక్కింది.

భూ స్కాం అంటూ బీఆర్ఎస్ మండిపాటు


హైదరాబాద్‌లో భారీగా భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. బాలానగర్, నాచారం, జీడిమెట్లలో 9,292 ఎకరాల భూస్కామ్‌కు ప్రభుత్వం తెరలేపిందని కేటీఆర్ ఆరోపణలు చేశారు. రూ. ఐదు లక్షల కోట్ల ఆదాయం రావాల్సి ఉండగా, కాంగ్రెస్ సర్కార్ ఇస్తున్న మినహాయింపుతో ప్రభుత్వానికి రూ. ఐదు వేల కోట్ల ఆదాయమే వస్తోందని బీఆర్ఎస్‌నేతలు ముఖ్యంగా హరీశ్ రావు, కేటీఆర్ ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఆ భూములను సీఎం రేవంత్ అనుచరులకు, బంధువులకు ఇచ్చేందుకు ప్రయత్నం జరుగుతోందని అంటున్నారు. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు మీడియాముందు క్లారిటీ ఇచ్చినా ససేమీరా అంటూ బీఆర్ఎస్ సవాళ్లు విసురుతోంది. ఇక అటు ఫార్ములా ఈ కారు రేస్ కేసులో కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగిసినట్లేనని కాంగ్రెస్ లీకులు ఇస్తోంది. రూ. 55 కోట్ల నిధుల వ్యవహారమే కాదు..ప్రభుత్వ అనుమతులు లేకుండానే ప్రయివేటు డిస్కషన్లతో రేస్ పెట్టారని ఆరోపణలు చేస్తున్నారు. క్విడ్ ప్రోకో జరిగిందని, ట్రై పార్టీ అగ్రిమెంట్‌కు ముందే ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ బీఆర్ఎస్ పార్టీకి రూ.44 కోట్ల దాకా విలువైన ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చినట్లు ఆరోపిస్తున్నారు. సేమ్ టైమ్ ఎన్నికల కమిషన్ అనుమతి లేకుండానే చెల్లింపులు, అగ్రిమెంట్లు చేసి కోడ్‌ను ఉల్లంఘించినట్లు చెబుతున్నారు. అయితే 'అంతా నిబంధనల ప్రకారమే చేశాం. బీఆర్ఎస్‌కే కాదు అన్ని పార్టీలకు ఏస్ నెక్స్ట్ జెన్ కంపెనీ ఎలక్టోరల్ బాండ్స్ ఇచ్చిందని, అందులో క్విడ్ ప్రోకో ఏం లేదని' బీఆర్ఎస్ అంటోంది.

సీఎం రేవంత్ కు కేటీఆర్ సవాల్

అయితే, ఫార్ములా ఈ కారు రేస్ కేసులో తనను అరెస్ట్ చేసే ధైర్యం సీఎం రేవంత్ రెడ్డికి లేదని కేటీఆర్ చెప్పడం చర్చకు దారితీస్తోంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని అంటున్న కేటీఆర్ పూర్తి ఆత్మవిశ్వాసంతో లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమంటున్నారు. ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్ అరెస్ట్ అయితే పొలిటికల్ సిచ్యువేషన్ ఎలా మారుతుందనేది ఇటు చర్చనీయాంశంగా మారింది. స్థానిక ఎన్నికల వేళ కేటీఆర్ జైలుకు వెళ్లాల్సి వస్తే నష్టమెవరికి? లాభమెవరికి? అన్న చర్చ కూడా నడుస్తోంది. అవినీతి సంగతి పక్కన పెడితే రూ.45 కోట్ల వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే అది ఆయనకు సానుభూతిగా మారుతుందన్న టాక్ వినిపిస్తోంది. స్థానిక ఎన్నికల వేళ కేటీఆర్ అరెస్ట్ అయితే, ప్రజలలో ఆయన పట్ల సానుభూతి పెరిగి బీఆర్ఎస్‌కు అడ్వాంటేజ్‌గా మారుతుందన్న ధోరణిలో ఆ పార్టీ నేతలున్నారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే ఆ పార్టీ ధర్నాలు, నిరసనలు చేస్తే లోకల్ బాడీ ఎన్నికలలో బీఆర్ఎస్‌కే మైలేజ్ వస్తుందంటున్నారు. ఎంత అవినీతి జరిగిందన్నది ప్రజలు పట్టించుకోరని, అవినీతి జరిగిందా? లేదా? అన్నది మాత్రమే చూస్తారనేది కాంగ్రెస్ నేతలు వాదిస్తున్నారు. దానికి విరుగుడుగానే, బీఆర్ఎస్ భూస్కామ్‌ను తెరమీదకు తెచ్చిందంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. లోకల్ పోరు వేళ ఈ కారు రేస్ వర్సెస్ భూస్కామ్ వార్ ఎటు మలుపుతిప్పుతుందో ఎవరికి మేలు చేస్తుందో వేచిచూడాసిందే మరి!!

సదరన్ రైజింగ్ సమ్మిట్ 2025'కు కేటీఆర్

- 'భవిష్యత్తుకు సిద్ధం: ఆవిష్కరణ, పరివర్తన, స్ఫూర్తి'పై ప్రసంగం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కు మరో అరుదైన అవకాశం వచ్చింది. ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక 'సదరన్ రైజింగ్ సమ్మిట్ - 2025'లో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సదస్సు ఈ నెల 25న చెన్నైలోని ఐటీసీ గ్రాండ్ చోళాలో జరగనుంది. దక్షిణ భారత భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాంకేతిక పరిణామాలపై తమ అభిప్రాయాలను కేటీఆర్ పంచుకోనున్నారు. ఈ సదస్సు మూడవ ఎడిషన్‌గా 'భవిష్యత్తుకు సిద్ధం: ఆవిష్కరణ, పరివర్తన, స్ఫూర్తి' అనే అంశంతో జరుగుతోంది. సదస్సులో ఆర్థిక వృద్ధి, ఆరోగ్యం, విద్య, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం, స్థిర అభివృద్ధి వంటి అంశాలలో దక్షిణ రాష్ట్రాల ప్రగతిని చర్చించడానికి ప్రభుత్వ ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు, పౌర సమాజానికి చెందిన ప్రముఖులు ఒకే వేదికపై చేరనున్నారు. ఏబీపీ నెట్‌వర్క్ ప్రతినిధుల ప్రకారం, కేటీఆర్ వంటి నాయకుల పాల్గొనడం తెలంగాణకు మాత్రమే కాక, యావత్ భారతదేశానికి దిశను నిర్దేశించడంలో దోహదపడుతుంది. కేటీఆర్ ఈ సందర్భంగా తెలంగాణ సాధించిన ప్రగతి, దక్షిణ రాష్ట్రాల పాత్ర, అలాగే తయారీ, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆవిష్కరణల ఆధారిత రంగాలలో వచ్చే కొత్త అవకాశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు.



క్రమశిక్షణ, ఐక్యతకు మారుపేరు ఎన్‌సీసీ

- పూర్వ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి


ప్రతిపక్షం కరీంనగర్ బ్యూరో, నవంబర్ 23: దేశవ్యాప్తంగా విద్యాలయాలలో రక్షణ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ యువతలో క్రమశిక్షణ, ఏకత, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ, దేశంలో ద్వితీయ శ్రేణి యువ సైనిక దళంగా నూతనోత్తేజంతో కవాతులు చేస్తున్నదని లయన్ కెప్టెన్ డా. బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం నాడు ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1948లో ప్రారంభమైన నేషనల్ కెడెట్ కోర్ (ఎన్‌సిసి) శిక్షణ ద్వారా నేడు దేశవ్యాప్తంగా 14 లక్షలకు పైగా యువత సైనిక శిక్షణను పొందుతున్నారన్నారు. కెడెట్లలో ప్రత్యేక ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ గల జీవనశైలి, దేశ భక్తి, సామాజిక సేవ, జాతీయ సమైక్యత లాంటి గుణాలు అలవడతాయని తెలిపారు. కెప్టెన్ రేళ్ల సంజీవ్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ అన్ని విద్యాలయాలలో లేదని, దీనిని ప్రతి విద్యార్థికి తప్పనిసరి చేస్తే యువశక్తి దేశాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఎన్‌సీసీ శిక్షణ తీసుకుంటున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగాలలోనే కాకుండా ఉన్నత విద్యలో కూడా రిజర్వేషన్లు లభిస్తాయని అన్నారు. ఎన్‌సీసీలో విశిష్ట సేవలు అందించిన కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కెప్టెన్ రేళ్ల సంజీవ్‌ను శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు సముచితంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ డి తిరుపతి రెడ్డి, జీఎస్టీ కోఆర్డినేటర్ ఇ. రమేష్, కార్యదర్శి లయన్ జి చంద్రశేఖర్, కోశాధికారి లయన్ పి సురేందర్, లయన్ కె సత్యం, లయన్ తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.



దాతృత్వం చాటుకున్న టీపీసీసీ చీఫ్

- గ్రామాభివృద్ధి 11 ఎకరాల భూమి విరాళం
- సొంతూరు రహత్ నగర్ లో అభివృద్ధి పనులు

ప్రతిపక్షం ప్రతినిధి, నిజామాబాద్, నవంబర్ 23: పుట్టి పెరిగిన ఊరులో అభివృద్ధి పనుల కోసం టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, సబ్ స్టేషన్ నిర్మాణానికి 11 ఎకరాల సొంత భూమిని ప్రభుత్వానికి అందజేశారు. తన సొంతూరు నుంచి టెంపుల్ కారిడార్ ను మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి మహేష్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలోని రహత్‌నగర్ లో మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 50 లక్షలతో నిర్మిస్తున్న దుర్గాదేవి నూతన ఆలయ నిర్మాణానికి సంబంధించి భూమి పూజలో పాల్గొన్నారు. తన తండ్రి బొమ్మ గంగాధర్ గౌడ్ గ్రామంలో దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించిన విషయాన్ని స్మరించుకున్నారు. అనంతరం ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు ఈరవత్రి అనిల్, అన్వేష్ రెడ్డి, బాల్కొండ ఇన్చార్జ్ సునీల్ రెడ్డి, డీసీసీ మాజీ నాయకులు తదితరులతో కలిసి అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్నారు. రహత్ నగర్ మీదుగా బాసర వరకు టెంపుల్ కారిడార్ రహదారి ధర్మపురి, కొండగట్టు, వేములవాడ, లింబాద్రిగుట్ట మీదుగా బాసర కి వెళ్తుందని మహేశ్ కుమార్ అన్నారు. ఈ టెంపుల్ కారిడార్ రోడ్డు నిర్మాణానికి రూ. 380 కోట్ల రూపాయలు మంజూరయ్యాయన్నారు.



పేద ప్రజలకు వరంగా సీఎం సహాయనిధి

ప్రతిపక్షం. ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 23: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరమని మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని హకీంపేట్‌కు చెందిన రాజబోయిన లావణ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతుంది. ఆర్థిక పరిస్థితి బాగా లేక సీఎం సహాయానిధి కోసం అర్జీ పెట్టుకుంది. ఆమెకు సీఎం సహాయనిధి నుండి మంజూరైన 60 వేల విలువైన చెక్కును లబ్ధిదారురాలి కుటుంబ సభ్యులకు ఆదివారం తోటకూర వజ్రేష్‌యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహాయ పథకాలు నిజంగా అవసరమైన వారికి చేరేలా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రాన్స్‌పోర్ట్ రీజినల్ అథారిటీ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మెన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు



సత్యసాయి మనుషులలో దేవుడు

మొదటిపేజీ తరువాయి

చంద్రబాబు నాయుడు అన్నారు. ఆయన సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించి జ్ఞానాన్ని బోధించి, సన్మార్గం చూపించారని తెలిపారు. దేవుళ్లు నిజానికి ఎక్కడో ఒకచోట అవతరిస్తారనా, సతస్యాయి ఈ పుణ్యభూమిని ఎంచుకున్నారన్నారు. 'లవ్ ఆల్, సర్వ్ ఆల్వ్.. హెల్ప్ ఎవర్, హర్ట్ నెవర్' అని సత్యసాయి బోధించారని చంద్రబాబు వ్యాఖ్యానించారు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసా సిద్ధాంతాలతో నూతన అధ్యాయం ప్రారంభించారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా వేడుకలు అధికారికంగా నిర్వహిస్తున్నందుకు సీఎం రేవంత్ ను అభినందించారు. సత్యసాయి సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు బాబా అందరినీ ఇక్కడికి రప్పించారన్నారు. వసుధైక కుటుంబం భారతీయులకు మూలం. సత్యసాయి బోధనల ద్వారా దాన్ని నిలబెట్టుకుందాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.





'ఎస్టీ'ల నుంచి లంబాడాలను తొలగించాలి

మొదటిపేజీ తరువాయి

తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాగా, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ మార్గాలలో ప్రయాణించే వాహనాలను గుడిహత్నూర్ క్రాస్ రోడ్డు వద్ద నిలిపివేశారు. వీటిని నిర్మల్ వైపునకు మళ్లించారు. శాంతి భద్రతల డీజీ మహేశ్ భగవత్ శనివారం నుంచి ఉట్నూరులోనే ఉండి బందోబస్తును స్వయంగా పర్యవేక్షించారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకని పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఆదివాసీలు తప్ప మరొకరు ఈ ప్రాంతంలోకి రాకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే ఏకైక డిమాండ్ ఎప్పటి నుంచో చేస్తున్నారు. ఆ తర్వాత ఉద్యమం కాస్తా చల్లబడినట్లు కనిపించినా, ఇటీవల కాలంలో ఆదివాసీల నేతలు ఉద్యమాన్ని ఉధృతం చేశారు. అందుకోసం ఆదివాసీ సంఘాలన్నీ ఒకే తాటిపైకి వచ్చాయి. తమకు రావాల్సిన రిజర్వేషన్లను దొడ్డి దారిన లంబాడాలు దోచుకుంటున్నారని ఆదివాసీల నేతలు ఆరోపిస్తున్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే దాక తమ పోరాటం ఆగదని స్పష్టం చేస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం

14 అంతస్తులకు తగ్గించడం విరమించుకోవాలి

- ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 23 : గత ప్రభుత్వం టీమ్స్ పేరిట 28 అంతస్తుల మల్టి స్పెషాలిటీ ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణంలో ప్రస్తుత ప్రభుత్వం 28 అంతస్తుల ప్రణాళికను 14 అంతస్తులకు పరిమితం చేయడం విరమించుకోవాలని ఎల్ బి నగర్ ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి అన్నారు. సచివాలయంలో రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్లు, పరిశ్రమలు & వాణిజ్యం, శాసనసభ వ్యవహారాలు శాఖల మంత్రిని ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించిన అనంతరం బాటసింగారం తరలించడం జరిగింది. ఈ గడ్డిఅన్నారం ప్రభుత్వ స్థలంలో టీమ్స్ పేరిట 28 అంతస్తుల మల్టి స్పెషాలిటీ ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ భూమిపూజ చేసినట్లు గుర్తుచేశారు. హాస్పిటల్ నిర్మాణానికి అనుసంధానంగా, తాను తీసుకున్న చొరవతో సమీపంలోని వెయ్యి చదరపు గజాల స్థలంలో పోలీస్ స్టేషన్ కోసం కేటాయించాలని కోరగా, అప్పటి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపిందని తెలిపారు. ఇదే విధంగా హాస్పిటల్‌కు అనుసంధానంగా పోలీస్ స్టేషన్ భవనం, పార్క్, విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం కూడా స్థలం కేటాయించబడిందని, నిర్మాణ పనులు ప్రారంభమైనట్టు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం 28 అంతస్తుల ప్రణాళికను 14 అంతస్తులకు పరిమితం చేయడంతో పాటు, పోలీస్ స్టేషన్, పార్క్, విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలాలను ఇవ్వలేమని స్పష్టం చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో నీటి, విద్యుత్ తదితర సమస్యలు రాకుండా ఉండాలంటే, ఆ స్థలాల్లోనే యథాతథంగా నిర్మాణాలు చేపట్టడం అత్యవసరమని మంత్రిని కోరినట్టు వివరించారు. జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను వసూళ్లలో జరుగుతున్న అవకతవకలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. కొన్ని చోట్ల క్షేత్ర స్థాయి సిబ్బంది మరియు పన్ను తనిఖీదారులు నిబంధనలకు విరుద్ధంగా గత మూడు సంవత్సరాల బకాయిలను వసూలు చేయడమే కాకుండా, అదనంగా రెండు సంవత్సరాల బకాయిలను నగదు రూపంలో డిమాండ్ చేస్తున్నారని, దీంతో అవినీతి అవకాశాలు పెరగడంతో పాటు సాధారణ కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు హాస్పిటల్ ప్రాంగణంలో రద్దు అయిన స్థలాల వివరాలపై రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి, సాధ్యాసాధ్యాలు పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ టాక్స్ అంశంపై కూడా అధికారులతో చర్చించి ఎవరికి అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, సామ తిరుమల రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, జిన్నారం విఠల్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్ రెడ్డి, నాగలక్ష్మి, యాదగిరి ముదిరాజ్, జయశ్రీ, గట్టు శ్రీను, రమణారెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

“



ప్రభాస్ ఫొటో జేబులో పెట్టుకొని పనిచేశా. ఆయన ఫొటో ఉంటే ఎవరైనా టాప్ డైరెక్టర్ అయిపోతారు. ఫ్యాన్స్ కోసమే ప్రభాస్ ఈ పాట చేశారు. కేరింతలతో థియేటర్స్ రీసౌండ్ వస్తాయి. ముగ్గురు హీరోయిన్స్‌తో ఆయన కెమిస్ట్రీ స్క్రీన్‌పై చూడాలి. రిలీజ్‌కు ముందే అందరూ రెబల్ ఆరాలో ఉంటారు. ఫ్యాన్స్‌ను దృష్టిలో పెట్టుకునే వర్క్ చేస్తున్నా.

- 'రాజాసాబ్' ఫస్ట్ సింగిల్ రిలీజ్లో దర్శకుడు మారుతి





బీసీలకు రాజ్యాంగపరంగా వాటా కావాలి

- చేనేత కార్మికులు, నిర్వాసితులను ఆదుకోవాలి
- ఆరోగ్య సేవలపైనా ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, వనపర్తి, నవంబర్ 23: బీసీలకు పార్టీలు నిర్ణయించే రిజర్వేషన్లు కాకుండా రాజ్యాంగ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తేనే వారికి న్యాయం జరుగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆదివారం ఆమె వనపర్తి మండలంలో పర్యటించారు. చేనేత కార్మికుల సమస్యలు, రిజర్వాయర్ నిర్వాసితుల పరిస్థితి, వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను ప్రభుత్వానికి బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు. కొత్తకోటలో చేనేత కార్మికుల కష్టాలను దగ్గరగా పరిశీలించారు. నాగరికతకు సూచికగా భావించే బట్టలను నేసే చేనేత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులలో జీవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేనేత కార్మికులకు పెన్షన్, నూలు సబ్సిడీలను అందించిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సబ్సిడీలను నిలిపివేయడంతో వారికి పెన్షన్ తప్ప వేరే ఆధారం లేకుండా పోయిందని విమర్శించారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో అనేక మంది నేత కార్మికులు వృత్తిని విడిచి కూలీ పనులు చేయడానికి సిద్ధమవుతున్నారని అన్నారు. పెండింగ్ లో ఉన్న సబ్సిడీలను వెంటనే విడుదల చేసి, చేనేత యువత ఈ కళను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలు, లోన్లు, ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.

రిజర్వాయర్ నిర్వాసిత మహిళలతో

అనంతరం కవిత కానాయపల్లి శంకర మహాసముద్రం రిజర్వాయర్ నిర్వాసిత మహిళలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 12 యేండ్లు గడిచినా నిర్వాసితులకు గృహాలు అందకపోవడం దురదృష్టకరమని అన్నారు. మల్లన్నసాగర్, మిడ్ మానేరు, రంగనాయకసాగర్ నిర్వాసితులకు ఇచ్చిన విధంగానే ఇక్కడి వారికి కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వనపర్తి మాతా-శిశు సంరక్షణ కేంద్రం, ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సిబ్బంది కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. చక్కగా నిర్మించిన ఆసుపత్రికి టౌన్ నుండి దూరంగా ఉండటం వల్ల పరీక్షల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసరంగా వైద్య సిబ్బందిని పెంచాలని సూచించారు. సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం, మెయింటెనెన్స్‌కు నిధులు లేకపోవడం, మందుల కొరత వంటి సమస్యలను ఆమె ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. పెబ్బేరు మార్కెట్ యార్డును సందర్శించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





మా కుమారుడి నిశ్చితార్థానికి రండి

- గవర్నర్, సీఎంకు డీసీఎం భట్టి విక్రమార్క ఆహ్వానం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పెద్ద కుమారుడు సూర్య విక్రమాదిత్య నిశ్చితార్థం ఈ నెల 26న జరగనుంది. ఈ కార్యక్రమానికి రావలసిందిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని భట్టి విక్రమార్క ఆదివారం నాడు కుటుంబ సమేతంగా కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అందజేసారు. ఉప ముఖ్యమంత్రి సతీమణి అమ్మ ఫౌండేషన్ చైర్మన్ నందిని విక్రమార్క, కుమారుడు సహేంద్ర విక్రమాదిత్య, సోదరుడు ఎంపీ మల్లు రవి వారి వెంట ఉన్నారు.

సీఎం ఇలాకాలో తొలి సైనిక్ స్కూల్

- హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ లో ఏర్పాటు
- 24న భూమి పూజ చేయనున్న రేవంత్‌రెడ్డి
- 11 ఎకరాల స్థలం కేటాయించిన విద్యా శాఖ



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23: రాష్ట్రానికి తొలి సైనిక్ స్కూల్ మంజూరు కానుంది. వికారాబాద్‌జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధి దుద్యాల మండలం హకీంపేట ఎడ్యుకేషన్ హబ్‌లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 21న నిపుణుల కమిటీ స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసింది. త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈనెల 24న ముఖ్యమంత్రి భూమిపూజ చేయనున్నారు. స్థలం, భవనాల నిర్మాణం, ఇతర నిర్వహణ ఖర్చులన్నీ రాష్ట్ర ప్రభుత్వానివేనని, నిబంధనల ప్రకారం అవన్నీ ఉంటే కేంద్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో మంజూరు చేస్తుందని, దాదాపు 11 ఎకరాలకు పైగా స్థలం కేటాయించామని విద్యా శాఖ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. రాష్ట్రంలో ఏడు ప్రభుత్వ సంస్థలను సైనిక్ స్కూళ్లుగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో రంగారెడ్డి, హన్మకొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల నుంచి మూడు జిల్లా పరిషత్తు పాఠశాలలు, వికారాబాద్, మేడ్చల్, సంగారెడ్డి, ములుగు జిల్లాల నాలుగు జనరల్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఉన్నాయి. వికారాబాద్ జిల్లాలో కొత్తగా (గ్రీన్‌ఫీల్డ్) సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఆడబిడ్డలకు సారె, చీర తెలంగాణ సంస్కృతి

- మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తాం
- రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు
- జీవనజ్యోతి మహిళా సమాఖ్యకు రూ.634 కోట్ల చెక్కు అందజేత



ప్రతిపక్షం ప్రతినిధి, రంగారెడ్డి, నవంబర్ 23: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ, వారిని ఉన్నత స్థానంలో నిలుపుతామని జిల్లా ఇన్చార్జి మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ"కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆడబిడ్డలకు సారె, చీర పెట్టడం తెలంగాణ సంప్రదాయమని, ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అన్నారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 108 వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని దాదాపు కోటి మంది మహిళలకు ఇందిరా మహిళా శక్తి పంపిణీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు, 18 యేండ్లు నిండిన ఆడపడుచులకు గ్రామీణ ప్రాంతాలలో 65 లక్షల చీరలు, పట్టణాలలో 35 లక్షల చీరల చొప్పున కోటి చీరలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాలు నిర్ణయించిన మోడల్ చీరలను పంపిణీకి ఎంపిక చేశామని తెలిపారు. మహిళలకు ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

అన్ని రంగాలలో ముందుండాలనే

రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్ బంకుల ఏర్పాటు, బస్సుల కొనుగోలు వంటి వ్యాపారంలో మహిళా సంఘాలకు ప్రభుత్వం తోడ్పాటును అందించి వారిని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చూస్తోందని మంత్రి అన్నారు. చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగాలని, మహిళలు అన్ని రంగాలలో ముందుండాలనే ఉద్దేశంతో సోలార్ పవర్ ప్లాంట్ లు, ఆర్టీసీ బస్సుల కేటాయింపు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగస్వామ్యం చేస్తోందన్నారు. జీవనజ్యోతి జిల్లా మహిళా సమాఖ్య సంఘానికి రూ.634 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహా రెడ్డి, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, శాసన సభ్యులు మాల్ రెడ్డి రంగారెడ్డి, వీర్లపల్లి శంకర్, ఆర్ అండ్ బి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, సంబంధిత అధికారులు, జిల్లాకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మంత్రుల వాట్సాప్ గ్రూపులు హ్యాక్

- మళ్లీ రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు
- ఎస్‌బీఐ కేవైసీ పేరుతో ఏపీకే ఫైల్స్ షేర్
- ఓపెన్ చేయొద్దని పోలీసులు హెచ్చరిక



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23: ప్రభుత్వం ఎన్ని పటిష్ట చర్యలు తీసుకుంటున్నా సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. రకరకాలుగా మోసాలు చేస్తూ అమాయక ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ప్రభుత్వ వెబ్ సైట్లను సైతం హ్యాక్ చేస్తూ సవాలు విసురుతున్నారు. తాజాగా అలాంటి ఘటనే మరొకటి జరిగింది. పలువురు తెలంగాణ మంత్రుల వాట్సాప్ మీడియా గ్రూపులు హ్యాక్ అయ్యాయి. ఎస్‌బీఐ కేవైసీ పేరుతో ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు షేర్ చేశారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని సందేశాలు పంపి గ్రూపులను హ్యాక్ చేశారు. వీటిని ఓపెన్ చేయొద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచిస్తున్నారు. ఎస్‌బీఐ ఆధార్ అప్‌డేట్ పేరుతో హ్యాకర్లు ఏపీకే ఫైల్స్‌ను పంపి వాటిని ఓపెన్ చేసిన వెంటనే ఫోన్‌ను తమ నియంత్రణలోకి తీసుకుంటారు. అలా పలు మీడియా గ్రూపులు, సీఎంఓ గ్రూపులు, డిప్యూటీ సీఎంఓ గ్రూపులు, మంత్రుల అధికారిక గ్రూపులను హ్యాకర్ల తమ నియంత్రణలోకి తీసుకున్నట్లు సమాచారం. మంత్రుల పీఆర్వోల ఫోన్లు, జర్నలిస్టుల ఫోన్లూ హ్యాక్ అయ్యాయని సందేశాలు వస్తున్నాయి. ఈ ఘటనతో సైబర్ పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. హ్యాకైన వాట్సప్ గ్రూపులను సురక్షితంగా ఉంచారు. హ్యాకర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏపీకే ఫైల్స్ వస్తే ఎట్టి పరిస్థితులలో వాటిని ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు.

వైభవంగా సత్యసాయి శత జయంతి

- సత్యసాయి దివ్య చరిత్ర ప్రవచనం



ప్రతిపక్షం, షాద్ నగర్, నవంబర్ 23: భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి వేడుకలు పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం తెల్లవారుజామున మహా నగర సంకీర్తన, అనంతరం మహా రుద్రాభిషేకం, గద్వాల పట్టణానికి చెందిన కాశీ విశ్వనాథ భాగవతార్ చే సత్యసాయి దివ్య చరిత్ర ప్రవచనం నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ గావించారు. సాయంత్రం మహా భజన, మహిళలచే స్వామి వారికి ఊయల సేవ, చిన్నారులచే కేక్ కటింగ్, మహా మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్, మునిసిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్, పట్టణ ప్రముఖులు బెజగం రమేష్, సరాపు జగదీశ్వర్, సమితి గౌరవ అధ్యక్షులు ఎం. వెంకటయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత, సమస్యల రహిత ఆధునిక మెట్రో నగరం కోసం ప్రభుత్వం కృషి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి
- హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ



ప్రతిపక్షం, సిటి బ్యూరో , నవంబర్ 23: నగర రహదారుల సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు జిహెచ్ఎంసి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గదర్శకత్వంలో, గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ ప్రగతిశీల చర్యలను ముందుకు తీసుకెళుతున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని డివిజన్లలో రోడ్ల అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్ రద్దీకి దారితీసే దెబ్బతిన్న రోడ్లు, మురుగునాల సమస్యలు, స్ట్రీట్ లైట్లు ఇతర పౌర అవసరాలపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డిప్యూటీ మేయర్ ఆదేశించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణ స్పందనతో ప్రమాణితంగా పనులు పూర్తి చేయాలని డిప్యూటీ మేయర్ స్పష్టం చేశారు. అంతేకాక, నగర అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే పౌరులు, ప్రజాప్రతినిధులు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ మేయర్ కోరారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ రహిత, సమస్యల రహిత ఆధునిక మెట్రో నగరంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం సంకల్పబద్ధంగా ముందుకు సాగుతుందని, దానికి అనుగుణంగా జిహెచ్ఎంసి పనితీరును మరింత బలోపేతం చేయడం లక్ష్యమని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ తెలిపారు.

జీఓ 46తో బీసీల రాజకీయ సమాధి

- రద్దు చేసే వరకు మా పోరాటం ఆగదు
- బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్
- జీఓ 46 ప్రతులను చించివేసి నిరసన



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, నవంబర్ 23: బీసీ రిజర్వేషన్ శాతాన్ని తగ్గిస్తూ తీసుకువచ్చిన జీఓ 46 ను తక్షణమే రద్దు చేయాలని జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. లేదా బీసీల ఆగ్రహానికి రాష్ట్ర ప్రభుత్వం గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు అంబర్ పేట మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ముందు జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణా, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తో కలిసి జీఓ ప్రతులను చించి వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం వల్లనే ఆగమేఘాలతో జీఓ నెంబర్ 46 తీసుకువచ్చారని ఆరోపించారు, రాష్ట్రంలో రెడ్లను ఎక్కువగా సర్పంచులను చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. బీసీలను రాజకీయంగా అణిచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో మద్దతిచ్చిన రెండు పార్టీలు ఇప్పుడు మాట మార్చి బీసీలకు ద్రోహాన్ని తలపెట్టాయన్నారు. జీఓ నెంబర్ 46 తో జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు రాష్ట్రవ్యాప్తంగా 18 శాతం రిజర్వేషన్లు మాత్రమే వర్తిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల గురించి కేంద్ర ప్రభుత్వంపై పోరాడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పారిపోతోందని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే వరకు తాము పోరాటాన్ని ఆపేది లేదని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ బొల్లెపల్లి స్వామి, రాష్ట్ర నాయకులు నందగోపాల్, ఉదయనేత, గూడూరు భాస్కర్ మీరు, సత్యరాజు గౌడ్, బూర శీను, మధు యాదవ్, తాంపాటి వెంకట్, గుంటి మహేష్, తదితరులు పాల్గొన్నారు



తైవాన్‌పై చైనా కవ్వింపు చర్యలకు పాల్పడితే సైనిక జోక్యానికి జపాన్ వెనుకాడదని ఆ దేశ ప్రధాని సనై తకాయిచి అన్నారు. జపాన్‌రెడ్ లైన్ క్రాస్ చేసింది. జపాన్ సైనికవాదం పెరగకుండా నిరోధించాల్సిన బాధ్యత అన్ని దేశాలపై ఉంది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించేలా తకాయిచి కామెంట్లు ఉన్నాయి.

-చైనా మినిస్టర్ వాంగ్ యీ

బహుళ

వారసత్వం

నాగరికతకు అద్దం: వారసత్వ సంపద

చరిత్రను అర్థం చేసుకోవడానికి, దేశాల సంస్కృతిని నిలబెట్టడానికి, పర్యాటక అభివృద్ధి ద్వారా ఆర్థిక ప్రగతికి, భవిష్యత్తు తరాలకు జ్ఞానాన్ని అందించడానికి, ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక అవగాహన పెంచడానికి ఇవి మనకు అవసరం. వారసత్వాన్ని కోల్పోవడం అంటే, ఒక నాగరికత కథనే కోల్పోవడం. వారసత్వ సంరక్షణ – మనందరి బాధ్యత. ఈ చారిత్రక నిధులు ప్రభుత్వాలకే చెందినవి కావు. మనందరి సంయుక్త బాధ్యత. రోజువారీగా మనం చేయగల చిన్న ప్రయత్నాలే గొప్ప రక్షణగా మారుతాయి. కట్టడాల వద్ద శుభ్రత పాటించాలి. గోడలపై రాయడం, చెక్కడం మానాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి. స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి.



కనపర్తి సుధాకర్
94413 13780

మానవ చరిత్ర అనేది కాలం అనే మహానదిలో నిరంతరం ప్రవహించిన సాంస్కృతిక ప్రవాహం. శతాబ్దాలుగా ఎన్నో సామ్రాజ్యాలు, మహా సంస్కృతులు, లోకాన్ని మార్చిన ఆలోచనలు, అద్భుత కళలు, మర్మగుహలు, శిల్పాలు, సాంప్రదాయాలు ప్రపంచాన్ని తమ ప్రభావంతో శాశ్వతంగా మార్చాయి. భూమి మీద మానవాళి వేసిన ప్రతీ అడుగు జాడ, ప్రతీ ఆవిష్కరణ, ప్రతీ నిర్మాణం చరిత్ర అనే గ్రంథంలో చెరగని ముద్ర. ఆ ముద్రలన్నింటినీ నేటికీ సజీవంగా చూసే అవకాశం మనకు కల్పించే గొప్ప సంపదే ప్రపంచ వారసత్వం. ప్రకృతి సృష్టించిన అద్భుతాలు కావచ్చు, మనిషి నిర్మించిన వైభవోపేత కట్టడాలు కావచ్చు. ఇవన్నీ కలిసి ప్రపంచ నాగరికతను అద్దంలా ప్రతిబింబిస్తాయి. ఈ అమూల్య సంపదలను గుర్తించేందుకు, రక్షించేందుకు, ప్రపంచ పౌరులలో చైతన్యం పెంచేందుకు యునెస్కో ప్రతీ సంవత్సరం నవంబర్ 19 నుంచి 26 వరకు 'ప్రపంచ వారసత్వవారోత్సవాలు' నిర్వహిస్తున్నది. ఈ వారోత్సవాలు కేవలం వేడుకలు మాత్రమే కావు. మన చరిత్రను, మన మూలాలు, మన సాంస్కృతిక అస్మితను గుర్తు చేసే అంతర్జాతీయ వేదికలు.

వారసత్వం అంటే ఏమిటి?

చాలామందికి వారసత్వం అంటే కట్టడాలు, గుహలు, దేవాలయాలు మాత్రమే అనిపించవచ్చు. కానీ వారసత్వం అనేది ఎంతో విశాల భావన. వారసత్వం అంటే, కాలం పరీక్షను జయించిన కళలు. అనేక తరాల అనుభవంతో ఏర్పడిన ఆచారాలు. మనిషి చేత నిర్మించిన శాశ్వత చిహ్నాలు. ప్రకృతి ఇచ్చిన అద్భుతాలు. సంస్కృతులు, జీవన విలువల సమ్మేళనం. అంటే, ప్రకృతి, సంస్కృతి చరిత్ర ఈ మూడు కలిసినపుడే 'వారసత్వం' అనే మహాసంపద రూపుదాలుస్తుంది. మానవజాతి ఎన్నో రూపాలు, ఎన్నో భాషలు, ఎన్నో మతాలు కలిగి ఉన్నా వారసత్వం అందరినీ ఒకే వేదికపై ఉన్న మనుషులుగా ఏకం చేస్తుంది. భారతదేశం - ప్రపంచ వారసత్వానికి అద్భుత ప్రతిరూపం భారతదేశం ప్రపంచంలోని అత్యంత పురాతన నాగరికతలలో ఒకటి. భారతదేశంలోని ప్రతి ప్రాంతం ఒక కళ, ఒక సంస్కృతి, ఒక కథ. అందుకే భారత్‌ను 'వారసత్వాల దేశం' అని పిలుస్తారు. భారత వారసత్వ సంపద ఆణిముత్యాలు. అజంతా - ఎల్లోరా గుహలలోని చిత్రశిల్ప సంపద. ఖజురాహో శిల్ప కళా కాంతులు, హంపి - బాదామి - పట్టదకల్ వంటి చరిత్ర శిల్పకళలు, తాజ్ మహల్ - ప్రేమకు ప్రతీక, కోణార్క సూర్య దేవాలయం శిల్ప వైభవం, రామప్ప దేవాలయం నాట్య కళా భంగిమలు, కుతుబ్ మినార్, బృహదీశ్వర ఆలయం, కజిరంగా, సుందర్‌బన్స్ వంటి సహజ వారసత్వ సంపద.

ప్రతి శిల్పం, ప్రతి గుడి, ప్రతి కోట

ఇవి మాత్రమే కాదు, భారతదేశంలోని ప్రతి శిల్పం, ప్రతి గుడి, ప్రతి కోట, ప్రతి రాజభవనం దేశపు సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి. భారత వారసత్వం ఎన్నో రూపాలు కలిగిన బహురూపిని. ఒకే దేశంలో హిమాలయ పర్వతాలు, సముద్రతీరాలు, ఎడారులు, అరణ్యాలు, పురావస్తు శిథిలాలు, దేవాలయాలు, మసీదులు, చర్చిలు ఇవన్నీ భారత నాగరికతను అంతర్జాతీయ పటంలో ప్రత్యేకం చేస్తున్నాయి. ప్రపంచ వారసత్వ సంపదను ఎందుకు సంరక్షించాలి? వారసత్వం అంటే గతం యొక్క జ్ఞాపకం మాత్రమే కాదు. ఇది భవిష్యత్తుకు మార్గసూచి కూడా.



ఇవి మనకు ఎందుకు అవసరం?

చరిత్రను అర్థం చేసుకోవడానికి, దేశాల సంస్కృతిని నిలబెట్టడానికి, పర్యాటక అభివృద్ధి ద్వారా ఆర్థిక ప్రగతికి, భవిష్యత్తు తరాలకు జ్ఞానాన్ని అందించడానికి, ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక అవగాహన పెంచడానికి ఇవి మనకు అవసరం. వారసత్వాన్ని కోల్పోవడం అంటే, ఒక నాగరికత కథనే కోల్పోవడం. వారసత్వ సంరక్షణ - మనందరి బాధ్యత. ఈ చారిత్రక నిధులు ప్రభుత్వాలకే చెందినవి కావు. మనందరి సంయుక్త బాధ్యత. రోజువారీగా మనం చేయగల చిన్న ప్రయత్నాలే గొప్ప రక్షణగా మారుతాయి. కట్టడాల వద్ద శుభ్రత పాటించాలి. గోడలపై రాయడం, చెక్కడం మానాలి. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి. స్థానిక కళాకారులను ప్రోత్సహించాలి. ప్రభుత్వం చేపట్టే సంరక్షణ కార్యక్రమాలకు సహకరించాలి. మన చిన్న పనులు శతాబ్దాల చరిత్రను కాపాడే గొప్ప సేవ. సహజ వారసత్వం - ప్రకృతి ఇచ్చిన అమూల్యమైన ధనం. మనిషి చేత నిర్మించిన వారసత్వం ఎంత గొప్పదో, ప్రకృతి ఇచ్చిన సహజ వారసత్వం అంతకంటే గొప్పది.

వారసత్వం మానవజాతి ఉమ్మడి ఆస్తి

నదులు, పర్వతాలు, అరణ్యాలు, జలపాతాలు, వన్యజీవులు, పక్షులు, ఇవి భూమికి శ్వాస వంటివి. ప్రకృతిని కాపాడితేనే భూమి నిలుస్తుంది. ప్రకృతిని నాశనం చేస్తే నాగరికతే ప్రమాదంలో పడుతుంది. 'వారసత్వం మానవజాతి ఉమ్మడి ఆస్తి' దేశాలు వేరు కావచ్చు, భాషలు వేరు కావచ్చు. కానీ, వారసత్వం మొత్తం మానవజాతిదే. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు మనకు అందించే ప్రధాన సందేశం. వారసత్వాన్ని కాపాడటం అంటే నాగరికతను కాపాడటం. మన కర్తవ్యమే వారసత్వాన్ని గౌరవించడం. సంస్కృతులను, ప్రకృతిని సంరక్షించడం, తరతరాలకు జీవించి ఉన్న చరిత్రను అందించడం. వారసత్వం - మానవత్వాన్ని కలిపే వారధి. వారసత్వం కేవలం గోడలపై చెక్కిన శిల్పం కాదు.

అది మనిషి ఆలోచన, ప్రతిభ, సృజనాత్మకతకు చిరస్థాయి గుర్తు. వారసత్వం మనిషిని జ్ఞానం వైపు నడిపిస్తుంది. సంస్కృతి వైపు దగ్గర చేస్తుంది. భవిష్యత్తును నిర్మించేందుకు ప్రేరణ ఇస్తుంది. ప్రపంచదేశాల మధ్య స్నేహాన్ని పెంచుతుంది. కాబట్టి, "వారసత్వాన్ని కేవలం సందర్శించకూడదు, సంరక్షించాలి. ప్రపంచ వారసత్వం అనేది మానవ చరిత్రను, మన నాగరికతను, మన విలువలను శాశ్వతంగా నిలబెట్టే అద్దం. మనం ఈ అద్దాన్ని కాపాడితేనే భవిష్యత్తు తరాలు తమ చరిత్రను చూస్తాయి. వారసత్వం అంటే గతం గౌరవం. సంరక్షణ అంటే భవిష్యత్తుకు ఇచ్చే బహుమానం.

(వ్యాస రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల, కరీంనగర్)

పరిచయం

డోగ్రీ సాహిత్య గజల్ దీపిక విజయ్ వర్మ



డా.టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

పద్మ సచ్ దేవ్, మధుకర్ వంటి ప్రసిద్ధ కవులను అందించిన డోగ్రీ సాహిత్యంలో ప్రసిద్ధ గజల్ కవిగా పేరుపొందిన విజయ్ వర్మ ఆకాశవాణి, న్యూఢిల్లీ కేంద్రంలో డోగ్రీ సీనియర్ రీడర్ గా పనిచేశాడు. ఆయన సుదీర్ఘ గజల్ గ్రంథం 'దౌన్ సదియాన్ ఏక్ సీర్' 2023లో సాహిత్య అకాడమీ అవార్డ్ సమ్మాన్ అందుకున్న గొప్ప కవి, అనువాదకుడు, విద్యార్థి దశ నుండి కవిత్వం రాయడం నేర్చుకున్న విజయ్ వర్మ జమ్మూ జిల్లాలోని సెరి పండితాన్ కుగ్రామంలో 13 ఏప్రిల్,1962లో జన్మించిన అతని తల్లిదండ్రులు కృష్ణదేవి, దీనా నాథ్ వర్మ దంపతులు. ఇంగ్లీషు, హిందీలోనూ రాయగల ఆయన తన మాతృభాష డోగ్రీలోనూ రాస్తాడు. జమ్మూ, న్యూఢిల్లీ ఆకాశవాణి కేంద్రాలలో సీనియర్ వార్తా చదువరిగా, డోగ్రీ అనువాదకుడుగా, ప్రసారకర్తగా పనిచేశారు. డోగ్రీ సాహిత్యంలో 1994లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర కళలు, భాషా సాంస్కృతిక శాఖ నుండి యువ పురస్కారం అందుకున్న విజయ్ వర్మ ఆరు గ్రంథాలను రచించారు. అందులో ఏక దీర్ఘ గజల్ 'దౌన్ సదియన్ ఎక్ సీర్' కూడా ఒకటి. ఈ గజల్ ప్రక్రియ పర్షియన్,ఊర్దూ భాషల నుండి వచ్చిన ప్రేమ కళా సౌందర్య గేయ సౌగంధి. మీర్జా గాలిబ్ ఈ ప్రక్రియలో ప్రసిద్ధ కవి. ఆ తర్వాత దాదాపు అన్ని భారతీయ భాషలలోనూ వ్యాప్తి చెందింది. ఇతివృత్తంలో సామాజిక సమస్యలు, శ్రమ, బాధ, దుఃఖం, చెలిమి వంటి సామాజిక ఇతావృత్తాలు రూపుదిద్దుకున్నవి. తెలుగులో మహాకవి దాశరథి, గాలిబ్ గీతాలు, సినారె గజళ్లు ప్రసిద్ధం. రాజాస్థానాల నుండి జన సామాన్యంలోకి గజల్ ప్రక్రియ ప్రయాణించింది. భారతీయ సాహిత్యంలో ఏక దీర్ఘ గజల్ గ్రంథం721 ద్విపదలున్న 'దౌన్ సదియాన్ ఎక్ సీర్' ప్రత్యేకించి డోగ్రీలో గజల్ ప్రయాణాన్ని కలుపుతుంది. విజయ్ వర్మ గజల్ ప్రక్రియలో సంప్రదాయ పరిమళము భాషా పరిపుష్టి మిళితమై ఉంది.

ఆధునిక దృశ్య ఆవిష్కరణ

ఆధునిక దృశ్య ఆవిష్కరణ ప్రపంచపుటంచులు అవధులకు ఆవల ఉంటుంది కవి అద్భుత కృషి. డోగ్రీ ప్రేమికులకు గర్వకారణంతో పాటు కొత్త చరిత్రను డోగ్రీలో, భారతీయ సాహిత్య సీమలో సృష్టించారు. ఆయన విజయ్ వర్మ.డోగ్రీ కవి 'కలి రే ది కౌడీ'(కలి రే ది కౌడీ),మరో నాలుగు కవితా సంకలనాలు కూడా రాశారు. 2023లో, ఆయన 'దౌన్ సడియాన్ ఏక్ సీర్' అనే గజల్ విజయ్ వర్మ డోగ్రీలో రాసిన చాలా పాపులర్ గ్రంథం. అందులోని ఓ గజల్ మచ్చుకు నా తెలుగు అనువాదంతో ఇక్కడ. 'నాకు ఏదైనా జరిగితే, ఇతరులు ఏమి చేయాలి?' ఈ గజల్ ప్రేమ, హృదయ వేదనను జీవిత సంక్లిష్టతలను అందంగా వ్యక్తపరుస్తుంది. దుఃఖాన్ని ప్రతిబింబిస్తుంది కూడా. దీని పూర్తి సాహిత్యాన్ని తెలుసుకోవడం కష్టమే అయినా, భావాన్ని తెలిపే నాలుగు పంక్తులు ఇలా, 'ప్రేమ అనే వ్యాధి వస్తే, ఇతరులు ఏడుస్తారు / రాంఝా హీరోలు, ఇతరుల కోసం ఏడ్చారు / మీరు ఎవరి హృదయాన్నైనా అడిగితే / బాధ అనే పేరు వస్తే, ఇతరులు ఏడుస్తా




రు/ఇతరులు ఏమనుకుంటారో, అప్పుడు ఇతరులు ఏడవనివ్వండి/

సాహిత్య అకాడమీ అవార్డు

ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ఈ గ్రంథం అందుకోవడం డోగ్రీ సాహిత్యానికి దక్కిన గౌరవం అని చెప్పొచ్చు. అలాగే కవి విజయ్ వర్మకు గుర్తింపుగా భావించవచ్చు కూడా. ప్రపంచవ్యాప్తంగా ఒప్పుకోబడిన శాంతి ,ప్రేమ,దయ, సోదర భావాల ప్రక్రియ గజల్ అని అనుభవజ్ఞులైన సాహిత్యకారుల ఉవాచ. ఈ గజల్ గ్రంథం గుండె నుండి హృదయం వరకు తడిమే కవి అంతరంగం కవిత్వ వ్యంగ్య ముసుగులో సంతోషించే వాస్తవాలు చూపించింది .ఈ గజల్ గ్రంథం మొత్తంగా దయ, సామాజిక, భాషా సాంస్కృతిక, ఆర్థిక రంగాలనూ ప్రస్తవించిందని కవి ఒకచోట అభిప్రాయపడడం ఆయన ఆలోచనా విస్తృతికి నిదర్శనం.ఈ ప్రక్రియలో సాంకేతికత,పద విన్యాసము ప్రధాన పిల్లర్స్ గా ఉన్నాయని అంటారు వర్మ. కవి విజయ్ వర్మ డోగ్రీలో రికార్డు స్థాయిలో సుదీర్ఘమైన గజల్ రాసిన, ఇప్పటిదాకా ఉన్న నిషేధాలు,ఆక్షల సంకెళ్లను బద్దలు కొట్టిన స్వేచ్ఛా పతాక.

(పరిచయకర్త కవి, విమర్శకులు, రచయిత)



ఎడారి వసంతం-28

గొలుసు కథ

సింగిడి
పేజీ 11లో

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

కవిత

రేచుక్కలు

పాపలు పాపలు
మనకను పాపలు
కదిలె జీవ ప్రతిమలు
పలుకుల చిలుకలు


నవ్వితే వికసిత కుసుమాలు
తడబడె అడుగుల అంచ నడలు
తూలుతూ వడిగ సాగుతూ
దూకె చిరు జలపాతాలు

అమ్మనాన్నల
జీవన రాగాలు
ఎదిగె కోరికల
నును లేత కొమ్మలు
దేశ ప్రతిభ ప్రభలు
కీర్తి చిరు కిశోరాలు
గుడిబడి పిల్లలు
భువి మెరుపు తీగలు

రేపటి రేచుక్కలు
దేశ గౌరవ పతాకాలు
భారత బాల నిర్మాతాలు
కలల తీరం చేర్చెనావలు



– రేడియమ్
9291527757



నింగి కెగసిన జనగీతం

నీ మరణ వార్త దావానలంలా పాకింది,
తెలంగాణ సమాజం నీ యాదిలో మునిగింది.
ఉద్యమ సమయంలో పాటైన నీ జీవాక్షరం,
ఇప్పుడు నిప్పులవానై గగనమంతా వ్యాపించింది .
నువ్వు అనాథగా మొదలై ఆకాశమైపోయావు,
అక్షరాలకంటే అవనియే నా పాఠశాలన్నావు.
జనాల హృదయాల్లో జానపదాన్ని నింపావు,
ఉద్యమ మనసుల్లో జ్వాలగా వెలిగావు.
"జై బోలో తెలంగాణ" నీ ఊపిరి గీతమైంది,
నీ కలం ఊరంతా నడిచిన చరిత్రయింది.
ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన వేళ,
నీ పాట ప్రజల గుండెల్లో మార్మోగింది.
అందెశ్రీ నీ ఆకాల మృత్యువు శరీరానికే,
నీ ఆశరీర అక్షర గీతికలకు కాదు.
నీ భావాలు, నీ పాటలు, నీ మాటలు,
ఈ పోరాట గడ్డపై శాశ్వత అగ్నిజ్వాలలు.
నీ గేయాత్మ ఇప్పుడు గాంధర్వమై విస్తరిస్తూ
జనపదమై ఇంటింటా వినిపిస్తోంది.
"జయ జయ హే తెలంగాణ జననీ" అంటూ
నింగి కెగసిన జనగీతమై ప్రతిధ్వనిస్తోంది.



డా. వాసాల వరప్రసాద్,
కరీంనగర్, 9490189847

సమీక్ష

శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సమాహారం




డా. కె. ఆనంద కిషోర్
0000

యేచన్ చంద్రశేఖర్ రచించిన 'వ్యాస చంద్రిక 1' శాస్త్ర సాంకేతిక విజ్ఞాన సమాహారం ఇటీవల ఆవిష్కరించబడింది. ఇందులోని 40 వ్యాసాలలో రచయిత ఇటీవలి శాస్త్రీయ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రయత్నాలను పరిశోధన ఆధారిత ప్రామాణిక సమాచారంతో వివరించారు. ఈ వ్యాసాలను క్షుణ్ణంగా చదివిన అనంతరం నేను ఆయన సమాచార సేకరణ, రచనాశైలి పట్ల ఆకర్షితుడనయ్యాను. ఈ వ్యాసాలలోని సమాచారం కేవలం ప్రామాణికమైనది మాత్రమే కాదు, సరళమైన భాషలో సాధారణ ప్రజలకు ప్రత్యేకించి మన విద్యార్థులకు, యువతకు, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా అందించారని నా అభిప్రాయం. వివిధ రంగాలకు చెందిన శాస్త్ర సాంకేతిక విషయాలను స్పష్టంగా విభిన్న వర్గాల పాఠకుల ప్రయోజనాల కోసం పుస్తక రూపంలో తీసుకువచ్చినందుకు నేను చంద్రశేఖర్‌ను అభినందిస్తున్నాను. నాకు ఇది 'భారత ప్రజల కోసం, తద్వారా ప్రపంచం కోసం విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత' అనే పుస్తకంలా అనిపించింది. ఉదాహరణకు, భారతదేశంలోని వినియోగదారులకు స్వదేశీ నావిక్ అమెరికా జీపీఎస్ కంటే ఖచ్చితత్వంతో ప్రామాణిక స్థాన సేవలు అందిస్తుందని ఆయన 'భారత్ NavIC ముందు అమెరికా జీపీఎస్ దిగదుడుపే' అనే వ్యాసంలో వివరించారు.

ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉపాధి

నిరుద్యోగులైన లక్షలాది ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉపాధి కల్పించడంలో సెమీ కండక్టర్ పరిశ్రమ ఎలా సహాయపడుతుందనే విషయాన్ని 'దేశ ప్రగతికి ఊతమివ్వనున్న సెమీ కండక్టర్స్ పరిశ్రమ' అన్న వ్యాసంలో ఆయన చర్చించారు. ఫైబర్ ఆప్టిక్స్ పితామహుడిగా పరిగణించబడే డాక్టర్ నరిందర్ సింగ్ కపానీ వంటి అనేక స్ఫూర్తిదాయక వ్యక్తులు / కథల గురించి కూడా ఆయన ఉద్వేగభరితంగా చర్చించారు. అదే ఫైబర్ ఆప్టిక్స్ అంశంపై డాక్టర్ నరిందర్ సింగ్ కపానీ ఆవిష్కరణ అనంతరం దశాబ్దకాలం తరువాత పరిశోధనలు చేపట్టిన డాక్టర్ చార్లెస్ కావో అనే మరో వ్యక్తికి ఈ ఆవిష్కరణకు గాను భౌతిక శాస్త్రంలో 2009లో నోబెల్ బహుమతి పొందిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అదేవిధంగా, భారత అంతరిక్ష సంస్థ ఇస్రో రెండు మిషన్లు మంగళయాన్, చంద్రయాన్ 3 చంద్రుని దక్షిణ ధృవంపై సాఫ్ట్ ల్యాండింగ్ విజయవంతమైన తర్వాత ఒక్క సారిగా వెలుగులోకి వచ్చిన 'భారతదేశపు రాకెట్ మహిళ' అని పిలువబడే ఇస్రో అంతరిక్ష శాస్త్రవేత్త 'డాక్టర్ రీతూ కరిధల్ శ్రీవాస్తవ' గురించి కూడా ఆయన వివరించారు. విద్యా శాఖ నేపథ్యం కలిగిన వ్యక్తిగా, జిల్లా పరిషత్ స్కూల్ టీచర్ సందీప్ గుండ్ గురించి "కేవలం ఒక్క ఆలోచనతో డిజిటల్ గా మారిన జిల్లా పరిషత్ పాఠశాల' శీర్షికతో రాసిన వ్యాసం నన్ను ఎంతగానో ఆకట్టుకుంది.

ప్రతులకు:
యేచన్ చంద్రశేఖర్
8885050822
హైదరాబాద్
పేజీలు 222 : వెల 250 రూ.



విద్యుత్ సదుపాయం కూడా లేని

మహారాష్ట్రలో విద్యుత్ సదుపాయం కూడా లేని మారుమూల గిరిజన గ్రామం పష్టేపాడలో సందీప్ గుండ్ అనే ఉపాధ్యాయుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలను సౌరశక్తితో నడిచే SMART పాఠశాలగా మార్చారు. ఈ ప్రేరణతో ఇప్పటికే మహారాష్ట్రలో 50,000 పాఠశాలల్లో దీనిని పునరావృతం చేయగా దేశంలోని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో దీనిని పునరావృతం చేయడానికి విద్యా శాఖకు ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇవే కాకుండా ఇటీవల దివంగతులైన కల్యంపూడి రాధాకృష్ణ రావు లేదా సి ఆర్ రావు పై రాసిన "శతాధిక తెలుగు శాస్త్రవేత్తకు అరుదైన అంతర్జాతీయ పురస్కారం", అంధ విద్యార్థుల కోసం వినూత్నమైన పాఠశాల, మేడం క్యూరీ పేర రాసిన "ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీలో నోబెల్ అందుకున్న ఏకైక శాస్త్రవేత్త", లక్షద్వీప్ లో ఐఎన్ఎస్ జటాయు వ్యూహాత్మక నౌకాదళ స్థావరం, భారత్ లో తొలి అంతర్జాతీయ డార్క్ స్కై పార్క్, అబ్దుల్ కలాం ఐలండ్ గా మారిన వీలర్ ఐలండ్, నోబెల్ బహుమతి గెలుచుకున్న అరుదైన గురుశిష్యులు, ప్రపంచంలోనే అరుదైన బ్లడ్ గ్రూప్ 'క్రిబ్ ' (CRIB), భారతదేశ ప్రప్రథమ మహిళా నేర పరిశోధకురాలు, తెలుగు రాష్ట్రంలో శక్తివంతమైన న్యూక్లియర్ సబ్ మెరైన్ బేస్ లాంటి అనేక వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఈ వ్యాసాలు తప్పనిసరిగా మన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు చదవాలని మాజీ విద్యా శాఖ ఉన్నతాధికారిగా నేను కోరుకుంటున్నాను. చంద్ర శేఖర్ ఎంచుకున్న అంశాలతో పాటు వారి రచనా శైలితో పాఠకులు స్ఫూర్తి పొందుతారని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను.

ఈ ప్రపంచాన్ని మెరుగుపరచండి

"మీరు కనుగొన్న దానికంటే మీ ప్రయత్నాలతో ఈ ప్రపంచాన్ని మెరుగుపరచండి" మరియు "సదా సన్నద్ధంగా ఉండండి" అని స్కౌట్ ఉద్యమ పితామహుడు లార్డ్ బెడెన్ పావెల్ చెప్పిన మాటలు కూడా నాకు గుర్తున్నాయి. అలాంటి స్ఫూర్తిదాయకమైన మాటలు పాఠకులకు ఎల్లప్పుడూ, ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో ప్రేరణగా నిలుస్తాయి. చివరగా, పుస్తకంలోని "తేనెటీగలతోనే మానవ మనుగడ" అనే చివరి వ్యాసం నన్ను ప్రేరేపించింది. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పినట్లు ఇవి ప్రాథమికంగా పర్యావరణం మరియు జీవవైవిధ్యాన్ని పరిరక్షించడానికి ఎంతగానో దోహదమవుతాయి. తేనెటీగలపై ఈ వ్యాసం చదువుతున్నప్పుడు నాకు "పువ్వు వికసించినప్పుడు తేనెటీగలు ఆహ్వానించకుండానే వస్తాయి" అన్న రామకృష్ణ పరమహంస మాటలు గుర్తుకు వచ్చాయి. ఈ మాటలలో అంతర్లీనంగా ఉన్న సందేశం ఏమిటంటే, మనం ఆహ్వానించబడినా లేదా ఆహ్వానించబడకపోయినా, సరైన సమయంలో ఎల్లప్పుడూ సత్కార్యాలు చేయాలి. పువ్వుల జీవితకాలం కొన్ని గంటలు లేదా కొన్ని రోజులు మాత్రమే కావచ్చు, కానీ ఆ చిన్న జీవితంలో అవి మానవాళికి అపారమైన సేవ చేస్తాయి. అదే విధంగా, తేనెటీగ జీవితం ఒక నెల నుండి ఒకటిన్నర నెలలు మాత్రమే అయినప్పటికీ అవి మానవాళికి జీవితాన్ని, తీపిని మరియు ఆహారాన్ని అందిస్తాయి. ఇందులో "సేవో పరమధర్మః" అన్న సందేశం నిబిడీకృతంగా ఉంది. రచయిత చంద్ర శేఖర్ అద్భుతంగా చేసిన ఈ సమాజ హిత రచన కూడా రామకృష్ణ పరమహంస చెప్పిన ఆ సత్కార్యాలలో ఒకటియే.ఈ పుస్తకం అలాంటి స్ఫూర్తిదాయకమైన వ్యాసాలతో మన ముందుకు వచ్చినందుకు, నేను దానిని చదివినందుకు ఎంతగానో సంతృప్తి చెందాను.

(సమీక్షకులు ఎస్సీఈఆర్టీ మాజీ డైరెక్టర్)

ప్రాంతీయం

దేశంలో కమ్యూనిస్టులంతా ఏకం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి 'కూనంనేని' పిలుపు
- గోదావరిఖనిలో కార్మిక కుటుంబాల సమ్మేళనం



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 23: సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. దేశంలో వంద సంవత్సరాలుగా ఉన్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని పేర్కొన్నారు. గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ),అర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్మిక కుటుంబాల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టులు ఆయుధాలను వదిలి జన జీవన స్రవంతిలోకి వచ్చి కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం 'ఆపరేషన్ కగార్' పేరుతో వందలాదిమందిని చంపుతున్నా సుప్రీంకోర్టు సుమోటో గా కేసును స్వీకరించడం లేదని అన్నారు. దేశంలో బడుగు బలహీన వర్గాలు పేద ప్రజల అభ్యున్నతికి వంద సంవత్సరాలు గా పోరాడుతున్న పార్టీ సీపీఐ అన్నారు. సింగరేణిలో 1942లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ని ఏర్పాటు చేసి అనేక కార్మిక హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటాలు నిర్వహించిందని అన్నారు. శేషగిరిరావు, మఖ్దూం మొహియుద్దీన్, సర్వదేవబట్ల రామనాథం, నల్లమల్ల గిరి ప్రసాద్, మనుబోతుల కొమరయ్య, విఠల్ రావు లాంటి తెలంగాణ సాయుధ పోరాట యోధులు యూనియన్ ను స్థాపించి కార్మిక హక్కుల కోసం నిరంతరం కృషి చేశారన్నారు.

బీజేపీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు

భాస్కరరావు, కత్తుల కొమురయ్య, చంద దుర్గయ్య, పి.నరసయ్య, వి.టి. అబ్రహం లాంటి కార్మిక నాయకులు ప్రాణ త్యాగం చేశారని కూనంనేని గుర్తు చేశారు. యూనియన్ శ్రేణులంతా పార్టీలో మమేకమై రాబోయే స్థానికసంస్థల ఎన్నికలలో పోటీ చేసి సత్తా చాటాలని పిలుపునిచ్చారు. బీజేపీ లాంటి మతోన్మాద పార్టీలు అభ్యుదయ వాదులందరినీ లేకుండా చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలన్నారు. గోదావరిఖనిలో వంద కుటుంబాలకు సన్మానం చేసి కమ్యూనిస్టు కుటుంబాలుగా తీర్చిదిద్దిన స్థానిక నేతలను ఆయన అభినందించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ మాట్లాడారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షులు ఎల్ ప్రకాష్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, కన్నం లక్ష్మీనారాయణ, కందుకూరి రాజారత్నం, మోటపలుకుల రమేశ్, రంగు శ్రీను, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, విజయ లక్ష్మి, ప్రీతం, సూర్య, ఎంఏ గౌస్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, దప్పు రాజు, జూల మోహన్ తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు.



ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 23 : హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మహాపడి పూజ వైభవంగా జరిగింది. మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలోని మందడి శ్రీశైలం గౌడ్ ఇంట్లో నిర్వహించిన అయ్యప మహా పడి పూజలో స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం వీరభద్రం గురుస్వామి సమక్షంలో మహాపడి పూజ కార్యక్రమం నిర్వహించారు. భక్తిభావం అలవర్చుకున్నప్పుడే శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు.అనంతరం భక్తులకు, స్వాములకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి, మల్లా రెడ్డి, రాఘవేంద్ర గౌడ్, మదన్ గౌడ్, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

వరంగల్ గడ్డ మీద సురంగల్ ముద్దు బిడ్డ

- వరంగల్ ట్రై సిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హాఫ్ మారతాన్
- 130నిమిషాలలో 20కిలోమీటర్ల పరుగు పూర్తి చేసిన కర్రోళ్ల సత్యం



ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 23 : చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మండల పరిధిలోని సురంగల్ గ్రామానికి చెందిన కర్రోళ్ల సత్యం వృత్తి రీత్యా అకౌంట్స్ ఆఫీసర్ అయిన అక్షరం ఆరోగ్యం ఆర్థికం అనే నినాదంతో గ్రామీణ యువతను చైతన్య పరచడమే ప్రవృత్తిగా ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ.. చేవెళ్ల నియోజకవర్గ యువతకు ఆదర్శంగా నిలుస్తున్న అక్షరం యోధుడు తెలంగాణ రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రివర్యులు వాకటి శ్రీహరి ఆదివారం వరంగల్ లో ప్రారంభించారు. హాఫ్ మారతన్ లో పాల్గొన్న సురంగల్ గ్రామానికి చెందిన కర్రోళ్ల సత్యం 130నిమిషాలలో 20కిలోమీటర్ల పరుగు పూర్తిచేసి అందరికి ఆదర్శంగా నిలిచాడు.ఈ సందర్భంగా కర్రోళ్ల సత్యం మాట్లాడుతూ.. ఆరోగ్యానికి మించిన సంపద మరొకటి లేదు వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరు ప్రతి రోజు కనీసం 40 నిమిషాలైన వ్యాయామం చెయ్యాలి అని అన్నారు.



ఉప్పల్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం, సిటీ బ్యూరో, నవంబర్ 23: ఉప్పల్ నియోజకవర్గ అభవృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా డివిజన్ లోని ఎల్లారెడ్డి గూడ తాళ్ళబాయి వద్ద 9 లక్ష రూపాయల నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పల్ నియోజకవర్గ అభవృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్ ను ఆదివారం ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాజబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వజ్జల శేశాంత్, మేడ్చల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్ పాల్గొన్నారు. ప్రతిపక్షం ప్రతినిధి. మేడ్చల్



అరెకేపూడి గాంధీ పార్టీలు మారేదే భూకబ్జాల కోసం

- కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రతిపక్షం, సిటి బ్యూరో, నవంబర్ 23 : శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ డివిజన్ లో బిఆర్ఎస్ ఇంచార్జ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకేపూడి గాంధీ పార్టీలు మారేదే భూకబ్జాలు చేసుకోవడం కోసం అని పార్టీ కోసం పనిచేసే వాళ్ళకే రాబోయే ఎన్నికల్లో అవకాశాలు ఇస్తుంది బిఆర్ఎస్ పార్టీ.9 వేల కోట్ల రూపాయలతో శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృధి చేసింది కేటీఆర్ అని.కెసిఆర్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన బ్రిడ్జిలకు రంగులు వేస్తూ అభివృధి చేశాం అంటున్నారు కాంగ్రెస్ మంత్రులు అని అన్నారు. అని మతాలకు అతీతంగా బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండగలకు ఆడపడుచులకు చీరెలు అందించింది కేసీఆర్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. అబద్ధపు హామీలు తోప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం అని ఎద్దేవ చేశారు.రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కచ్చితంగా కార్పొరేటర్లును గెలిపించుకుందాం అని జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఒక ముఖ్యమంత్రి ఎనిమిది రోజులు జూబ్లీహిల్స్లో తిరిగాడు. స్థానికంగా ఉన్న బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన ప్రజలు 75 వేల ఓట్లు వేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సాయిబాబా , రంగారావు, నవత రెడ్డి,రవికుమార్ యాదవ్ ,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ ఆశయ సాధనే

మనం ఇచ్చే నివాళి

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 23: నవ భారత రాజ్యంగా నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అయన చూపిన మార్గంలో మనందరం నడవడమే ఆయనకు మనం ఇచ్చే గొప్ప నివాళి అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు. ఆదివారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ అశయ సాధన సమితి అధ్వర్యంలో నిర్వహించిన 353 వ జ్ఞాన మాల కార్యక్రమంలో పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అశయ సాధన సమితి అధ్యక్షుడు నత్తి మైసయ్య బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి,కీసర గుట్ట డైరెక్టర్ రాపోలు శంకరయ్య, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్, సుమన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు. దాన గళ్ళయాదగిరి, జై రాములు, రాపోలు ఉపేందర్, రాపోలు రామ స్వామితో పాటు తదితరులు పాల్గొన్నారు,

అర్హత లేని ఆర్ఎంపి డాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రతిపక్షం ప్రతినిధి. మేడ్చల్, నవంబర్ 23: మేడ్చల్ మండలంలో అర్హత లేని ఆర్ఎంపీ డాక్టర్లు చాలామంది చలామణి చేస్తున్నారని, వారిపైన చర్యలు సంభంధిత అధికారులు తీసుకోవాలని సీపీఎం పార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి ఎం నరేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ మండలంలో అర్హత లేకుండా ఆర్ఎంపీ డాక్టర్లు కొంతమంది వైద్యం చేస్తున్నారని, వారి పైన వైద్యాధికారులు ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం వలన ఆర్ఎంపీ డాక్టర్లు రెచ్చిపోతున్నారన్నారు. ఆర్ఎంపీ డాక్టర్లకు ఒక అర్హత ఉంటుందని, వైద్యం చేయాలంటే తప్పకుండా వాళ్ళు ట్రైనింగ్ తీసుకోవాలని, ట్రైనింగ్ అనంతరం వైద్యం చేయాలంటే ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా వైద్యం చేయాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. కానీ ఎటువంటి ట్రైనింగ్ తీసుకోకుండా, ఏదీ చేయకుండా మెడికల్ షాపులలో పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్యం చేయడంవలన చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని దానికి ఉదాహరణ, కిష్టపూర్ లో ఉన్నటువంటి నేరెళ్ల రాజు డాక్టర్ చేసిన వైద్యం కావచ్చు, ఇప్పుడు వార్తల్లో లో వచ్చిన అక్బర్జా పేట కు సంబంధించిన డాక్టర్ మహేష్ విషయమే కావచ్చని, వీరందరూ అర్హత లేకుండా వైద్యం చేయడం వలన ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది ఆర్ఎంపీలు ఆసుపత్రిలోనే సొంతంగా మెడికల్ షాపులు నడిపిస్తూ ఇష్టానుసారంగ రోగులకు మందులు అమ్ముతున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలతో చెలగటమాడుతున్నటువంటి ఆర్ఎంపిలపైన వెంటనే చర్యలు తీసుకోవాలని, వైద్యాధికారులు డీఎంహెచ్ఓ వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎంపీ డాక్టర్లుగా వ్యవహరిస్తున్నటువంటి వారి పైన చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తుందని తెలియజేశారు.

భారీ శబ్ధాలతో పార్టీ.. నిర్వాహకుడిపై కేసు

ప్రతిపక్షం, మొయినాబాద్, నవంబర్ 23: చుట్టుప్రక్కల వారికి ఇబ్బందులు కలుగజేసేలా భారీ శబ్ధంతో సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసి పార్టీ చేసుకుంటున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అజీజ్ నగర్ లోని అల్లం శ్రీనివాస్ రెడ్డి ఫాంహౌస్ వద్ద పార్టీ చేసుకుంటున్నారని, అక్కడ భారీ శబ్ధంతో సౌండ్ స్పీకర్లను ఏర్పాటు చేసి చుట్టుప్రక్కల నివాసితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అజీజ్ నగర్ కు చెందిన గుంటి మహేష్ పార్టీ నిర్వహిస్తున్నాడని గుర్తించారు. ఈ పార్టీకి సంబంధించి ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద పెద్ద శబ్ధాలతో సౌండ్ స్పీకర్లను ఏర్పాటు చేసి స్థానిక ప్రజలను గురిచేయడంతో పార్టీ నిర్వాహకుడు మహేష్ పై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



అక్రమ వలసదారులపై కఠినంగా అధికారులు వ్యవహరించాలి. ప్రతి జిల్లాలో తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. విదేశీ పౌరసత్వం ఉన్న వలసదారుల వెరిఫికేషన్ పూర్తయ్యేవరకు వారిని డిటెన్షన్ సెంటర్లలో ఉంచాలి. ఇక్కడ వారు స్థిరపడిన విధానాన్ని బట్టి స్వదేశాలకు పంపించాలి.

- యూపీ సీఎం యోగి

అక్బర్జాపేట్ గ్రామ నక్ష రోడ్డు మార్గం కబ్జా నుంచి కాపాడాలి

- ఎంపీ ఈటల రాజేందర్ కు గ్రామస్తుల వినతి



ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 23: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధి అక్బర్జాపేట్ గ్రామంలోని సర్వేనెం. 374 , 375 ప్రాంతంలో, అలాగే రాజబోల్లారం ఘనపూర్ - అక్బర్జాపేట్ మూడు గ్రామాలను కలుపుతున్న నక్ష రోడ్డు మార్గాన్ని కొందరు ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎంపీ ఈటల రాజేందర్ కు ఆయన నివాసంలో కలిసి ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సమస్యపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ తక్షణమే ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అక్రమ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ప్రజా రహదారుల రక్షణ కోసం ఇలాంటి సమస్యలపై పోరాటం చేయడం అభినందనీయం అని పేర్కొంటూ, మీ పోరాటానికి నా సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎంపీ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ వార్డు మెంబర్లు మహంకాళి సురేష్, కోటగిరి నాగరాజు, గ్రామ పెద్దలు గువ్వ రాములు, దేశం నవీన్, సుధాకర్, వీరేష్, గుంటి రవి, వెంకటేష్, నర్సింగరావు, నరేష్, నాగరాజు, నర్సింహచారితో పాటు తదితరులు పాల్గొన్నారు.



మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 23: నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో దేశపాక శ్రీశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందాడు. జ్వాలా యూత్ సభ్యుడిగా ఉన్న శ్రీశాంత్ మృతికి సభ్యులు సంతాపం తెలుపుతూ... ఆదివారం కుటుంబ సభ్యులను కలిశారు. మృతుడి తల్లిని పరామర్శించి, యూత్ అసోసియేషన్ తరపున రూ. 20,000 ఆర్థిక సహాయాన్ని అందించి మనోధైర్యాన్ని కలిగించారు.





మహిళల అభివృద్ధి ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 23 : మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి పరచడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షత న జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి తో కలిసి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 1990లో మొదలైన మహిళా సంఘాల గ్రూపులు కాల క్రమంలో 2004, 2014 మధ్య పావల వడ్డీ లేని రుణాలు అందించింది, ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత తిరిగి వడ్డీ లేని రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆర్థికంగా ఎదిగేలా చేయడం కోసం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల అభివృద్ధి కోసం అనేక రకాల కార్యక్రమాలను చేపట్టిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన పథకాలు సోలార్ ప్లాంట్లు, మహిళా శక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, బస్సుల కొనుగోలు వంటి పలు వ్యాపారాల్లో మహిళా సంఘాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా వేలాది మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. "ఆడబిడ్డల ఆశీర్వాదం అన్ని దేవుళ్ల కంటే శ్రేష్ఠం. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సందర్భంగా టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలను అన్ని రకాలుగా ప్రజా ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి అని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ జిల్లాలో డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా కలిగిన ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్, జిల్లా గ్రంధాల సంస్థ చైర్మన్ అంజయ్య, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి అడిషనల్ డిఆర్డిఓ సూర్యారావు, జిల్లామహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.





మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో

సంక్లిష్టమైన ఆరోగ్య సమస్యలకు చికిత్స

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, నవంబర్ 23: మానసిక వికలాంగురాలితో పాటూ 68 సంవత్సరముల రోగికి శస్త్ర చికిత్స అవసరం లేకుండా చికిత్స చేయడంలో మెడిసిటి గ్రూప్ ఆఫ్ మెడికల్స్ వారి మెడినోవా ఆసుపత్రికే సాధ్యమని కార్డియాలజీ నిపుణులు అన్నారు. అత్యాధునిక సాంకేతక పరిజ్ఞానంతో కూడిన క్యాత్ ల్యాబ్ తో పాటూ నిపుణులైన వైద్యులతో కార్డియాలజీ విభాగం ఏర్పాటు చేశామని డాక్టర్ లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాకు చెందిన కావేరి బేతల్ (29) అనే మహిళ ఆమె ప్రస్థుతం మానసిక ఆరోగ్యంతో భాదపడుతున్నారు, ఆమెను గుండె సంబంధిత ఇబ్బందితో భాదపడుతోందని, స్థానిక వైద్యులు హైదరాబాదుకు చికిత్స కోసం వెళ్లమని తెలుపగా సంబంధిత బంధువుల ద్వారా మేడ్చల్ మున్సిపల్ లోని మెడిసిటీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ వారి మెడినోవా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో కార్డియాలజీ వైద్య నిపుణులను సంప్రదించారు. సంబంధిత పరీక్షలు నిర్వహించిన అనంతరం సదరు మహిళకు పుట్టినప్పుడు నుండి గుండెలో చిన్న రంధ్రం ఉన్నట్లు గుర్తించారు. దాని ఫలితంగా సదరు మహిళ పలు రకమైన ఆరోగ్య సమస్యలతో భాదపడుతున్నట్లు తేల్చారు. అయితే మహిళ మానసిక ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మెడినోవా హాస్పిటల్ లోని ప్రొఫెసర్ డా. కె జగదీష్ రెడ్డి నేతృత్వంలోని కార్డియాలజీ విభాగపు వైద్య నిపుణులు అత్యాధునిక ఐమేజింగ్ మరియు కాథటర్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని గుండెలో ఉన్న రంధ్రాన్ని మూసివేయం జరిగిందనారు. ఆట్రియల్ సెప్టల్ డిఫెక్ట్ డివైజ్ అనబడే విధానం ద్వారా జరిపిన ఈ చికిత్సను మెడినోవాలో కలిగిన అత్యాధునిక క్యాత్ ల్యాబ్ ద్వారా విజయవంతంగా పూర్తి చేశామని తెలిపారు. సాధారణంగా పెద్ద ఆపరేషన్ ద్వారా చేయాల్సిన ఈ చికిత్సను క్యాథటర్ ద్వారా శస్త్ర చికిత్స పేరుతో శరీరంపై గాటు పెట్టకుండా త్వరగా కోలుకొనేలా చేయడం జరిగిందని పేర్కొన్నారు. సదరు మహిళ పూర్తిగా కోలుకున్న అనంతరం ఆమెను శుక్రవారం డిశ్చార్జి చేశామని తెలిపారు. అలానే విజయవాడకు చెందిన సీతారాం ప్రసాద్ (68) గుండెలో ఉంటే అత్యంత సన్నవైన రక్తనాళాలు బ్లాక్ కావడంతో తద్పలితంగా గుండె సంబంధిత రుగ్మతలు, గుండె పోటు లాంటి పరిస్థితులలో రోగిని బంధువులు హాస్పిటల్ కు తీసుకొని వచ్చి డాక్టర్ ను సంప్రదించారు. రోగి వయస్సు, ఇతరత్రా ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకొని హాస్పిటల్ లోని ప్రొఫెసర్ డా. కె జగదీష్ రెడ్డి నేతృత్వంలోని కార్డియాలజీ విభాగపు వైద్యులు సంక్లిష్టమైన ఓసిటి గైడెన్స్ ఆధారిత పీటిసీఏ, ఇంట్రా వ్యాస్కులర్ లిథోట్రిప్సి విధానాన్ని వినియోగించి 3డి గైడెడ్ కెమరా ద్వారా ఐవిఎల్ బెలూన్ ను వినియోగించి గడ్డకట్టిన గుండె నాళాలలో స్టంట్ వేషామన్నారు. తద్వారా బైపాస్ లేదా ఓపన్ హార్ట్ శస్త్ర చికిత్స చేయించుకోవాల్సిన అవసరం లేకుండా సదరు వ్యక్తి ఇబ్బందిని పూర్తిగా దూరం చేయడంతో రోగి త్వరగా కోలుకొని డిశ్చార్జ్ అయ్యారన్నారు. గత రెండు నెలలుగా ఇలాంటి ఎంతో సంక్లిష్టమైన వైద్య సమస్యలకు పరిష్కారం చూపి విజయవంతంగా శస్త్ర చికిత్స అందించామని తెలిపారు. పైన పేర్కొన్న సంక్లిష్టమైన గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలకు పరిష్కారం హైదరాబాదులోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లకుండా ఇప్పుడు మేడ్చల్ పట్టణంలోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లోని కార్డియాలజీ వైద్య విభాగం అందించగలుగుతోందని తెలిపారు. మేడ్చల్ లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో ఏర్పాటు చేసిన అత్యాధునిక క్యాత్ ల్యాబ్ తో పాటూ అవసరమైన అత్యవసర వైద్య నిపుణుల బృందంతో కూడిన స్ట్రోక్ యూనిట్ కూడా అందుబాటులో ఉందని వెల్లడించారు. దీంతో గతంలోలా ఇలాంటి ఆరోగ్య సమస్యలకు సికింద్రాబాద్ లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లడంలో జరిగే ఆలస్యాన్ని నివారించి త్వరిత గతిన వైద్యాన్ని అందించి రోగి ప్రాణాలను కాపాడడానికి వీలవుతుందని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటూ నిపుణులైన వైద్యులు కూడా 24X7 అందుబాటులో ఉండడం వలన ఎలాంటి సంక్లిష్టమైన సమస్యలకైనా మెడినోవాలో చికిత్స అందుతుందనే విషయాన్ని పై రెండు సంఘనటలను వివరిస్తున్నాయని ఆయన తెలిపారు. అత్యవసర సమయాలలో సమయం వృధా చేయకుండా మేడ్చల్ లోని మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ను సంప్రదిస్తే గోల్డన్ అవర్ లోనే చికిత్స అందించవచ్చని సూచించారు.



డిసెంబర్ 21, 22 తేదీల్లో

ప్రజానాట్యమండలి మహాసభలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 23 : ప్రజానాట్యమండలి సంగారెడ్డి జిల్లా 3వ మహాసభలు సంగారెడ్డిలో డిసెంబర్ 21, 22 తేదీల్లో జరిగే సభలను జయప్రదం చేయాలని ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. నాగభూషణం పిలుపునిచ్చారు. ఆదివారం సంగారెడ్డి లోని సుందరయ్య భవన్లో కవులు కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ. నాగభూషణం హాజరై మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కళ కోసం కాదు! కళ ప్రజల కోసం !! కళ ప్రగతి కోసం!! అనే నినాదంతో పనిచేస్తుంది అని అన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రజానాట్యమండ నిరంతరం ప్రజల కష్టాలను కారణాలను తెలియజేస్తూ ప్రజలను చైతన్య యాత్ర చేస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తుంది అని అన్నారు. కనుమరుగవుతున్నటువంటి జానపద కళారూపాల పరిరక్షణకు ప్రజానాట్యమండలి నడుం బిగించడం ఆ కళారూపాలు కాపాడడంలో ప్రజానాట్యమనలి మరింత చురుకుగా పనిచేయాల్సిన బాధ్యత ప్రజానాట్యమండలి పై ఉందన్నారు. ప్రజానాట్యమండలి సంగారెడ్డి జిల్లా మహాసభలు డిసెంబర్ 21, 22 తేదీల్లో సంగారెడ్డిలో జరుగుతున్నాయి ఈ మహాసభలకు కవులు, కళాకారులు మేధావులు సహాయ సహకారాలు అందించాలని ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, రచయితలు భాష శేఖర్, బాలరాజ్, దుర్గేష్, గాయకులు రాజు, డెవలప్ సత్యనారాయణ, కృష్ణ, ఏసు తదితరులు పాల్గొన్నారు.



హరిహరపుత్ర అయ్యప్ప స్వామి

గుడి నిర్మాణానికి శంకుస్థాపన

- హాజరైన ఎమ్మెల్యే వేముల

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 23: అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆకాంక్షించారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల, వెంబావి గ్రామాల సరిహద్దు (బోడ గుట్ట) ప్రాంతం లో శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమమం లో మార్కెట్ డైరెక్టర్ కోనేటి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, మాజీ ఉప సర్పంచ్ ఉయ్యాల లింగయ్య, సోషల్ మీడియా ఇంచార్జీ పట్ల జనార్ధన్, జనపాల శ్రీను, పాకాల దినేష్, ఉరుమడ్ల, వెంబావి గ్రామాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



చిట్యాలలో శతవర్షిక జయంతి ఉత్సవాలు

ప్రతిపక్షం, చిట్యాల, నవంబర్ 23: పుట్టపర్తి సత్యసాయి బాబా వారి శతవర్షిక జయంతి ఉత్సవాలను చిట్యాల సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మహిళలచే కుంకుమ పూజలు, భజనలు, సత్సంగం, మహా మంగళహారతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు మేడిశెట్టి అంజయ్య, వేలుపల్లి రవీందర్, వేలుపల్లి వెంకన్న, దేవరశెట్టి దామోదర్, మేడిశెట్టి ఝాన్సీ, చందా నాగలక్ష్మి, పద్మ, సువర్ణ, పద్మజ, జానమ్మ, నాగమణి, పద్మ, రజిని, సాయి తేజ, రాధ, శోభ, చక్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే గూడెం

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన పటాన్చెరు విద్యార్థులను పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అభినందించారు. పటాన్చెరు మండలం నందిగామ గ్రామానికి చెందిన వీరారెడ్డి కుమారుడు పట్లోళ్ల ఆర్యన్ రెడ్డి, తీర్థ అనే విద్యార్థులు ఇటీవల వికారాబాద్ లో జరిగిన అండర్ 14 రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ సెలక్షన్స్ లో పాల్గొని ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం పటాన్చెరు శాసన సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు సిఐ వినాయక్ రెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులు శాస్త్రీయ విద్యకై కొట్లాడాలి

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయపేట్, నవంబర్ 23: ప్రజలు ఎదుర్కొంటున్న సమష్యల పరిష్కరానికి దారి చూపే శాస్త్రీయ విద్య సాధనకై విద్యార్థులు మరింతగా పోరాడాలని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం. కృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ భవన్ లో రెండవ రోజు జరిగిన నారాయణ పేట్ జిల్లా పి డి ఎస్ యూ మూడవ మహాసభలను ఆయన ప్రారంభించారు. సభ ప్రారంభం సూచికగా పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు సాయి కుమార్ జండా ఆవిష్కరణ చేయగా జిల్లా కార్యదర్శి బి. అజయ్ అమర వీరులకు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఎం. కృష్ణ మాట్లాడుతూ నేటి ఆశాస్త్రీయ విద్యావిధానం ప్రజలు ఎదురుకుంటున్న అనేక సమష్యలకు పరిస్కారం చూపలేకపోతున్నది. ప్రజల్లో మూఢవిశ్వాసాలు పెంచిపోసిస్తున్నది. రైతులకు జరిగిన అన్యాయాలను, స్త్రీ పురుష అసమానతలను, స్త్రీలపై హింసను కండించలేకపోతున్నది. ఇలాంటి రుగ్మతలను కండించాలని ఎక్కడ కూడా మనకు బోదించే టీచర్స్ కూడా చెప్పరు. దింతోపాటు నేటి విద్యా వ్యక్తులను స్వతంత్రాంగ ఆలోచించనీయకుండా కేవలం పెట్టుబడి దారులకు గుమస్తాలుగా చెప్పింది వినడానికి, తల ఊపడానికి పనికి వస్తున్నది తప్ప వారు కార్మికులను చేసే దోపిడీని ప్రశ్నించనియడం లేదు. ఇలాంటి విద్యా సమాజాన్ని పురోభివృది చెందనీయదు. పాతకాలం భావాలను కొనసాగిస్తున్నది అన్నారు. కావున ఇలాంటి ఆశాస్త్రీయవిద్యను వ్యతిరేకించాలని నూతన శాస్త్రీయ విద్యా, శ్రమను గౌరవించే విద్యా కావాలని ప్రతి విద్యార్థి పోరాడాలని పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ నాగేష్ మాట్లాడుతూ నేడు విద్యారంగం లో రోజు రోజుకు సమష్యలు పెరిగిపోతున్నాయి. పాలకులు వాటిని పరిష్కరించడం లో దృష్టి పెట్టడం లేదన్నారు. ఇలా చేయడం వల్ల మనలాంటి పేద విద్యార్థులకు విద్యా దూరం అవుతుంది అన్నారు. అంటే డబ్బులు ఉన్నవారే చదువుకోవాలని పాలకులు చెపుతున్నట్టే అన్నారు. ఇలా చేస్తే గతంలో లాగా సమాజం వెనక్కి పోతుందనీ ఇంత నాగరికత సమాజం లో ఇలా చదువు కు దూరం కావడం అంటే పాలకులు సిగ్గుపడాలి అన్నారు. పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో అందరికీ విద్యా అందాలని తీవ్రమైన పోరాటాలు చేయాలనీ అన్నారు. సభలకు సంగీభవంగా టీ పి టీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవేందర్, పి వై ఎల్ జిల్లా నాయకులు కృష్ణ, అరుణోదయ జిల్లా నాయకురాలు లక్ష్మి ప్రసంగించారు. ఈ సభల్లో పి డి ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శి లు కె. పృద్వి, ఎస్. అనిల్ జిల్లా అధ్యక్షకార్యదర్శి లు ఎస్. సాయికుమార్ బి. అజయ్. జిల్లా ఉపాధ్యక్షులు గౌస్, సహాయ కార్యదర్శి ఎస్. సంధ్య బి. వెంకటేష్. బి మహేష్ మరియు ఈ సభలకు సంగీభవంగా టీ పి టీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవేందర్, పి వై ఎల్ జిల్లా నాయకులు కృష్ణ, అరుణోదయ జిల్లా నాయకురాలు లక్ష్మి ప్రసంగించారు.

మహిళా సాధికారతకు మరో అడుగు

- ఆందోల్ డివిజన్‌లో ఘనంగా ఇందిరమ్మ చీరల పంపిణీ



ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 23 : సంగారెడ్డి జిల్లా ఆందోల్ డివిజన్‌లోని సంగుపేట్ లక్ష్మీదేవి గార్డెన్‌లో ఇందిరా మహిళా శక్తి – మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి చీరల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కోలాటాలతో మహిళలు స్వాగతం పలకగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆందోల్, పుల్కల్, వట్పల్లి, చౌటుకూరు మండలాల మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సిరిసిల్ల చేనేత కేంద్రంలో తయారైన నాణ్యమైన చీరలను పంపిణీ చేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం పక్షాన ప్రతి ఆడబిడ్డకు అందిస్తున్న ఇందిరమ్మ చీర మహిళా ఐక్యతకు ప్రతీక. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఉక్కు మహిళ ఇందిరమ్మ పేదవర్గాల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలు ప్రవేశ పెట్టింది. మహిళా సంఘాలు ఐక్యంగా ఉంటే ఆర్థిక ప్రగతి సాధ్యమౌతుంది అని పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళను కొత్త సంఘాల్లో సభ్యులుగా చేర్చి, కొత్త సంఘాల ఏర్పాటుకు సమైక్య సభ్యులు సహకరించాలని సూచించారు. తెల్ల రేషన్ కార్డులో పేరు ఉన్న ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 16,164 స్వయం సహాయక సంఘాలు, 1,65,467 మహిళా సభ్యులతో సత్ఫలితాలు అందిస్తున్నాయన్నారు.

మహిళల ఆధ్వర్యంలోని ఆర్థిక యూనిట్లు..

మొబైల్ ఫిష్ అవుట్‌లెట్లు - 3, పాల పార్లర్లు - 3, ఇందిరా మహిళా సమైక్య క్యాంటీన్లు క్యాంటీన్లు - 5, సోలార్ ప్లాంట్లు - 2, పెట్రోల్ బంక్ - 1, అదనంగా మండల సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసిన 23 బస్సులు RTCకి అద్దెకు ఇచ్చి ప్రతి బస్సుకు నెలకు రూ. 70,000 ఆదాయం పొందుతున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు - 613, నైపుణ్య శిక్షణలు - 412 మహిళలు, ఉల్లాస్ విద్యా కార్యక్రమం - 59,299 మహిళలు, నమో డ్రోన్ దీదీ డ్రోన్ శిక్షణ - 44 మహిళలు, ఇందిరమ్మ ఇండ్లు పథకంలో పురోగతి, 14,567 మంది సభ్యులకు రూ. 100.27 కోట్లు మంజూరుచేశారు. ప్రతి మంగళవారం నిర్వహించే ఎం సి హెచ్ & జిజిహెచ్ సేవల ద్వారా 649 మహిళలు సేవలు పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఆర్డిఓ సూర్యారావు, ఆర్డీవో పాండు, ఏపీవోలు, జిల్లా కోశాధికారి మీనా, జిల్లా సమైక్య సంఘ ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



'రైతన్నా.. మీకోసం' డైవర్షన్ పబ్లిసిటీ స్టంటే. రైతులను కాలర్ ఎగరేసుకునేలా చేస్తామని చెప్పి ఎండమావులు చూపిస్తారా.? రైతుల ఒంటి మీద చొక్కా తీసేసి రోడ్డు మీద నిలబెట్టారు. రైతుల కష్టాలు, బాధలపై చర్చ జరగకుండా చేస్తున్న డైవర్షన్ పబ్లిసిటీ స్టంట్ 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం. 18 నెలల్లో రైతుల కోసం ఎప్పుడు నిలబడ్డారు? ఎక్కడ నిలబడ్డారు?.

- ఎక్స్‌లో వైసీపీ చీఫ్ జగన్

మహిళా సాధికారతకు ప్రభుత్వం మరొక అడుగు

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ



ప్రతిపక్షం, హుస్నాబాద్, నవంబర్ 23: మహిళా సంఘాల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట, భీమదేవరపల్లి, ఎక్కతుర్తి, చిగురుమామిడి మండల కేంద్రంలో ఉన్న రైతు వేదిక వద్ద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మహిళలకు బొట్టు పెట్టి చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమవతి, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, ఆర్డీవో, సింగిల్ విండో చైర్మన్ శివయ్య తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేయడం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ముఖ్య సంక్షేమ కార్యక్రమమని అన్నారు. మహిళా శ్రేయస్సు, సాధికారత కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా క్యాంటీన్లు, అమ్మ ఆదర్శ పాఠశాలలు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు వంటి అవకాశాలతో మహిళా సంఘాల ఆర్థిక వృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ మండలంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి క్యాన్సర్ స్క్రీనింగ్, కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మహిళా సంఘాల రుణాలపై వడ్డీని ప్రభుత్వం భరిస్తోందని, అక్కన్నపేట మండలం నుంచి మాత్రమే కోటి 20 లక్షలు చెల్లించినట్లు వివరించారు. త్వరలో చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కానుందని, మహిళలకు ప్రధాన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. రైస్ మిల్లులు, ఫుడ్ ప్రాసెసింగ్, తయారీ రంగాలలో మహిళలకు శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ కె. హైమవతి మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎల్లప్పుడూ ప్రజల అభ్యున్నతికే కృషి చేస్తారని తెలిపారు. మహిళల శక్తి సమాజ అభివృద్ధికి ఆధారం అని పేర్కొన్నారు. హుస్నాబాద్ మహిళలు ఆంత్రప్రెన్యూర్‌షిప్‌లో ముందుకు రావాలని సూచించారు. అక్కన్నపేటలో ఏర్పాటు కానున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో మహిళలకు అవకాశాలు ప్రాధాన్యతగా ఉంటాయని స్పష్టం చేశారు.



కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భక్తుల సందడి

ప్రతిపక్షం, కొమురవెల్లి, నవంబర్ 23: సిద్దిపేట జిల్లా ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణాలు మొత్తం మల్లన్న నామస్మరణతో మారుమోగింది. భక్తులు తెల్లవారుజామున కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించి మల్లికార్జునస్వామిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా పట్నం,అభిషేకం, దీపాలు వెలిగించుట, అర్చన,నిత్యాకల్యాణం, బోనం, తిరుగుడు కోడె, కేశకండన, గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టి భక్తులు తదితర మొక్కులను చెల్లించుకుని క్యూలైన్ల వెళ్ళి మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మల్లన్న కొండపై కొలువైవున్న శ్రీ రేణుక ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్లకు బోనాలు సమర్పించి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యాలను ఆలయ ఈఓ వెంకటేష్, ఏఈఓ బుద్ది శ్రీనివాస్, సూపరెంటెంట్ చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది అర్చకులు పర్యవేక్షించారు.



సిద్దిపేట ఆర్య వైశ్య సంఘం ఆదర్శంగా నిలవాలి

- పేద వైశ్యుల కొరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి
- సిద్దిపేటలో కర్మ భవన్ ఏర్పాటు కు కృషి చేస్తా
- పట్టణ ఆర్య వైశ్య సంఘం కార్యాలయాన్ని ప్రారంభించిన హరీష్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 23: రాష్ట్రంలోనే సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది ఆదర్శంగా నిలిచామని, అదే స్ఫూర్తి తో సిద్దిపేట ఆర్య వైశ్య సంఘం రాష్ట్రంలో ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట పట్టణం లోని హౌసింగ్ బోర్డు కాలనీలో పట్టణ ఆర్య వైశ్య సంఘం నూతన కార్యాలయాన్ని హరీష్ రావు ప్రారంబించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఆర్య వైశ్య సంఘం పట్టణ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. పదవి తోనె గౌరవం గుర్తింపు రాదని, మీరు చేసే సేవకు పని గుర్తింపు వస్తుందన్నారు. అదిశగా నూతన కార్యవర్గం పని చేయాలని, మీ సంకల్పం కొరకు ముందుకు సాగాలన్నారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన వారిని కూడా కలుపుకొని పోవాలని సూచించారు. నూతన కార్యవర్గం పేద వైశ్యులకు సహాయ సహకారం అందించడం లో ముందువుండాలన్నారు. వాసవి వివాహ వారధి కార్యక్రమం మంచి కార్యక్రమని, ఇలా ఎన్నో కార్యక్రమాలు ఇదే విధంగా చేయాలని చెప్పారు. కర్మ భవన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మీరు చేసే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ నా సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు.



ఆంక్షారెడ్డి నియామకం పట్ల హర్షం

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 23: సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ కొత్త అధ్యక్షురాలిగా నియమితురాలైన తూంకుంట అంక్షరెడ్డికి డీసీసీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి బైరి ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే కీలక బాధ్యతలు స్వీకరించిన అంక్షరెడ్డి విజయవంతంగా ముందుకు సాగుతారనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బైరి నాగమణి, గుండబోయిన రాజు, లీగల్ సెల్ న్యాయవాదులు అఫ్సర్, నాగరాజు, రమేష్, కరీం, గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



గ్రూపులకు అతీతంగా పార్టీ పటిష్టతకు శ్రమిస్తా

- ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తా
- జిల్లా డీసీసీ అధ్యక్షురాలు అంక్షారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 23: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శ్రమిస్తానని నూతనంగా నియమించబడ్డ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి స్పష్టం చేశారు. జిల్లా అధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా పార్టీ శ్రేణులు ఆమెను ఆదివారం గజ్వేల్ లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆంక్షారెడ్డి మాట్లాడుతూ కార్యకర్తల కష్టంతోనే తనకు పదవి దక్కిందని స్పష్టం చేశారు. ముఖ్యంగా వచ్చే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్వవైభవం పొందేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు జిల్లాలో గ్రూపులు, వర్గాలు లేకుండా ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు వెళ్తానని, అందరి ఆశీస్సులు తీసుకుంటానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు పేదలకు చేర్చడమే తనవంతు లక్ష్యం కాగా, నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని అన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు స్పష్టం చేశారు. క్రింది స్థాయి నుండి వచ్చిన తనకు కార్యకర్తల కష్టసుఖాలు తెలుసని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లావ్యాప్తంగా పర్యటించి పార్టీ శ్రేణులను కలవడంతో పాటు అధిష్టానం ఆదేశాల మేరకు ముందుకెళ్తానని వివరించారు.



ప్రయివేటు ఫైనాన్స్ వేధింపులు..

మహిళా ఆత్మహత్య

ప్రతిపక్షం, చేగుంట, నవంబర్ 24: గృహ నిర్మాణం కోసం ప్రైవేట్ బ్యాంకులో తీసుకున్న అప్పు తీర్చలేదన్న ఉద్దేశంతో బ్యాంకు వారు వేధించడంతో మహిళా ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన తూప్రాన్ మండల కేంద్రంలో జరిగింది. తూప్రాన్ పట్టణానికి చెందిన వరలక్ష్మి అనే మహిళ మేడ్చల్ ఫైవ్ స్టార్ మైక్రో ఫైనాన్స్ తో పాటు క్రిష్ బ్యాంకులో గృహ నిర్మాణ రుణాలు తీసుకున్నారు. సకాలంలో ఈఎంఐ డబ్బులు చెల్లించడం లేదని మైక్రో ఫైనాన్స్ సిబ్బంది ఆదివారం ఉదయం ఇంటికి చేరుకొని వేయించడంతో వరలక్ష్మి మనస్థాపానికి గురై చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయమై బాధిత కుటుంబ సభ్యులు తూప్రాన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హెచ్ సీఏ టీమ్ కు సిద్దిపేట క్రీడాకారుడు అర్ఫాజ్ అహ్మద్

- అభినందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 23: ఈ నెల నవంబర్ 26 నుండి కలకత్తాలో జరిగే బీసీసీఐ సీనియర్ మెన్స్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ (టీ20) కోసం హెచ్సీఏ టీమ్ కు సిద్దిపేట క్రికెట్ క్రీడాకారుడు అర్ఫాజ్ అహ్మద్(గోరు) ఎంపిక అయ్యాడు. అహ్మద్ఎంపిక పట్ల మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సిద్దిపేట క్రికెట్ స్టేడియం ఫ్లడ్ లైట్స్ తో అద్భుతంగా అభివృద్ధి చేశామని, మూడు సంవత్సరాలు కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ పెట్టామని అన్నారు. క్రికెట్ స్టేడియం అభివృద్ధి జరిగింది కాబట్టే సిద్దిపేటలో టీ20 మ్యాచులు నిర్వహించామన్నారు. సిద్దిపేట క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎదగాలనే తపన తోనే స్టేడియన్ని అభివృద్ధి చేసుకున్నామని, సిద్దిపేట స్టేడియం నుండి నేడు జాతీయ స్టేడియంలో ఆటడం అంటే ఒక ప్రజాప్రతినిధిగా ఎంతో సంతోషంగా ఉందన్నారు. అహ్మద్ (గోరు) మరింత రాణించాలని భవిష్యత్ లో మరిన్ని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనాలని ఆకాంక్షించారు.



బద్రి నాగరాణికి యంగ్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 23: సిద్దిపేట శ్రీ కృప ఫార్మసీ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న సిద్దిపేట పట్టణానికి చెందిన బద్రి నాగరాణికి అరుదైన పురస్కారం లభించింది. గోవాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఆమె ఈ పురస్కారాన్ని అక్కడి మంత్రి చేతుల మీదుగా అందుకోగా, ఔషధ రంగంలో ఆమె చేసిన పరిశోధనకు మెచ్చి యంగ్ ఉమెన్ సైంటిస్ట్ అవార్డును అందజేసారు. ఈ అవార్డుతో పాటు తన రీసెర్చ్ వర్క్ ప్రజెంటేషన్ కూడా ఆమె కు ప్రథమ బహుమతి లభించింది. భర్త దారా ప్రశాంత్ కుమార్ కు, కాలేజీ ప్రిన్సిపాల్ మంజునాథ్, కాలేజ్ యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

సత్య సాయి సేవలు యుగయుగాల పాటు నిలుస్తాయి

- బాబా శతజయంతి వేడుకల్లో మాజీ మంత్రి హరీష్ రావు



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 23: సత్య సాయి బాబా చూపిన సేవామార్గం ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని ప్రేరేపిస్తోందని, పుట్టపర్తి నుంచి 166 దేశాల దాకా విస్తరించిన ఆయన సేవా కార్యక్రమాలు మానవత్వానికి మార్గదర్శకమని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ పేర్కొన్నారు. సిద్దిపేట శ్రీ సత్య సాయి బాబా దేవాలయం ఏర్పాటు చేసిన భగవాన్ శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భగవాన్ సత్య సాయి బాబా శతజయంతి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. సాక్షాత్ భగవంతుని అవతారమైన సత్య సాయి బాబా గురించి మాట్లాడే అవకాశం తనాకు లభించడం నా భాగ్యం అని హరీష్ రావు పేర్కొన్నారు. సత్య సాయి బాబా శారీరక దేహం శాశ్వతం కాకపోయినా, ఆయన చూపిన సేవా మార్గం మాత్రం యుగయుగాల పాటు నిలిచిపోతుందని అన్నారు. కుల, మత విభేదాలు లేని సమాజాన్ని నిర్మించాలనే బాబా సందేశం ఈనాటికీ కోట్లాది మందిని ప్రేరేపిస్తోందని హరీష్ రావు గుర్తు చేశారు. అబ్దుల్ కలాం వంటి విశిష్టులు, సచిన్ టెండూల్కర్, గవాస్కర్ వంటి క్రీడామూర్తులు కూడా బాబా భక్తులని ఆయన తెలిపారు. బాబా 80వ జయంతి సందర్భంగా 10 లక్షల మంది దర్శించుకోగా, నేడు ఆయన ప్రత్యక్షంగా లేకున్నా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 కోట్ల మంది శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ఇదే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సత్య సాయి సేవలు పుట్టపర్తికి మాత్రమే పరిమితం కాలేదని, ప్రపంచంలోని 166 దేశాల్లో 10 వేలకు పైగా సంస్థలు మానవ సేవలో నిమగ్నమై ఉన్నాయని ఆయన వివరించారు. సత్య సాయి యూనివర్సిటీ, మెడికల్ ఇనిస్టిట్యూషన్స్, పేద విద్యార్థులకు చేసే సేవలు అనన్యసామాన్యమని చెప్పారు. సిద్దిపేటకు సత్య సాయి సేవలతో ఉన్న అనుబంధాన్ని కూడా హరీష్ రావు ప్రస్తావించారు. సత్య సాయి సృజల పథకం ద్వారా గజ్వేల్‌కు త్రాగునీరు అందించారు. మధుసూదన్ సాయి నాయకత్వంలో సిద్దిపేటలో విద్యా, వైద్య సేవలు అద్భుతంగా కొనసాగుతున్నాయి అని అన్నారు. కేసీఆర్ సూచనలతో కొండపాక ఆనంద నిలయం రమణాచారి సహకారంతో సత్య సాయి జూనియర్ కాలేజీ, సత్య సాయి గుండె ఆసుపత్రి ఏర్పాటు చేశామని, తెలంగాణలో ఏకైక చిన్న పిల్లల గుండె శస్త్రచికిత్స ఆసుపత్రి సిద్దిపేట సమీపంలో పనిచేస్తోందని, ఇతర రాష్ట్రాల నుంచి కూడా వందల మంది వచ్చి ఉచితంగా చికిత్స పొందుతున్నారని తెలిపారు. సత్య సాయి బాబా ఏనాడూ పబ్లిసిటీ కోసం సేవ చేయలేదు. అలాంటి మహనీయుడు శతజయంతి మాత్రమే కాదు, సహస్ర శతజయంతి ఉత్సవాలకు కూడా అర్హుడు అన్నారు. సిద్దిపేటలో ఈ వేడుకలు ఇంత ఘనంగా జరగడం ఎంతో ఆనందంగా ఉంది అని హరీష్ రావు అన్నారు. సిద్దిపేటలో సత్య సాయి సేవా కార్యకలాపాలు నిరంతరం కొనసాగాలనే ఆకాంక్షను ఆయన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పారూఖ్ హుస్సేన్, నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



అయ్యప్ప క్షేత్ర అభివృద్ధికి సహకారం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, నవంబర్ 23: పట్టణంలోని ప్రసిద్ధ హరిహరపుత్ర అయ్యప్ప క్షేత్ర అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ గురుస్వామి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడున్నర దశాబ్దాల క్రితం అయ్యప్ప మాల ధరించగా, అప్పటి నుండి ప్రతి ఏటా శబరిమల లోని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్నట్లు స్పష్టం చేశారు. గజ్వేల్ అయ్యప్ప క్షేత్రం ఎంతో మహిమాన్వితం కలదని, స్వామి వారిని అర్చిస్తే అంతా మంచే జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీనివాస్ గురుస్వామి ఆయన దృష్టికి తేగా, సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట డిసిసిబి మాజీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, సీసీఐ మానిటరింగ్ సభ్యులు శివారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షులు శేఖర్ గుప్త, గురుస్వాములు దుర్గయ్య స్వామి, రాజేష్ స్వామి తదితరులు ఉన్నారు.



వైసీపీ హయాంలో మైనింగ్‌పై ఆధారపడిన వారికి దినదినగండంగా గడిచింది. ప్రస్తుతం ఈ రంగంలో పారదర్శకంగా ముందుకెళ్తున్నాం. గత ప్రభుత్వం తీసుకొచ్చిన గనుల సీనరేజీ పాలసీని త్వరలోనే సరళీకృతం చేస్తాం. అన్ని జిల్లాల్లోనూ మైనింగ్ కార్యాలయాలు నిర్మిస్తాం. ఇక నకిలీ మద్యం కేసులో సిట్ విచారణ కొనసాగుతోంది. ఎంతటివారున్నా వదిలేది లేదు.

- ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రాంతీయం



పల్లెల్లో ఇందిరమ్మ చీరల పండుగ

- కాంగ్రెస్‌సీనియర్ నాయకులు రాజు

ప్రతిపక్షం, తొగుట, నవంబర్ 23: తొగుట మండలం లోని వెంకట్రావుపేట గ్రామంలో కాంగ్రెస్‌సీనియర్ నాయకులు పంది రాజు ఇందిరమ్మ చీరలను మహిళల కు అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పథకం ప్రారంభించి పల్లెల్లో పండుగను తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు అనిల్, ఆత్మ కమిటీ డైరెక్ట ర్లు బెజ్జనబోయిన ప్రవీణ్, మిద్దె సంతోష్, మాజీ సర్పంచ్ పాత్కుల లీలాదేవి వెంటేశం, గ్రామ పార్టీ అధ్యక్షులు వోలపు నారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాల కృష్ణ, సీనియర్ నాయకులు రాములు, శ్రీనివాస్, కాలేపు నరేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు భాను చందర్, కరు ణాకర్ సీఏ బండకాడి సుధా, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

టీఏసీసీయూ రాష్ట్ర కార్యదర్శిగా రాజేశ్వర్



ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 23: తెలంగాణ ఎయిడ్స్ కౌన్సిలర్ కంట్రోల్ యూనియన్ (టీఏసీసీయూ) రాష్ట్ర కార్యదర్శిగా మెదక్‌కు చెందిన కాముని రాజేశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా బి. రామణా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్‌లను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ప్రస్తుతం మెదక్ జిల్లా జనరల్ ప్రభుత్వా సుపత్రిలో ఎయిడ్స్ కాన్సిలర్ గా రాజేశ్వర్ విధులు నిర్వ హస్నున్నారు. గతంలో మెదక్ జిల్లా జిల్లా కార్యదర్శిగా అలాగే రాష్ట్ర కమిటీలో, తెలంగాణ ఉద్యమంలో కూడా చురుకుగా పాల్గొన్నారు. కాముని రాజేశ్వర్ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. టీజీవో రాష్ట్ర కా ర్యదర్శి ఏ సత్యనారాయణ, జిల్లా ఆధ్యక్షులు దేవేందర్ రెడ్డి, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్ మల్లారెడ్డి, ఎస్టీయూ ప్రెసిడెంట్ రాజ గోపాల్ గౌడ్, హవేలీ ఘనపూర్ మండల, జిల్లా బాధ్యులు రామకృష్ణ, నరేందర్ రెడ్డి, సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డి, సిద్ధిరాములు, లక్షణ్, గోపి, సుధాకర్, నర్సింహం, ప్రశాంత్ నాయక్, శ్రీంకాత్, సాయి ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.



గ్రామ సంఘాలతోనే మహిళల అభివృద్ధి

- ఏపీఎం లక్ష్మీనరసమ్మ

ప్రతిపక్షం, మిడిదొడ్డి, నవంబర్ 23: మహిళల అభివృద్ధి గ్రామ సంఘాలతోనే సాధ్యమవుతుందని ఏపీఎం లక్ష్మీ నరసమ్మ అన్నారు. ఆదివారం మిడిదొడ్డి మండలం లింగుపల్లి, మల్లుపల్లి, మీడిదొడ్డి ధర్మారం, అల్వాల తోపాటు అక్బరుపేట భూంపల్లి మండలం కాజీపూర్, మోతే, జంగాపల్లి, వీరారెడ్డిపల్లి, రుద్రారం తదితర గ్రా మాల్లో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళ సంఘంలో ఉంటే వారికి బ్యాంకు ద్వారా వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి దోదపడుతుందని తెలిపారు. వృద్ధుల సంఘాలు కిశోర బాలికల సంఘాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. మహిళలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చే సుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు వైకుంఠం జ్యోతి వరలక్ష్మి, బాలరాజు, మనమ్మ, ప్రభాకర్, వివోఏలు మహేష్, స్వప్న, సుమలత, లక్ష్మి వెంకటలక్ష్మి, ప్రియాంక, నసీరోద్దీన్, భూపాల్, పావని, వినోద, జ్యోతి తదితరు లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కూలీ ఆత్మహత్య



ప్రతిపక్షం, దుబ్బాక, నవంబర్ 23: అప్పుల బాధతో ఉరి వేసుకొని కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మండలం ఆకారం గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. దుబ్బాక సీఐ పి. శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దప్పు చంద్రం(50) గ్రామంలో కూలి పని చేస్తూ, కుటుంబంతో కలిసి, జీవనం కొనసాగిస్తున్నాడు. గతలో కుటుంబ అవసరాల కోసం కొన్ని అప్పులు చేశాడు. ఇటీవల నాలుగు నెలల క్రితం చేసిన అప్పులు తీర్చేందుకు ఒక ఎకరం భూమిని అమ్మి, కొన్ని అప్పులు తీర్చగా, ఇంకొన్ని మిగిలాయి. దీంతో మిగిలిన అప్పుల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, తనలో తాను బాధపడేవాడు. ఈ క్రమంలో గ్రామ శివా రులోని ఒక చెట్టుకు చంద్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జరిగిన ఘటన గుర్తించిన స్థానికులు పోలీ సులకు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం దుబ్బాక ప్రాంతీయ ఆసుపత్రికి తర లించారు. మృతుడి కుమారుడు వినయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



కలెక్టరేట్‌లో సత్యసాయి శత జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 23 : కలెక్టర్ సమా వేశమందిరంలో పుట్టపర్తి సత్యసాయి శతజయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కా ర్యక్రమంలో భాగంగా ఆర్డీవో రత్నకళ్యాణి, సేవా సమితి సభ్యులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి తమ భక్తిని చాటారు. పలువురు మాట్లాడుతూ, సత్య సాయి సమాజానికి ఎన్నో విలువైన సేవలు చేశారని కొ నియాడారు. పేదలకు విద్య, వైద్యం, త్రాగునీరు, వంటి సేవలను అందించారని వివరించారు. సేవ, ప్రేమ, కరుణ వంటి అంశాలతో సమ సమాజ స్థాపన కొరకు పుట్టపర్తి సత్యసాయి పాటుపడ్డారని వివరించారు. ఈ జయంతి వేడుకలలో డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సత్యసాయి సేవా సమితి అధ్యక్షులు భీమ్ సేన్, కన్వీనర్ హరి చరణ్, సభ్యులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ చర్చిలో ఘనంగా కోత కాలపు పండుగ





ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 23: యేసయ్య నామ సంకీర్తనలతో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ చర్చి మార్మో గింది. ఆదివారం కోత కాలపు పండుగను పురస్కరించుకొని భక్తులు తాము పండించిన తొలి పంటలోని దశమ భాగాన్ని యేసయ్యకు సమర్పించుకున్నారు. ప్రత్యేక ఆరాధన దైవంతో కూడిన ప్రార్ధనల్లో పాల్గొన్నారు. రైతులు పండించిన పంటల నుంచి పండ్లు, కూరగాయలు, పూలు తదితర వాటిని యేసయ్యకు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం కావడంతో వేలాది మంది భక్తులు, పర్యాట కులతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. కొత్త కాలపు పండుగకు హాజరైన సీఎస్ఐఐ మాడరేటర్, మెదక్ ఇంచార్జ్ బిషప్ రెవరెండ్ రుబెన్ మార్క్ భక్తులనుద్దేశించి దైవ సందేశం చేశారు. యేసయ్య మన జీవితాలలో వెలుగులు నింపే ప్రభువని అన్నారు. మనం పండించిన వాటిని సంవ త్సరాంత కృతజ్ఞతతో దేవుడికి సమర్పించుకొనే పండుగ, దేవుడి ఆకలి తీర్చే పండగ కొతకాలపు పండుగ అని పేర్కొ న్నారు. ఆనంతరం ప్రెసిటేటరీ ఇన్చార్జ్ రెవరెండ్ శాంతయ్య తదితరులు దైవ సందేశం చేశారు. ప్రార్ధనల్లో గురువులు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ భక్తులను ఆశీర్వదించారు. ప్రార్ధ నల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, ఫ్రాంక్ జాన్సన్, సంధాన్ సందీప్, సువన్ డగ్లస్, జాయ ముర్రే, పాల్గొన్నారు.



సత్య సాయి సేవ, ధర్మ మార్గం అనుసరణీయం

- ఘనంగా బాబా శత జయంతి వేడుకలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 23: సత్య సాయి బాబా చూపిన సేవ, ధర్మ మార్గం ఎల్లవేళలా అనుస రణీయం అని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రజావాణి హాలు నందు నిర్వహించిన శ్రీ సత్య సాయి బాబా శత జయంతి కార్యక్రమం సందర్భంగా ఆయన చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవ సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు చేపట్టి విశిష్ట స్థానం సంపాదించారని అన్నారు. ప్రేమ, ఆధ్యాత్మిక బోధనలతో ప్రపంచవ్యా ప్తంగా లక్షలాది భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా ని లిచారని అన్నారు. భగవాన్ సత్య సాయిబాబా సేవలు నిరుపమానమని కొనియాడారు. అనంతరం జిల్లా సత్య సాయి సేవా బృందం సభ్యులచే భజన గీతాలు ఆలపిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ. గంగాల రమేష్, సత్య సాయిబాబా సేవా సంస్థ మెదక్ జిల్లా అధ్యక్షులు సిరిగే ప్రభాకర్, సత్య సాయి సేవా బృందం సభ్యులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏడుపాయలలో జన జాతర

- భక్తులతో కిక్కిరిసిన అమ్మవారి ఆలయం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, నవంబర్ 23: పవిత్ర పుణ్యక్షే త్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో ఆదివారం జన జాతర నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఏడుపాయలకు చేరుకొని దుర్గామా తను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఏడుపాయలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తల నీలాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు పార్థివ్ శర్మ, రాము, నాగరాజు, రాజశేఖ ర్ శర్మ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఏడుపాయల ఈవో చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది, సూర్య శ్రీనివాస్, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మచారి, నర్సింహులు, మహేష్, నరేష్, తది తరులు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తగిన బందోబస్తు చేశారు.



ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా కలెక్టర్ హైమవతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, నవంబర్ 23: ఎవరైనా ప్ర భుత్వ భవనాలను, ఆస్తులను ధ్వంసం చేస్తే చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమవతి అధికారులను ఆదేశించారు. ఆదివారం సిద్దిపేట అర్బన్ మండలం కేసీఆర్ నగర్ లోని ప్రస్తుతం డబుల్ బెడ్ రూమ్ లలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల (ఉర్దూ మీడియం) లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డబుల్ బెడ్ రూం లలో కొనసాగడంలో చాలా ఇబ్బందులు, సమస్యలు ఎదురవుతున్నాయని వి ద్యాధికారి కలెక్టర్ దృష్టికి తెచ్చారు. మూడు పాఠశాలలు కలిసి 350పైగా విద్యార్థులు చదువుతున్నారు. కావున కేసీఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలం ఉన్నందున శాశ్వత భవనం కోసం ఇంజనీరింగ్ అధికారులతో ప్రతి పాదనలు తయారు చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివా స్ రెడ్డిని ఆదేశించారు. అంతకుముందు కేసీఆర్ నగర్లో గల ఫంక్షన్ హాల్ ను పరిశీలించి నైపుణ్య శిక్షణ కేంద్రం మూసివేసిన తర్వాత ఎవ్వరు పట్టించుకోకుండా నిరుప యోగంగా ఉన్నందున ఫంక్షన్ హాల్ మొత్తం శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత కుమార్ ను ఆదేశించారు.

ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే చీరలు పంపిణీ

- మాజీ జడ్పీటీసీ భూపాల్ రెడ్డి



ప్రతిపక్షం, దౌల్తాబాద్, నవంబర్ 23 : త్వరలో జరగను న్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారని దౌల్తాబాద్ మండల బీజేపీ మాజీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీ సర్వుగారి భూపాల్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బతుకమ్మ పండుగల ను మర్చిపోయి ప్రస్తుతం జరిగే పంచాయతీ ఎన్నికలలో ఎలాగైనా విజయం సాధించాలని మహిళలకు చీరలు పంపిణీ డ్రామా మొదలుపెట్టిందని ఎద్దేవా చేశారు. ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన మొక్కజొన్నల ను అమ్ముకోవడానికి ఎన్నో అష్ట కష్టాలు పడుతున్నారని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆర్థికంగా ఆదు కోవడం మర్చిపోయి కేవలం ఎన్నికల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తూ పబ్బం గడుపుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారులు పంపిణీ చేసే చీరలను మహిళలు తీసుకొని, ఓటుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని, మహిళలను, యువతను కోరారు.



మహిళాభివృద్ధికి పెద్దపీట వేసిన ప్రజా ప్రభుత్వమిది


- మహిళల ఆత్మగౌరవమే మాకు ప్రధానం
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, నవంబర్ 23: మహిళాభివృద్ధి కి పెద్దపీట వేసిన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభు త్వ లక్ష్యంగా ముందుకు పోతున్నామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. మెదక్ జిల్లా పాపన్న పేట మండల కేంద్రంలో, మెదక్ మండలం పాతూరులో, హవేలీ ఘనపూర్ మండల కేంద్రం రైతు వేదికలో, రామా యణపేటలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోహిత్ రావు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ వారిని ఉన్నత స్థానంలో నిలుపుతా మని, మహిళా సంఘాలు నిర్ణయించిన మోడల్ చీరలను పంపిణీకి ఎంపిక చేశామని తెలిపారు. మహిళల ఆత్మ గౌరవమే తమకు ప్రధానమని చెప్పారు. గ్రామ, మండల సమాఖ్య బాధ్యులు చీరల పంపిణీ బాధ్యతను తీసుకొని ప్రతి మహిళకూ చీరలు అందేలా చూడాలని అన్నారు. మహిళలు ఐక్యంగా ఉండాలనే సందేశంతో చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుస్సాపూర్‌లో బీరప్ప గుడి ప్రారంభం



ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 23: సిద్దిపేట మండలం బు స్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన బీరప్ప గుడిని ఆర్టీఏ మెంబర్ సూర్య వర్మ వారి చేతుల మీదుగా ప్రారం భించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో బీరప్ప గుడి నిర్మాణ పనులు ప్రారంభం కాగా, మొదటి విడతగా పంచాయతీరాజ్ విభాగం ద్వారా రూ.5 లక్షలు నిధులు మంజూరు చేయడంతో గుడి నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా బుస్సాపూర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, కురుమ సంఘం సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన సహకారం పట్ల కృతజ్ఞ తలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జిగా పనిచేసిన కొండ సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రస్తుత మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలకు సిద్దిపేట కాంగ్రెస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్య క్రమంలో సిద్దిపేట జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాయి నరసింహారెడ్డి, టీపీసీసీ మెంబర్ దరిపల్లె చంద్రం, సిద్ది పేట రూరల్ మండల అధ్యక్షులు గుర్రం అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద పాండు, జిల్లా ఫిషరీస్ జనరల్ సెక్ర టరీ సురేష్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మంద వనజ, సిద్దిపేట రూరల్ మండలంలోని అన్ని గ్రామాల కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు, కీలక నాయకులు పాల్గొన్నారు. బుస్సాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం సమష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవం తం చేశారు.



నాకు వేరే రాజకీయ పార్టీ పెట్టే ఉద్దేశం లేదు. ప్రస్తుతానికి తాను రైతు మాత్రమే. ఇతర పార్టీల్లోనూ చేరే ఉద్దేశమూ లేదు. అవసరం వస్తే మళ్లీ రాజకీయాల్లోకి వస్తా. జగన్ చుట్టూ ఉన్న కోటరీ ఆయనను డైవర్ట్ చేస్తోంది. అందుకే తాను రాజకీయాలకు దూరంగా ఉన్నా. నిబద్ధత లేని వారి మాటలు జగన్ వినకూడదు.

- మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రాంతీయం

ప్రభుత్వంపై ఆడబిడ్డల ఆశీర్వాదం ఉండాలి

- మహిళల ఐక్యతకు ఈ చీరెలు ప్రతిక
- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు
- ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్



ప్రతిపక్షం, చిగురుమామిడి, నవంబర్ 23: తెలంగాణ ప్రభుత్వంపై ఎల్లప్పుడూ మహిళల ఆశీర్వాదం ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు మహిళ ఉన్నతి తెలంగాణ ప్రగతి పథకం ద్వారా నాణ్యమైన సిరిసిల్ల చీరలను ఇందిరా మహిళ శక్తి చీరెలను తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని మహాలక్ష్మి గార్డెన్స్ లో ఆదివారం మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై మహిళలకు బొట్టు పెట్టీ సారే (చీరలు)ను అందించారు. అనంతరం 9మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను, చీరెలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్వినీ తానాజీ వకడే, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డిలతో కలిసి పంపిణీ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ లోని 18 సంవత్సరాలపైన ఉన్న మహిళలందరికీ సారే పెట్టాలని సిరిసిల్లలో తయారైన నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలందరూ ఐక్యంగా ముందుకు వెళ్ళాలని, ప్రభుత్వంపై మీఆశీర్వాదం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, తాహాశీల్దార్ మద్దసాని రమేష్, ఎంపీడీవో విజయ్ కుమార్, ఐకెపి ఏపిఎం శ్రీనివాస్, మాజీ జెడ్పిటిసి గీకురు రవీందర్, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు గందె రజిత, ఐకెపి సీసీలు దెంచనోజు సత్యనారాయణ, మహిళలు వివిధ శాఖల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్సీ ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 23 : ఆర్మూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆదివారం జిల్లా పాలనాధికారి టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బి.మహేష్ కుమార్ గౌడ్, ఆర్మూర్ శాసన సభ్యులు పైడి రాకేష్ రెడ్డి తదితరులు అభివృద్ధి పనులకు భూమి పూజలు చేశారు. ఆంధ్రనగర్ నుండి ఇందిరానగర్ మీదుగా లక్నపూర్ వరకు రూ. 2.28 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీ.టీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా నందిపేట్ శివారులో జన్నెపల్లి మెయిన్ రోడ్డు నుండి లక్కంపల్లి, చింరాజ్ పల్లి మీదుగా తల్వేద వరకు రూ.6.93 కోట్లతో చేపట్టనున్న ఆర్ అండ్ బీ రోడ్డు విస్తరణ పనులకు, ఐలాపూర్ గ్రామంలో రూ. 2.45 కోట్లతో నూతనంగా నిర్మించనున్న ఎస్సీ బాలుర హాస్టల్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రతీ చోట ప్రజాప్రతినిధులను, కలెక్టర్ ను ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాలలో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి ఇందిరమ్మ చీరల పంపిణీ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జిల్లాలో ఊపందుకుంది. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మహిళా సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఐకేపీ అధికారులు, సిబ్బంది ఆదివారం జిల్లాలోని ఆయా మండలాల్లో ఇంటింటికి తిరుగుతూ మహిళలకు ప్రభుత్వం సమకూర్చిన ఇందిరమ్మ చీరలను అందజేశారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం కలెక్టరేట్లో ప్రభుత్వ సలహాదారుతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యేలు లాంఛనంగా ప్రారంభించిన నేపథ్యంలో, మరుసటి రోజు నుండే అన్ని గ్రామాలలో ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర పంపిణీ చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సెలవు రోజు అయినప్పటికీ, ఐకేపీ ఏపీఎం లు, సీ.సీలు, వీ.ఓ.ఏ లు ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ సాంప్రదాయం అయిన సారె రూపంలో మహిళలకు చీరలు అందజేశారు.

బీసీల అభివృద్ధికి పాటుపడుతున్న కాంగ్రెస్

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



ప్రతిపక్షం బ్యూరో నిజామాబాద్, నవంబర్ 23 : రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి పాటుపడుతున్నది కాంగ్రెస్ పార్టీ అని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిన్న ప్రకటించిన డీసీసీ అధ్యక్షుల జాబితా లో సగానికి పైగా బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. ఆదివారం నిజామాబాద్ మున్నూరు కాపు జిల్లా సంఘం అధ్యక్షుడిగా సంజయ్ ప్రమాణ స్వీకారమానికి హాజరై మాట్లాడుతూ దివంగత డీ శ్రీనివాస్ ఆశయాలకు అనుగుణంగా బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పుకొచ్చారు. 75 శాతం బీసీ, ఎస్టీ, ఎస్టీలకే కేటాయించినట్లు పేర్కొన్నారు. ధర్మపురి శ్రీనివాస్ తనకు రాజకీయ గురువని, తనను బలవంతంగా రాజకీయాల్లోకి తీసుకువచ్చి, ఎన్ఎస్ఈ అధ్యక్ష పదవి ఆర్డర్ కాపీ తీసుకొచ్చి తనకు ఇచ్చారని గుర్తు చేశారు. డీఎస్ తో తనకు రాజకీయ విభేదాలు 20 సంవత్సరాలు పాటు ఉన్న ఆయనంటే తమకు ఎంతో గౌరవం అని పేర్కొన్నారు. డీఎస్ చివరి రోజుల్లో నేను పీసీసీ అవుతానని డీఎస్ చెప్పారు. పీసీసీ అయ్యాక డీఎస్ మరణించారు. ఆయన బతికి ఉంటే నేను సంపూర్ణ ఆశీర్వాదం పొందే వాడినని పేర్కొన్నారు. 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దేశ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బీసీలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ కులాలన్నీ ఏకతాటిపైకి రావాలని మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.
కర్నూల్ నుంచి ఓ మాజీ ఎమ్మెల్యే ఫోన్ చేసి 36లో 17 బీసీలకు డీసీసీలు ఇవ్వడంపై ఆశ్చర్యపోయారని, ఆనాడు బీసీల అభివృద్ధిపై డీఎస్ చిత్తశుద్ధి తో ఉంటే తాము బీఎసీల ఐక్యత అభివృద్ధి కొరకు డీఎస్ అడుగుజాడలో నడుస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరికి తమ కులం పై అభిమానం ఉండాలి గాని, కుల పిచ్చి ఉండరాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక రెడ్డి బిడ్డా ఉండి బీసీల రిజర్వేషన్ కొరకు పాటు పడుతున్నారని తెలిపారు. మున్నూరు కాపు సామాజికవర్గ అభివృద్ధికి తామంతా ఎల్లప్పుడూ కృషి చేస్తామని అభివృద్ధికి పాటు పడతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులంతా జిల్లా అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు. మున్నూరు కాపు జిల్లా సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సంజయ్ సంఘాల అభివృద్ధికి పాటు పడాలని సూచించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ డి శ్రీనివాస్ తాను రాజకీయాలు ఒకేసారి వచ్చామని ఒకేసారి పోటీ చేశామని తెలిపారు. ఆయన రాజకీయాలు హుందాగా నడిపారని, వైఎస్ హయంలో మంత్రులుగా పని చేశామని తెలిపారు.

జిల్లాలోని అన్ని సంఘాలను పటిష్టత పరుస్తా....
మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన సంజయ్ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని మున్నూరు గత సంఘాలను పరుస్తానాని అన్నారు. నాడు తన తండ్రి డి శ్రీనివాస్ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, ఆయన చేసిన సేవ రాష్ట్రంలోనే ప్రత్యేకత గుర్తింపు, జిల్లాలో మున్నూరు కాపుల ఐక్యత చాటిందన్నారు. నాన్న అడుగుజాడలు నడిచి మున్నూరు కాపులను అభివృద్ధికి తీసుకొస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్మూర్, నిజామాబాద్ ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, ధన్పాల్ నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ అనిల్ మాట్లాడుతూ.. తాము ఎమ్మెల్యేలుగా గెలిచామంటే అందులో మున్నూరు కాపుల కీలక పాత్ర ఉందన్నారు. వారి సహకారం, వారి ఓట్ల వల్లే తాము నేడు పదవులలో ఉన్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్ కులచారి, జిల్లా కేంద్రంలోని వివిధ కుల సంఘాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. అంతకు ముందు ధర్మపురి సంజయ్ మనోకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయగా, వివిధ మతాల అర్చకులు, పూజారులు ఆయనకు ఆశీర్వచనాలు అందించారు.

డీసీసీ అధ్యక్షుడిగా రాజ్ ఠాగూర్.. కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 23: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ రెండవసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు బొంతల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిప్పారపు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సామాన్య కార్యకర్త నుండి యువజన కాంగ్రెస్, కాంగ్రెస్ లో క్రియాశీలక పాత్ర పోషించి స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి శిష్యుడిగా, షాప్ చైర్మన్ గా పనిచేసి అందరి మన్ననలు పొందారని అన్నారు. తర్వాత 2023 సాధారణ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలుపొందారని అన్నారు. అధిష్టానం తన సేవలను గుర్తించి జిల్లా అధ్యక్షునిగా రెండవసారి అవకాశం కల్పించడం జరిగిందన్నారు. ఈ అధ్యక్ష పదవికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్, అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలువ లింగస్వామి, మహంకాళి స్వామి, రవికుమార్, దీటి బాలరాజు, ముస్తఫా, గట్ల రమేష్, కొప్పుల శంకర్, చుక్కల శ్రీనివాస్, నాయిని ఓదెలు యాదవ్, ఆడెపు రవి, బుచ్చిరెడ్డి, దూళికట్ట సతీష్, గడ్డం శ్రీనివాస్, సన్నీ, పంజా శ్రీనివాస్, ఫజల్, దశరథం, బూర్ల శ్రీనివాస్, వంశీ, కుంట సది, నాగభూషణం గౌడ్, గుమ్మడి రవి, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

8 ఇంక్లైన్ కాలనీ లో..
8వ కాలనీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండేటి రాజేష్ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు గుండేటి రాజేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ని అధిష్టానం గుర్తించి రెండవసారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఇవ్వడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సాగంటి శంకర్, మాజీ సర్పంచ్ సదానందం, మార్క రాజు, దేవనపల్లి చక్రపాణి, అనుము రాములు, రేషేవేని కేశవులు, మెరుగు రాజేష్, ఇరికి మహేష్, ఓదెల కుమార్, పూజారి రాకేష్, సాదుల శ్రీనివాస్, మారం కుమార్, మారుపాక ఓదెలు, గరిగంటి సతీష్, మాదాటి రవీందర్ రెడ్డి, మంతెన కొమురయ్య, బాలు యాదగిరి నాగరాజు, మహేందర్ రెడ్డి, తాటిపల్లి దేవయ్య, జి రమేష్ జంపయ్య, యాకూబ్ పాషా పాల్గొన్నారు.

ప్రజలు కాల్ సెంటర్ ను ఉపయోగించుకోవాలి

- 'సిటిజెన్ బడ్డీ యాప్' లో ఫిర్యాదు చేయాలి
- అదనపు కలెక్టర్ అరుణ శ్రీ



ప్రతిపక్షం ప్రతినిధి, గోదావరిఖని, నవంబర్ 23: మున్సిపల్ సేవలకు సంబంధించి తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి నగర ప్రజలు కాల్ సెంటర్, ఆన్ లైన్ సదుపాయాలను ఉపయోగించుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ తెలిపారు. పారిశుధ్యం, రోడ్లు, కాలువల సమస్యలు, నీటి సరఫరా, వీధి దీపాలు వెలగక పోవడం తదితర అన్ని మున్సిపల్ సేవలకు సంబంధించి ప్రజలు కార్యాలయానికి వచ్చి ధరఖాస్తు సమర్పించవలసిన అవసరం లేకుండా కాల్ సెంటర్, ఆన్ లైన్ లో తమ ఫిర్యాదులను నమోదు చేయడంతో పాటు పరిష్కార స్థితిని కూడా తెలుసుకునే సౌలభ్యం ఉందని అన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న వారు ప్లే స్టోర్ నుండి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ "సిటిజెన్ బడ్డీ యాప్ "డౌన్ లోడ్ చేసుకొని అందులో ఫిర్యాదు నమోదు చేయవచ్చని అలాగే వెబ్ సైట్ htpp:// egovindia.in లోని గ్రీవెన్స్ పేజీ లో కూడా తమ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 14420 కు ఫోన్ చేయడం ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేసుకునే సౌలభ్యం ఉన్నదని, అంతేకాకుండా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయం లోని కాల్ సెంటర్ కు నేరుగా టోల్ ఫ్రీ నెంబర్ 18004257062, 1800 4258 927 లకు లేదా ఫోన్ నెం 960 3666444 , 9392483959 (కంట్రోల్ రూమ్) లకు కు ఫోన్ చేస్తే ఫిర్యాదు స్వీకరించి నమోదు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు.



సింగరాయ జాతరకు భారీ ఏర్పాట్లు

- బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారుల సమీక్ష

ప్రతిపక్షం, కోహెడ, నవంబర్ 23: చారిత్రక ప్రతాప సింగరాయ లక్ష్మీనరసింహస్వామి జాతర భద్రతా ఏర్పాట్లపై పోలీసు ఉన్నతాధికారులు ఆదివారం సమీక్ష నిర్వహించారు. హుస్నాబాద్ ఏసీపీ సదానందం, హుస్నాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కొర్ర శ్రీనివాస్, కోహెడ ఎస్సై బందోబస్తు ప్రణాళికలో భాగంగా కోహెడ మండలంలోని కూరెళ్ల, తంగళ్లపల్లి, గుండారెడ్డిపల్లి, బస్వాపూర్ గ్రామాలకు మధ్య ఉన్న గుట్ట పరిసరాలను సందర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, క్యూలైన్ల నిర్వహణపై అధికారుల బృందం క్షుణ్ణంగా పరిశీలన జరిపింది. లక్షలాది మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక పోలీసు బందోబస్తు చేయాలని అధికారులు నిర్ణయించారు. కాకతీయుల కాలంలో, అంటే 11 నుంచి 13వ శతాబ్దం మధ్యలో, సింగరాయ అనే ఇంజనీరు ఇక్కడ ప్రాజెక్టు నిర్మాణం కోసం వచ్చి, ప్రకృతి సౌందర్యానికి ముగ్ధుడై కొండపై లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర. స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.
అంతేగాక, పశ్చిమ దిశగా ప్రవహించే మోయతుమ్మెద వాగు పవిత్ర జలాల్లో స్నానం ఆచరిస్తే సర్వరోగాలు నయమవుతాయని భక్తుల నమ్మకం. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఒక్కరోజు ముందే బంధువుల ఇళ్లకు చేరుకుని, ఉదయాన్నే అందరూ కలిసి సింగరాయ జాతరకు బయలుదేరడం ఇక్కడ ఆనవాయితీ.



కలెక్టరేట్ లో సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, నవంబర్ 23 : భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొని, సత్యసాయి బాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. భగవాన్ సత్యసాయి బాబా జీవిత విశేషాలు, బోధనలు, సేవా నిరతిని గుర్తు చేసుకున్నారు. వేడుకల సందర్భంగా సత్యసాయి బాబా సేవా సమితి ప్రతినిధులు భక్తి గీతాలు ఆలపించారు. సత్యసాయి ప్రబోధనలను చాటుతూ, సేవా కార్యకలాపాలు కొనసాగించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. సమాజానికి సేవ చేయడం, మానవతా విలువలను పాటించడం, ప్రేమ, శాంతి, సత్య, ధర్మ, అహింసా సిద్ధాంతాలను అనుసరించడం భగవాన్ సత్యసాయి బాబా బోధించిన ముఖ్య సందేశాలు అని వక్తలు సూచించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. భగవాన్ సత్యసాయి జయంతి వేడుకలు అధికారికంగా నిర్మించడం పట్ల సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి పవన్ కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, ఎన్.ఐ.సి అధికారి మధు పాల్గొన్నారు.



లేబర్ కోడ్ల అమలు నిలిపివేయాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్ డిమాండ్

ప్రతిపక్షం, సిద్దిపేట, నవంబర్ 23: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలును నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వరకు ర్యాలీ ప్రదర్శన నిర్వహించి, అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేతనాల కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రతా కోడ్ (2020), వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020) నవంబర్ 21, 2025 నుండి అమలు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు, గరిష్ట లాభాల కోసం చేసిన నష్టదాయక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కార్మిక నిబంధనలను, సంక్షేమాన్ని తుంగలో తొక్కి పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే 29 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లు బిజెపి ప్రభుత్వం తెచ్చిందని అన్నారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రాష్ట్రంలోని యావత్ కార్మికులు సమరశీల ఐక్య పోరాటాలకు సిద్ధం అవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు గుర్రం నరసింహులు, మున్సిపల్ అధ్యక్షులు దొబ్బెట రాజయ్య జిల్లా కోశాధికారి వినోద, నాయకులు సత్యం, ఆసక నరసింహులు, గ్యాదరి మహేష్ , కుమారు, ప్రమీల, బాలమణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

“



వచ్చే ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకే ఓటమి తథ్యం. రాష్ట్రంలో ప్రజలందరికీ సొంతిల్లు, ప్రతి ఇంటికి ఒక బైక్ ఉండాలన్నదే తన లక్ష్యం. డీఎంకే తమకు రాజకీయ ప్రత్యర్థి. భారతీయ జనతా పార్టీ సైద్ధాంతిక ప్రత్యర్థి. రాష్ట్రంలో ఇసుక దోపిడీ సహా ఎన్నో రకాలుగా డీఎంకే ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోంది.

-కాంచీపురం సభలో TVK పార్టీ చీఫ్ విజయ్

ప్రాంతీయం



మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- చీరలను పంపిణీ చేసిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, నవంబర్ 23: మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తున్నదని, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్స్ లో మంత్రి శ్రీధర్ బాబు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వడ్డీ లేని రుణాలను, మహిళల పేర్లనే నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్ళను, ఉచిత రవాణా సౌకర్యాన్ని యాన్ని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును అందజేస్తున్నట్లు తెలిపారు. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను రాష్ట్రంలో పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి స్థానిక శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావులు మహిళా సమాఖ్య లకు చెందిన మహిళలకు పుట్టింటి కానుకగా ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ రోజు గ్రామీణ ప్రాంతాల మహిళలతో పాటు వచ్చే నెల రోజులలో పట్టణ ప్రాంత మహిళలకు నాణ్యమైన చీరలు అందిస్తున్నామని, మీ ఆశీర్వాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలో మీ ఆశీర్వాదం అందించాలని కోరుతున్నామని, ఇచ్చిన హామీలని ఒకటి తరువాత ఒకటి అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టంచేశారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేసి ఒక మెగా వాట్ వరకు విద్యుత్ ఉత్పత్తి చేయడం వల్ల 6 కోట్ల రూపాయలు నిధులు లభిస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మహిళా సంఘాలకు పాడి పరిశ్రమలకు కృషి చేస్తామని అన్నారు. భూపాలపల్లి, మంథని నియోజక వర్గాలకు ఒకటి చొప్పున మహిళలకు పెట్రోల్ బంకులు ఏర్పాటుకు స్థల సేకరణ జరుపుతున్నామని తెలిపారు. మహిళల పేరు మీదనే వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ ఇళ్లు, మీ సేవ కేంద్రాలు, డైరీ పరిశ్రమలతో పాటు చిరు వ్యాపారాలకు కూడా మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. కుందూరుపల్లి వద్ద మహిళల కోసం వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అక్కడి నుండి ఉచితం బస్సు ప్రయాణం సైతం కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్, ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డి ఆర్ డి ఓ బాలకృష్ణ, ఉపాధి హామీ పథకం రాష్ట్ర సభ్యులు రమేష్, మహిళా సమాఖ్య సంఘాల అధ్యక్ష కార్యదర్శులు సరిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వ స్పోర్ట్స్ పాలసీ

- క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకోవాలి
- మారథాన్ పోటీ నిర్వహణతో దేశవ్యాప్తంగా జిల్లా ఖ్యాతి
- విజయ డెయిరీకి పూర్వవైభవం తీసుకువస్తాం
- మంత్రి వాకిటి శ్రీహరి



ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 23: ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం ఉదయం నాయిని విశాల్ ఫౌండేషన్, క్రెడాయి వరంగల్, తెలంగాణ రన్నర్స్, కియాన్ ఇన్ ఫ్రా సంయుక్త ఆధ్వర్యంలో వరంగల్ ట్రైసిటీ హాఫ్ మారథాన్2025ను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, నిర్వాహకులు విష్ణువర్ధన్ రెడ్డి, తదితరుల సమక్షంలో హాఫ్ మారథాన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తిని పెంపొందించు కోవాలన్నారు. క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకు, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను రాణించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ పాలసీని తీసుకువచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. హనుమకొండలో నిర్వహిస్తున్న మారథాన్ పోటీలు రాష్ట్రవ్యాప్తంగా వ్యాప్తించాలని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా రాష్ట్రంలోనే 4వ క్రీడా పాఠశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాకు కేటాయించారని తెలిపారు. మారథాన్ లో పాల్గొంటున్న క్రీడాకారులు నీలిరంగు టీ షర్టులు ధరించి పరిగెడుతుంటే వరంగల్ కు బ్లూ పెయింట్ వేసినట్టు ఉందన్నారు. తాను రంజీ గేమ్స్ ఆడుతున్న సమయంలో తన తల్లిదండ్రులు ఎందుకు ఆటలాడుతున్నావని తిట్టేవారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో తమ పిల్లలు ఎందుకు ఆటలు ఆడడం లేదని తల్లిదండ్రులు బాధపడుతున్నారని అన్నారు. విజయ డెయిరీకి పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. దాదాపు 35 కోట్ల రూపాయలతో విజయ డెయిరీని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నాయిని విశాల్ ఫౌండేషన్, ఇతర సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మారథాన్ నిర్వహించినందుకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మారథాన్ లో పాల్గొనేందుకు వేలాదిమంది వచ్చారని, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. మారథాన్ నిర్వహణతో జిల్లాకు మంచి పేరు వచ్చిందని అన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పోర్ట్స్ ను ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫుట్ బాల్ ప్లేయర్, మంత్రి వాకిటి శ్రీహరి రంజీ ప్లేయర్ అని అన్నారు. రానున్న రోజుల్లో మరింత మంది ఇలాంటి ఈవెంట్లలో పాల్గొనాలని కోరారు. సమావేశం అనంతరం 5కె మారథాన్ ను రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి జెండా ఊపి ప్రారంభించి పరుగులో మంత్రి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాయల చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, క్రెడాయి ప్రతినిధులు, రాష్ట్రంలోని జిల్లాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి అథిలెట్స్ 5, 10, 21 కె రన్ మారథాన్ లో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా



ప్రతిపక్షం ప్రతినిధి, హన్మకొండ, నవంబర్ 23: హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామానికి చెందిన బీ ఆర్ ఎస్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లెపాక సంపత్ బైక్ ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి తాటికాయలలోని వారి నివాసానికి వెళ్లి కర్ణాకర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఆర్యవైశ్య సంఘు నూతన కార్యవర్గ అభినందన సభ

- హాజరైన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్, నవంబర్ 23 : నిర్మల్ పట్టణంలో ఇటీవల ఎన్నికైన ఆర్యవైశ్య నూతన కార్యవర్గ సభ్యుల అభినందన సభకు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా సంఘ సభ్యులు ఎమ్మెల్యే కు బుధవార్ పేట్ చౌరస్తా నుండి నాయుడివాడ వరకు బైక్ ర్యాలితో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, సంఘ సభ్యులు తెలిపిన సమస్యలను వీలైనంత మేరకు పరిష్కరించేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. సంఘ సభ్యులు ఎమ్మెల్యే గారిని శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ఆమెడ శ్రీధర్, జిల్లా బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, నాయకులు మేడిసెమ్మ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, పట్టణ అధ్యక్షులు సుంకరి సాయి, తాజామాజీ కౌన్సిలర్ సాదం అరవింద్, జుట్టు దినేష్, గిల్లి విజయ్ తో పాటు ఆర్యవశ్య సంఘ నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రతిపక్షం, హనుమకొండ, నవంబర్ 23: రాష్ట్రంలోని మహిళల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులోని రైతు వేదిక లో ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పక్షాన 18 సంవత్సరాల పైన ఉన్న మహిళలందరికీ సారే చీరలను అందిస్తుందన్నారు. సిరిసిల్ల లో నాణ్యమైన చీరలను రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయించిందన్నారు. మహిళలకు ఐక్యతకి చిహ్నంగా ఈ చీరలు ఉపయోగపడనుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలు అమలు చేస్తుందని పేర్కొన్నారు. మహిళలకు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సహకారంతో పెట్రోల్ బంకులు, సోలార్ పవర్ ప్లాంట్, ఆర్టీసీ బస్సులకు యజమానులవుతున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థికంగా నిలదొక్కుంటారనే సంకల్పం తో ప్రభుత్వం ఈ కార్యక్రమాలు ప్రభుత్వం చేస్తుందన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఇటీవల ఎల్కతుర్తి లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని, భీమదేవరపల్లి లో కూడా త్వరలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎంఎన్జే కాన్సర్ హాస్పిటల్ నుండి మండలంలో కాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ లు, కరీంనగర్ లయన్స్ క్లబ్ నుండి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. భీమదేవరపల్లి , ఎల్కతుర్తి సెరీ కల్చర్ హబ్ గా ఉండేది దానిని పట్టు కోల్పోకుండా మరింత అభివృధి చేసేలా కృషి చేస్తామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, అప్పుడే ఆ ఇల్లు అభివృద్ధి చెందుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. జిల్లాలో సెరికల్చర్ యూనిట్లను మహిళా సమాఖ్యల ద్వారా ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సమాఖ్యలు వరి ధాన్యం కొనుగోలు మాత్రమే చేసేవారని, కానీ ఇప్పుడు మహిళలకు ప్రత్యేక గుర్తింపు రావాలని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నాణ్యతతో చీరలను తయారు చేయించి అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను, స్థానిక తహసిల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ , వైస్ చైర్మన్ స్రవంతి, పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



గంగపుత్ర సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ

ప్రతిపక్షం ప్రతినిధి ,నిర్మల్, నవంబర్ 23 : మామడ మండల కేంద్రంలో గంగపుత్ర సంఘ భవన కళ్యాణ మండప (షెడ్) నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమిపూజ చేసారు. కళ్యాణ మండపం పూర్తి నిర్మాణానికి అదనపు నిధులు త్వరలో మంజూరు చేసి పూర్తి అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు సంఘ సభ్యులు ఎమ్మెల్యే ను శాలువా తో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాపు రెడ్డి,ముత్యం రెడ్డి , జిల్లా ఉపాధ్యక్షులు సత్యం చంద్రకాంత్, నవీన్, గోవర్ధన్ రెడ్డి, రమణ, సూరి, భాస్కర్, వెంకటేశ్వర్ రావ్, శ్రీను, మల్లయ్య, రాజు, ఆశన్న, తో పాటు మండల నాయకులు కార్యకర్తలు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



అర్థం తరంగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనుల దుస్థితి



వర్షా లకు గడ్డగా మారిన సిమెంట్ సంచులు

నిర్లక్షపు నీడలో సోన్ ఎంఆర్ సీ భవన నిర్మాణ పనులు..!

- రూ 40 లక్షల నిధులు వృధా..
- మట్టి పాలవుతున్న సిమెంట్ సంచులు శిథిలం అవుతున్న నిర్మాణం


ప్రతిపక్షం, సోన్, నవంబర్ 23 : నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలో రూ.లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఎం ఆర్ సి భవన నిర్మాణం నిర్లక్ష్యపు నీడలో ఉండి నిర్మాణ సామాగ్రి మట్టి పాలవుతుంది. స్లాబ్ లెవెల్ వరకు నిర్మించిన భవన నిర్మాణం కూడా శిథిలావస్థకు చేరుకొని అధ్వానంగా తయారవుతుంది. మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సంబంధిత సిబ్బంది వ్యవహారాల నిర్వహణకై 2021లో అప్పటి ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికై టి డబ్ల్యూ ఐ డి సి నిధులు రూ.40 లక్షలు కేటాయించింది. అప్పటి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి హయాంలో భవన నిర్మాణ పనులను లాంఛనంగానే ప్రారంభించారు.

ఐదేళ్లుగా నిలిచిపోయిన నిర్మాణ పనులు

గత ప్రభుత్వ హయాంలో 2021లో రూ 40 లక్షల వ్యయంతో ప్రారంభించిన మండల రిసోర్స్ పర్సన్ సెంటర్ భవన నిర్మాణ పనులు అప్పటినుండి నత్త నడకనని సాగుతున్నాయి. ఈడబ్ల్యుఐడీసీ ద్వారా టెండర్ వేసి టెండర్ షెడ్యూల్ ఆధారంగా రూ.40 లక్షలు కేటాయించారు. ముందుగా ఈ టెండర్ ను పొందిన కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి నిర్ణీత కాలంలోనే స్లాబ్ వరకు పూర్తి చేసి ఆ తర్వాత నిర్మాణ పనులను నిలిపివేసి పత్తా లేకుండా పోయాడని చెబుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇతర విద్యా శాఖ సంబంధిత ఉద్యోగులు,సిబ్బంది అవసరాల నిమిత్తం ఈ భవనం ఉపయోగ పడుతుంది. నాలుగున్నర సంవత్సరాలుగా నిర్మాణ పనులు నిలిచిపోయి నత్త నడకన సాగుతూ ఉండడంతో నిర్మాణ సామాగ్రి మట్టిపాలవుతుంది. దీంతో ప్రజల ధనం వృధాగా మారుతుంది.

ఇప్పటికే కాంట్రాక్టర్ కు నాలుగు సార్లు నోటీసులు ఇచ్చాం : సర్వ శిక్ష అభియాన్ ఏఈ ఆంజనేయులు

2021లో అప్పటి ప్రభుత్వ హయాంలో మండల రిసోర్స్ పర్సన్ సెంటర్ నిర్మాణ పనులను అధికారిక నియమ నిబంధనల ప్రకారమే ప్రారంభించాం. రూ.40 లక్షలతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనుల కాంట్రాక్టర్ పనులను సగం వరకే చేసి వెళ్లిపోయాడు. పదిహేను శాతం వరకే పనులు పూర్తయి ఇరవై ఐదు శాతం ఇంకా కావాల్సి ఉంది. కాంట్రాక్టర్ కు నాలుగుసార్లు నోటీసులు జారీ చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణ పనులను పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే నిర్మాణాలు నిలిచాయి: మండల విద్యాధికారి తోడిశెట్టి పరమేశ్వర్.



రూల్ 40 లక్షల వ్యయంతో అత్యంత శోభాయమానంగా నిర్మించుకోవలసిన మండల రిసోర్స్ పర్సన్ సెంటర్ నిర్మాణ పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలనే నిలిచిపోయాయి. ఇప్పటికే ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్ళాం. సదర్ కాంట్రాక్టర్ పనులను చేయకుంటే ఇతరులతో చేపట్టాలని ఆదేశించాం. త్వరలో నిర్మాణ పనులు పూర్తి అయ్యేలా కఠినంగానే ముందుకెళ్తాం.



నిర్మల్ జిల్లాలో ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రతిపక్షం, నిర్మల్, నవంబర్ 23: నిర్మల్ జిల్లాలోని ఐదు పరీక్ష కేంద్రాలలో ఆదివారం ఉదయం 9:30 నుండి పగలు 12:30 వరకు జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షల్లో 1043 విద్యార్థులగాను 1017 విద్యార్థులు హాజరుకాగా 26 మంది విద్యార్థులు గైరాజరయ్యారు హాజరు శాతం 97.5 కాగలదు. పరీక్ష నిర్వహణ కొరకు ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, సెంటర్ లెవెల్ అబ్జర్వర్లను ప్రత్యేకంగా నియమించారు. ప్రతి కేంద్రంలో పోలీసు బందోబస్తు తో పాటు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జిల్లాలోని వివిధ పరీక్ష కేంద్రాలను నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ సందర్శించారు.

“



రవిని ఎన్‌కౌంటర్ చేయాలన్న నిర్మాత సి.కళ్యాణ్ ను ఎన్‌కౌంటర్ చేస్తే ఆ బాధ ఏంటో తెలుస్తుంది. సినిమాలో విషయం ఉంటే జనం కచ్చితంగా చూస్తారు. నేను 45 పైసలతో సినిమా చూశా. ఇప్పుడు రేట్లు పెరిగాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి సినిమా ఎవడు తీయమన్నాడు. నా కొడుకు తరపున వాదించే న్యాయవాదులకు ఆర్థిక సహాయం చేస్తా.

- ఐబొమ్మ రవి తండ్రి అప్పారావు

సింధ్ రాష్ట్రం భారతదేశంలో కలవవచ్చు

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 23: పాకిస్తాన్‌లోని సింధ్ రాష్ట్రం భవిష్యత్తులో భారతదేశంలో కలవవచ్చని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. సింధ్ ఇపుడు భారత్‌లో భాగం కాకపోయినా, ఇక్కడి నాగరికతతో ఇప్పటికీ ముడిపడి ఉందని కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ సరిహద్దులు మారవచ్చని కూడా పేర్కొన్నారు. 1947లో దేశ విభజన అనంతరం పాకిస్తాన్ లో చేరిపోయిన సింధ్ ప్రాంతం, ముందు ముందు మన దేశంలో కలిసే అవకాశం ఉందన్నారు. ఢిల్లీ సింధీ సమాజం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సింధ్‌ను భారత్ నుంచి వేరుచేయడాన్ని అక్కడి హిందువులు అంగీకరించలేదని బీజేపీ అగ్రనేత ఎల్‌కే అద్వాణీ తన ఓ పుస్తకంలో రాశారని గుర్తు చేశారు. సింధ్‌లోనే కాదు, భారతదేశంలోనూ హిందువులు సింధు నదిని పవిత్రంగా భావిస్తారన్నారు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే) ప్రజలూ మనవాళ్లేనని, వారికి భారత్‌తో దృఢ సంబంధాలు ఉన్నాయని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. పీఓకే దానంతట అదే తిరిగి భారత్‌లో చేరుతుందని అన్నారు. పీఓకే ప్రజలు భారత్‌లో కలిసేందుకు ముందుకు రావాలని కూడా ఆయన గతంలో పిలుపునిచ్చారు. పాకిస్తాన్ మాదిరిగా తాము వారిని విదేశీయుల్లా కాకుండా, సొంత మనుషుల్లా చూస్తామని చెప్పారు.




విశ్వ వీక్షణం



బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్

- ప్రశాంత్ కిశోర్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, పాట్నా, నవంబర్ 23: జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. ప్రజలకు ఏ మాత్రం తెలియని పార్టీలకు కూడా లక్షల ఓట్లు రావడాన్ని ఇందుకు ఉదాహరణగా చూపారు. ఎన్నికల సమయంలో తమ బృందం సేకరించిన అభిప్రాయాలకు, వెలువడిన ఫలితాలకు అస్సలు పొంతనే లేదన్నారు. అయితే, తన వద్ద ఇందుకు తగిన ఆధారాలు లేవరు. ఆధారాలు దొరికాక అన్ని వివరాలు వెల్లడిస్తానన్నారు. అటు బిహార్ ఎన్నికలలో జన్‌సురాజ్ పార్టీకి ఒక్క సీటు కూడా లభించలేదు. దీంతో ఫలితాలు తనను ఎంతో బాధపెట్టాయని ప్రశాంత్ కిశోర్ అన్నారు. ఎక్కడో ఏదో తప్పు జరిగిందని చెప్పారు. కాగా, ఈవీఎంలను మార్చారనే ఆరోపణలు చేయాలని కొందరు కోరుతున్నారని, కానీ, ఓడిపోయాక ప్రతీ అభ్యర్థి చేసే ఆరోపణలు దాదాపు ఇవేనన్నారు. ఫలితాలలో చాలా వరకు విషయాలు సరిపోవడం లేదన్నారు. ఇక తన రాజకీయ జీవితం ముగిసిందంటూ మీడియాలో వస్తున్న కథనాలను ప్రశాంత్ కిశోర్ తోసిపుచ్చారు. తాను బిహార్‌లో ఉంటానని, ప్రజలలోకి వెళతానని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత మహిళలకు ఎన్డీయే రూ.10 వేలు అందజేయడం అనైతికమని విమర్శించారు. ఓటమికి వంద శాతం తానే బాధ్యత తీసుకుంటానని పేర్కొన్నారు. తప్పిదాలను సరిదిద్దుకుని తిరిగి మరింత బలంగా వస్తామని, వెనక్కి వెళ్లే ప్రసక్తే లేదని చెప్పారు.



చండీఘర్ ను లాక్కోవాలంటే కుదరదు

- రాజ్యాంగ సవరణపై విపక్షాల ఆగ్రహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, చండీఘర్, నవంబర్ 23: పంజాబ్, హర్యానా రాజధాని చండీఘర్ లో చట్టాలు చేసే అధికారాన్ని రాష్ట్రపతి పరిధిలోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తోంది. ఇందుకోసం తేవాలనుకున్న రాజ్యాంగ అధికరణ 131 సవరణ బిల్లును పంజాబ్ ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే చండీఘర్ ఆర్టికల్ 240 పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం పంజాబ్ గవర్నర్ చండీఘర్ అడ్మినిస్ట్రేటర్‌గా వ్యవహరిస్తున్నారు. బిల్లు ఆమోదం పొందితే రాష్ట్రపతికి ఇక్కడి చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అందుకే ఆమ్ ఆద్మీపార్టీ, కాంగ్రెస్, అకాలీదళ్ ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే, ఈ పార్లమెంట్ సమావేశాలలో దీని మీద ఎలాంటి బిల్లు ప్రవేశపెట్టడం లేదని కేంద్రం వివరణ ఇచ్చింది. ఎన్డీయే ప్రభుత్వం చండీఘర్ ను స్వాధీనం చేసుకోవాలని చూస్తోందని పంజాబ్ సీఎం, ఆప్ నేత భగవంత్ మాన్ ఆరోపించారు. చండీఘర్ పంజాబ్‌తో విడదీయరాని భాగమేనని పేర్కొన్నారు. పంజాబ్ గుర్తింపు మీద కేంద్రం దాడి చేస్తోందని ఆమ్ ఆద్మీపార్టీ అగ్రనేత అరవింద్ కేజ్రీవాల్ కూడా ఆరోపించారు. తీవ్ర ప్రతికూల పరిణామాలు ఉంటాయని పంజాబ్ కాంగ్రెస్ చీఫ్ అమరీందర్ సింగ్ అన్నారు. అకాలీదళ్ నేత సుఖ్‌బీర్‌సింగ్ బాదల్ కూడా దీనిని పంజాబ్ వ్యతిరేక బిల్లుగా అభివర్ణించారు. చండీఘర్ అంశంలో తలెత్తిన గందరగోళాన్ని కేంద్రంతో చర్చించి పరిష్కరిస్తామని బీజేపీ చెబుతోంది.



ఢిల్లీలో 200 కోట్ల భారీ డ్రగ్స్ స్వాధీనం

- విదేశీయుల ఆధ్వర్యంలో నడుస్తున్న ముఠా గుట్టు రట్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, నవంబర్ 23: దేశ రాజధాని ఢిల్లీలో భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టును నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు రట్టు చేశారు. రూ.200 కోట్లకు పైగా విలువగలిగిన డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. ఓ ఫామ్‌హౌస్‌పై జరిపిన దాడితో లభించిన ఆధారాలతో మూడు రోజుల పాటు విస్తృతంగా తనిఖీలు చేశారు. దీంతో ఒక అంతర్జాతీయ సింథటిక్ డ్రగ్ నెట్‌వర్క్ బయటపడింది. ఇది విదేశీయుల ఆధ్వర్యంలో నడుస్తోందని తేలింది. కాగా, ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలోని అనేక ప్రాంతాలలో పోలీసులు నిఘా పెట్టి, అనుమానితుల కదలికలను పసిగట్టారు. ఉత్తరప్రదేశ్ అమ్రోహా జిల్లా, మంగ్రౌలి గ్రామానికి చెందిన 25 యేండ్ల షేన్ వారిస్‌ను అరెస్టు చేసారు. నోయిడా సెక్టార్ 5 లోని హరోలాలో అద్దెకు ఉంటున్న అతను ఒక కంపెనీలో సేల్స్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడని సమాచారం. బాస్ ఆదేశాల మేరకు షేన్ నకిలీ సిమ్ కార్డులు, వాట్సాప్, జాంగి వంటి ఎన్‌క్రిప్టెడ్ చాట్ యాప్‌లను ఉపయోగించి తన స్థానాన్ని గుర్తించకుండా జాగ్రత్తపడినట్లు విచారణలో తేలింది. విచారణలో అతను మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌లో తన పాత్రను అంగీకరించి, అనేక కీలక వివరాలు వెల్లడించాడని అధికారులు తెలిపారు. ఎస్తేర్ కిమాని అనే మహిళ సహకారంతో పోర్టర్ రైడర్ ద్వారా పెద్ద మొత్తంలో డ్రగ్స్ పంపాడని, ఆమె చిరునామా, సంప్రదింపు సమాచారాన్ని అందించాడని ఎన్సీబీ అధికారులు చెబుతున్నారు.

శబరిమలకు పెరుగుతున్న రద్దీ

- రోజూ సజావుగా సాగుతున్న అన్నదానం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, శబరిమల (కేరళ), నవంబర్ 23 : శబరిమలకు భక్తులు బారులుదీరుతున్నారు. పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా దేవస్థానం బోర్డు తగిన నిర్ణయాలు తీసుకుంటోంది. బుకింగ్ విధానంలోనూ మార్పులు తెచ్చింది. శబరిమలలో రోజూ మూడు పూటల అన్నదానం చేస్తారు. ఈ యేడాది ఆలయం తెరిచినప్పటి నుంచి శనివారం నాటికి లక్ష మందికి పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం తెరిచి ఉన్న అన్ని రోజులలో అన్నదానం ఉంటుంది. ఉదయం 6 గంట నుంచి 11 వరకు ఉప్మా, శనగల కూర, వేడి వేడి కాఫీ ఇస్తారు. పగలు 12 నుంచి 3:30 వరకు పులావ్, దాల్ కర్రీ, పచ్చడితో అన్న ప్రసాదం ఇస్తారు. సాయంత్రం 6:45 నుంచి ఆలయం మూసే వరకు గంజి, పుజుక్కు భక్తులకు అందజేస్తారు. భక్తుల రద్దీ ఎంత ఉన్నా, క్వాలిటీ, క్లీనింగ్ విషయంలో దేవస్థానం బోర్డు ఏ మాత్రం రాజీ పడదు. వంట చేయడానికి, వడ్డించడానికి, క్లీనింగ్ కోసం 235 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. భక్తులు తిన్న ప్లేట్లు, గ్లాసులను మొదట శుభ్రం చేసి, ఆ తర్వాత డిష్‌వాషర్ ద్వారా వేడి నీటితో మరోసారి క్లీన్ చేస్తారు. ఒకేసారి వెయ్యి మంది కూర్చుని తినగలిగే హాల్ ఉంది. రద్దీ పెరిగే కొద్దీ ఎక్కువ మందికి వసతి కల్పిస్తారు. మకరవిళక్కు సీజన్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. భక్తుల రద్దీ పెరుగుతున్నందున భద్రతను కట్టుదిట్టం చేశారు. 140 మంది ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) బృందం సన్నిధానానికి చేరుకుంది.

సింగిడి
హైదరాబాద్
సోమవారం 24.11.2025
11
ప్రతిపక్షం
Prathipaksham.in



ఎడారి వసంతం-28

జరిగిన కథ:


ముసుగులు ధరించిన వ్యక్తులు కృష్ణ, శ్యాం, సామ్రాట్ లు అని గుర్తిస్తుంది జ్వాల. వీరు ఈ కుట్రలో ఇన్స్పెక్టర్ బలరాం ను కూడా వాడుకుంటున్నారని గ్రహిస్తుంది. ముగ్గురిని స్టేషన్కు తీసుకువెళ్తుంది. నాగరత్నం పెంచిపోషించిన అతులిత్ పరిణయ స్నేహితుని రూపంలో నాటకం ఆడుతున్నాడని గ్రహిస్తుంది. ఈ సమస్యలన్నీ ఛదించే వ్యక్తి ఎవరా ఆలోచిస్తుంటే ఆమెకు ఇంటెలిజెంట్ ఆఫీసర్ సంపత్ గుర్తుకు వస్తాడు. (ఇక చదవండి)

గొలుసు కథ



మహమ్మద్ మున్ని
వరంగల్

ఎన్నో ప్రమాదాల మధ్య హల్దీ ఫంక్షన్ చేసుకున్న హరి, సుందరిల జంట భయం భయంగా ఉన్నారు. అది చూసి సూర్య "ఏయ్ పెళ్లి అనేది జీవితంలో ఒకేసారి జరిగే అతి ముఖ్యమైన వేడుక. ముందు మీ మనసులోని భయాలను పక్కన పెట్టి ఆనందంగా పెళ్లి వేడుకని ఎంజాయ్ చేయండి" అన్నాడు. వెంటనే చక్రవర్తి కూడా కలగజేసుకుని "అవును ఇంకా జరగాల్సిన కార్యక్రమాలు చాలా ఉన్నాయి. తొందర తొందరగా కానివ్వండి" అన్నాడు. ఇంతలో సుగుణమ్మ కూడా ముందుకు వచ్చి "పిల్లలూ!వచ్చిన అతిథులకు ముందు భోజనాల సంగతి చూడండి" అని అనడంతో అందరు ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. మరొక వైపు సిరికి తన తల్లి ఎవరో తెలిసినప్పటికీ ఆమె ఈ లోకంలో లేనందుకు చాలా బాధ కలిగింది. కాని తండ్రితో పాటు అమ్మమ్మ తాతయ్య,మేనమామ, పిన్ని ఉన్నారు. తాను ఇప్పుడు అనాధను కాదు అని తలుచుకుంటే చాలా సంతోషంగా ఉంది. మనసు హాయిగా గాల్లో తేలుతున్న భావన ఒక చోట ఉండనివ్వట్లేదు. అవధులు లేని ఆనందం వెల్లువై పొంగగా ఉరకలు



వేసే ఉత్సాహం ఉల్లమునే నింపగా లేడిపిల్లలా చెంగుచెంగున గంతులేస్తూ అటుఇటు తిరుగుతున్న సిరిమువ్వను చూసి ఎంతో ముచ్చట పడతూ మురిపెంగా చూస్తున్నారు ఇందిరచక్రవర్తి.

****

నాగరత్నమ్మ మరిది మరియు తోటి కోడలు ఒక పెద్ద ప్రమాదానికి గురై ఆస్తితో పాటు ఐదు సంవత్సరాల అతులిత్ ను నాగరత్నమ్మ చేతిలో పెట్టి మరణించారు. వాళ్ళ పెళ్లైన 20 ఏళ్ల తర్వాత లేకలేక పుట్టిన సంతానం అతను. అందుకే నాగరత్నమ్మ అన్నీ తానై అతనిని పెంచింది. పెద్దమ్మ మాటంటే అతనికి వేదవాక్కు. ఆమె ఏది చెప్తే అదే నిజం అని గుడ్డిగా నమ్ముతుంటాడు. సామ్రాట్, అతులిత్ ఒకే కుటుంబంలో పెరగడం వలన అన్న కదలికలన్నీ గమనించిన అతడు దీక్ష గురించి, సామ్రాట్ దీక్షపై మోజుపడి తన ఆస్తిలో ఆమెను భాగస్వామ్యం చేయడం, ఆమె హఠాత్ మరణం గురించి తెలుసుకున్నాడు.

****

సంకేత్ పక్కన సంతోషంగా ధీమాగా నిలబడిన సిరిమువ్వని చూసి "బాగున్నావా సిరీ" అని ఎంతో ప్రేమగా పలకరించింది అంజలి. "నేను బాగున్నాను ఆంటీ. మీరు ఎలా ఉన్నారు?" అని అంటుండగానే పరిణయ వచ్చి ఆనందంతో సిరిని వాటేసుకుంది. భారతీయ సంప్రదాయంలో పదహారణాల అచ్చ తెలుగు అమ్మాయిలా ముస్తాబైన సిరిని చూసి ముచ్చటపడి "నన్ను కూడా నీలా తయారు చేస్తావా" అని అడిగింది. "సరే దాందేముంది పద రెడీ అవుదువు" అని గదిలోకి తీసుకెళ్ళింది సిరిమువ్వ. ఇదంతా చూస్తూ మనస్ఫూర్తిగా నవ్వింది అంజలి. ఆ నవ్వులో ఎలాంటి కల్మషం లేదని తృప్తిపడతాడు సూర్య.

****

ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లాలనే అతులిత్ కోరికను కాదనలేక అతనిని అమెరికాకు పంపించారు. నాగరత్నమ్మ, సామ్రాట్. నాగరత్నమ్మ చూపిస్తున్న విషపూరిత ప్రేమను నిజమైన ప్రేమ అని నమ్మి, ఆమెతో ప్రేమగా ఉంటూ, అన్ని విషయాలు ఆమెతో షేర్ చేస్తున్నాడు అతులిత్. సూర్యపై పగ తీర్చుకోవాలనుకున్న నాగరత్నమ్మ అతులిత్ ను ఆ కుటుంబంతో సన్నిహితంగా ఉంటూ అక్కడి విషయాలు తనకు ఎప్పటికప్పుడు తెలపాలని చెప్పింది. అదే క్రమంలో అతడు పరిణయను పరిచయం చేసుకుని స్నేహం చేస్తున్నాడు.


****

లాన్ లో ఉయ్యాలలో కూర్చుని దీర్ఘంగా ఆలోచిస్తుంది ఐపీఎస్ జ్వాలాముఖి. 'అసలు ఈ సీక్రెట్ కోడ్ లో ఏముంది? ఈ కోడ్ను డీకోడ్ చేయడం ఎలా?' అప్పుడే మెరుపులా మెదడులో ఒక వ్యక్తి మెదిలాడు. అతడే ఇంటెలిజెంట్ ఆఫీసర్ సంపత్. అతడు తన బాల్య స్నేహితుడు కూడా. కాబట్టి తన పని ఇంకా సులభంగా అవుతుందని భావించి వెంటనే అతనికి ఫోన్ చేసింది. అయితే హల్దీ ఫంక్షన్ కి ఆహ్వానం అందిన వెంటనే సంపత్ ప్రత్యేకంగా వచ్చాడు. చాలా కాలం తర్వాత బంధు మిత్రులందరూ కలవడం వలన ఆనందంగా అందరినీ పలకరిస్తూ రిలాక్స్ గా హల్దీ ఫంక్షన్ వేడుకని ఎంజాయ్ చేస్తున్నాడు. జేబులో సెల్ ఫోన్ మ్రోగడంతో తీసి లిఫ్ట్ చేశాడు. అవతలి నుండి వచ్చిన సమాచారం విని సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. కారణం తనకు అప్పజెప్పిన ముఖ్యమైన పనిని నిర్వర్తించడానికి వెళ్లాల్సిన చోటే ప్రస్తుతం తను ఉన్నారు.

****

పోలీసుల థర్డ్ డిగ్రీని భరించలేక కృష్ణ తన నేరాలు ఒప్పుకున్నాడు. చక్రవర్తి ఇందిరల ఆస్తులపై ఆశపడి వారు సిరిమువ్వను దత్తత చేసుకోవడం జీర్ణించుకోలేకపోయాననీ, అందుకే సిరిమువ్వతో పాటు వారిద్దరినీ కూడా చంపేసి ఆస్తులన్నీ తానే అనుభవించాలన్న దురాశతో ఇలా చేశాననీ, అంతేకాదు తన గురించి అన్ని రహస్యాలు తెలిసిన ఇన్ స్పెక్టర్ బలరాం అప్రూవర్ గా మారి పోలీసులకు నిజాలు ఎక్కడ చెబుతాడోనని అతనిని కూడా చంపాలనుకున్నాననీ' నిజాలన్నీ చెప్పాడు. (సశేషం)






సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కు భారత జట్టు ఇదే

గిల్ స్థానంలో కెప్టెన్ గా కేఎల్ రాహుల్

సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్ కు భారత జట్టును బీసీసీఐ ఆదివారం ప్రకటించింది. 15 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను వెల్లడించింది. మెడ నొప్పితో ఉన్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ సిరీస్‌కు దూరంగా కాగా, కేఎల్ రాహుల్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించారు. అటు,వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయంతో జట్టుకు దూరం కావలసి వచ్చింది. సీనియర్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మకు జట్టులో చోటు దక్కింది. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి కల్పించారు. అక్షర్ పటేల్ స్థానంలో రవీంద్ర జడేజాను తీసుకున్నారు. గాయంతో బాధపడుతున్న హార్దిక్ పాండ్యాను ఎంపిక చేయలేదు. మహమ్మద్ షమీకి మరోసారి నిరాశే మిగిలింది. వన్డే సిరీస్‌కు కూడా అతడిని పరిగణనలోకి తీసుకోలేదు. దేశవాళీతో పాటు భారత్ 'ఎ' తరపున బాగా ఆడిన రుతురాజ్ గైక్వాడ్‌ను తీసుకున్నారు. బ్యాకప్ వికెట్ కీపర్‌గా రిషభ్ పంత్‌కు అవకాశం లభించింది. స్పిన్ ఆల్‌రౌండర్లుగా వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజాకు, పేస్ ఆల్‌రౌండర్‌గా నితీశ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్ పేసర్లుగా జట్టులోకి వచ్చారు. రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్ కూడా ఎంపికయ్యారు. ఈ నెల 30న రాంచీలో జరిగే తొలి వన్డే మ్యాచ్‌తో ఈ సిరీస్ మొదలవుతుంది. డిసెంబర్ మూడున రాయ్‌పూర్ లో రెండో వన్డే, డిసెంబర్ ఆరున వైజాగ్ లో మూడో వన్డే జరుగుతాయి. భారత జట్టు: రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లీ, తిలక్ వర్మ, కేఎల్ రాహుల్ (కెప్టెన్), రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, నితీశ్ కుమార్ రెడ్డి, హర్షిత్ రాణా, రుతురాజ్ గైక్వాడ్, ప్రసిధ్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ధ్రువ్ జురెల్.



రెండో టెస్టులో సఫారీల దూకుడు

489 పరుగుల భారీ స్కోర్ నమోదు

టీమిండియాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ సౌతాఫ్రికా దూకుడుగా ఆడుతోంది. ముందుగా బ్యాటింగ్ చేసి 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. భారత బౌలర్లు అంతగా రాణించలేకపోయారు. 247/6 ఓవర్‌నైట్ స్కోర్‌తో సౌతాఫ్రికా రెండో రోజు ఆటను ప్రారంభించింది. ముత్తుసామి, కైల్ వెర్రెన్ అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. ఏడో వికెట్‌కు 88 పరుగులు చేశారు. వీరిని విడదీసేందుకు భారత బౌలర్లు తీవ్రంగా శ్రమించారు. చివరకు కైల్ వెర్రెన్(45)ను జడేజా ఔట్ చేసినా, మార్కో జాన్సన్‌తో కలిసి ముత్తుసామి చెలరేగి ఆడాడు. 192 బంతులలో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. దీంతో సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 489 పరుగుల భారీ స్కోర్ చేసింది. మార్కో జాన్సెన్ 93 పరుగులు చేసి తృటిలో శతకం చేజార్చుకున్నాడు. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ నాలుగు వికెట్లు తీయగా, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా రెండేసి వికెట్లు పడగొట్టారు. సౌతాఫ్రికా లోయరార్డర్ రాణించడంతో టీమిండియా విజయవకాశాలు క్షీణించాయి. భారత్ గెలవాలంటే ఏదైనా అద్భుతం జరగాలి. సౌతాఫ్రికా 489 పరుగులు చేసేందుకు 151 ఓవర్లు ఆడింది. భారత్ విజయం సాధించాలంటే తొలి ఇన్నింగ్స్‌లో 650 నుంచి 700 పరుగులు చేయాలి. తక్కువ స్కోర్‌కే పరిమితమైతే అటు సౌతాఫ్రికాకు విజయవకాశాలు మెరుగవుతాయి. ఇరు జట్లు పోటా పోటీగా ఆడితే మ్యాచ్ ఫలితం లేకుండా ముగుస్తుంది. అదే జరిగితే ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా 1-0తో కైవసం చేసుకుంటుంది. భారత బౌలర్లు రాణించకపోవడం భారత జట్టు విజయవకాశాల మీద ప్రభావం చూపింది.



అంధుల మహిళా క్రికెట్ ప్రపంచ కప్ గెలిచిన భారత్

ఫైనల్ మ్యాచులో ఏడు వికెట్ల తేడాతో ఓడిన నేపాల్

భారత అంధుల మహిళా క్రికెట్ జట్టు మొట్టమొదటి అంధుల టీ20 మహిళా ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం కొలంబోలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్‌ను ఏడు వికెట్ల తేడాతో ఓడించింది. ఈ టోర్నీకి ఆస్ట్రేలియా, పాకిస్తాన్ , శ్రీలంక, అమెరికా జట్లు పాల్గొన్నాయి. మ్యాచులో టాస్ గెలిచి ముందుగా బౌలింగ్ ఎంచుకున్న భారత జట్టు నేపాల్‌ను 114 పరుగులకే ఆలౌట్ చేసింది. అనంతరం బరిలోకి దిగిన భారత జట్టు 12 ఓవర్లలోనే 117 పరుగులు చేసి మ్యాచ్‌ను గెలుచుకుంది. ఈ టోర్నీలో భారత జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా, తొలి ప్రపంచ కప్ దక్కించుకుంది. భారత్ తరఫున ఫులా సరెన్ 44 పరుగులు చేసింది. నేపాల్ తరఫున సరితా ఘిమిరే 35 పరుగులు చేసింది. ఈ టోర్నీని శ్రీలంక, భారత్ కలిసి సంయుక్తంగా నిర్వహించాయి. ఫైనల్ మ్యాచ్ శ్రీలంకలోని పి. శరవణముత్తు స్టేడియంలో జరిగింది. అంధుల క్రికెట్ సాధారణ క్రికెట్ కంటే భిన్నంగా ఉంటుంది. దీని కోసం ప్రత్యేకంగా లోపల బాల్ బేరింగ్‌లు కలిగిన తెల్ల ప్లాస్టిక్ బంతిని ఉపయోగిస్తారు. బంతి దొర్లుతున్నప్పుడు వచ్చే శబ్ధాన్ని విని ఆటగాళ్లు దానిని గుర్తిస్తారు. బంతిని అండర్ ఆర్మ్ పద్ధతిలో విసరాలి. బౌలర్ బంతి వేసే ముందు బ్యాటర్‌ను సిద్ధంగా ఉన్నావా? అని అడిగి, బంతిని విసరాలి. విసిరేటప్పుడు 'ప్లే' అని బిగ్గరగా అరవాలి. బ్యాటర్ అప్పుడు ఆడేందుకు సిద్ధమవుతారు.



ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500 విజేత లక్ష్య

ఫైనల్ లో తనాక (జపాన్)పై విజయభేరీ

భారత బ్యాడ్మింటన్ స్టార్ లక్ష్య సేన్ దూకుడు మీద ఉన్నాడు. ఆస్ట్రేలియా ఓపెన్ సూపర్ 500లోనూ సత్తా చాటాడు. వరుస విజయాలతో ఫైనల్‌కు చేరాడు. ఫైనల్ లో యుషి తనాక (జపాన్)తో తలపడి విజయం సాధించాడు. 21-15, 21-11 తేడాతో పురుషుల సింగిల్స్ టైటిల్ ను అందుకున్నాడు. ఈ సీజన్‌లో లక్ష్యకు ఇది తొలి టైటిల్. ఫైనల్ మ్యాచ్ కేవలం 38 నిమిషాలలోనే ముగిసింది. ఇద్దరి మధ్య హోరాహోరీగా పోటీ సాగినప్పటికీ, చివరికి లక్ష్య పైచేయి సాధించాడు. తొలి సెట్‌ను 21-15 తేడాతో గెలిచాడు. ఇక రెండో సెట్‌లో ప్రత్యర్థి తనాక బలహీనపడ్డాడు. ఈ సెట్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన లక్ష్య 21-11 భారీ తేడాతో గెలిచాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్ టైటిల్ నెగ్గిన లక్ష్య సేన్‌కు బంగారు పతకం సహా, రూ.42 లక్షల భారీ నగదు బహుమతి లభించింది. 22న జరిగిన పురుషుల సింగిల్స్ సెమీ ఫైనల్‌లో, లక్ష్య చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ 6వ ర్యాంకర్ చౌ టియెన్‌చిన్‌తో తలపడ్డాడు, అతనితో జరిగిన మూడు సెట్ల మ్యాచ్‌ను 86 నిమిషాల్లో 21 తేడాతో గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. 2021 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతక విజేత అయిన లక్ష్య, చివరిసారిగా 2024లో లఖ్‌నవూలో జరిగిన సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్‌లో సూపర్ 300 టైటిల్‌ను గెలుచుకున్నాడు. అయితే, అదే సంవత్సరం కెనడా ఓపెన్‌లో ఓడిపోయాడు. ఆ తర్వాత సెప్టెంబర్‌లో జరిగిన హాంకాంగ్ సూపర్ 500లో రన్నరప్‌గా నిలిచాడు.

'స్పిరిట్'కి క్లాప్ కొట్టిన మెగాస్టార్

ఇండియన్స్ బిగ్గెస్ట్ సూపర్ స్టార్ ప్రభాస్ మూవీ స్పిరిట్ ఘనంగా ప్రారంభమైయింది. ఈ ముహూర్త వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక అతిథిగా హాజరై క్లాప్ కొట్టడం ఫ్యాన్స్ కి డబుల్ ట్రీట్ గా అలరించింది. పాన్‌ఇండియా పవర్‌హౌస్ ట్యాలెంట్ ని ఒకచోట చేర్చి మొదటి షూటింగ్ షెడ్యూల్ ఇప్పుడు ప్రారంభమైంది. ఇప్పటికే సెన్సేషనల్ హ్యాట్రిక్ హిట్‌లను అందించిన బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ ను ఒక పల్స్‌పౌండింగ్, పాన్‌వరల్డ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు. Tసిరీస్ ఫిల్మ్స్, భద్రకాళి పిక్చర్స్ బ్యానర్లపై భూషణ్ కుమార్, ప్రణయ్ రెడ్డి వంగా, క్రిషన్ కుమార్ నిర్మిస్తున ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమౌతోంది. సందీప్ రెడ్డి వంగా బ్లాక్ బస్టర్ యానిమల్‌లో తన నటనతో ఆకట్టుకున్న త్రిప్తి దిమ్రి, ఈ చిత్రంలో ప్రభాస్ కి జోడిగా నటించనుంది. ఈ కొత్త జోడీ వెండితెరపై కొత్త ఎనర్జీని తీసుకురానుంది. వివేక్ ఒబెరాయ్, ప్రకాష్ రాజ్, ప్రముఖ నటి కాంచన కీలక పాత్రల్లో కనిపిస్తారు. ప్రభాస్ పుట్టినరోజున నిర్మాతలు ఇటీవల ఒక ప్రత్యేకమైన "సౌండ్‌స్టోరీ" ఆడియో టీజర్‌ను ఆవిష్కరించారు.ఎటువంటి విజువల్స్ లేనప్పటికీ ఈ వీడియోకి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. స్పిరిట్‌ను ప్రపంచవ్యాప్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ గా రూపొందిస్తున్నారు. తొమ్మిది భాషలలో విడుదల చేయబోతున్నారు. మ్యాసివ్ స్కేల్, యూనివర్సల్ కథనం, భారీ యాక్షన్ ఈ సినిమాను మరింత విశేషంగా నిలబెట్టబోతున్నాయి. కెమెరాలు రోల్ అవుతున్నాయి. కౌంట్‌డౌన్ మొదలైంది. ప్రభాస్ ఈజ్ బ్యాక్. స్పిరిట్ స్క్రీన్‌ను వెలిగించడానికి సిద్ధంగా ఉంది.





నాగ చైతన్య మూవీ టైటిల్ వృషకర్మ


పవర్ ఫుల్ ఫస్ట్ లుక్

యువ సామ్రాట్ నాగ చైతన్య తండేల్ భారీ విజయంతో తర్వాత విరూపాక్షతో బ్లాక్ బస్టర్ అందుకున్న విజనరీ దర్శకుడు కార్తీక్ దండుతో ఇంతకు ముందు ఎప్పుడూ చూడని మైథలాజికల్ థ్రిల్లర్ కోసం చేతులు కలిపారు. ఈ అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ను SVCC సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. రెండు ఆసక్తికరమైన గ్లింప్స్ తో ద్వారా భారీ అంచనాలను సృష్టించిన తర్వాత, నాగ చైతన్య పుట్టినరోజు ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, మేకర్స్ ఇప్పుడు సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు. సూపర్ స్టార్ మహేష్ బాబు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. టీం అందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ చిత్రానికి "వృషకర్మ" అనే పవర్ ఫుల్ టైటిల్ పెట్టారు. వృషకర్మ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నాగ చైతన్య చేతిలో సాలిడ్ రాడ్ పట్టుకుని ఇంటెన్స్ గా కనిపిస్తున్నారు. అతని చుట్టూ ఉన్న విజువల్ ఎగిరే ధూళి , పొగతో నిండి పవర్ ఫుల్ యాక్షన్ ని సూచిస్తోంది. బ్యాక్ డ్రాప్ లో పురాతన భవనాలు, ప్రకాశవంతమైన బంగారు కాంతితో కూడిన ఆకాశం కనిపిండం క్యురియాసిటీ మరింతగా పెంచింది. నాగ చైతన్య మజిల్డ్ ఫిజిక్, ఇంటెన్స్ హావభావాలు... ఇవన్నీ అతని పాత్ర ఎంత పవర్ ఫుల్ గా వుంటుందో చూపిస్తున్నాయి. ఇప్పటివరకు అతనికి ఇదే బెస్ట్ లుక్.

అనిల్ రావిపూడికి చిరు బర్త్ డే గిఫ్ట్

డైరెక్టర్ అనిల్ రావిపూడి పుట్టినరోజు సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి గారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ రావిపూడికి ఒక అందమైన వాచ్‌ని గిఫ్ట్ గా అందించారు. కేక్ కట్ చేసి బర్త్ డే ని సెలబ్రేట్ చేశారు. చిరంజీవి గారు ఇచ్చిన ఈ సర్ప్రైజ్ గిఫ్ట్, హృదయపూర్వక శుభాకాంక్షలు అనిల్ రావిపూడికి మోస్ట్ మోమరబుల్ మూమెంట్స్ గా నిలిచాయి.అనిల్ రావిపూడి దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి మోస్ట్ ఎవైటెడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకరవరప్రసాద్ గారు' తెరకెక్కుతోంది. నయనతార హీరోయిన్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ మీసాల పిల్ల' రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ క్రాస్ చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. తెలుగు సినిమా మ్యూజిక్ కి కొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేసింది నెలకొల్పింది. చిరంజీవి తన సిగ్నేచర్ చార్మ్, ఎక్స్ప్రెషన్స్, ఎనర్జిటిక్ డ్యాన్స్ మూవ్స్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. ఈ పాటకు వస్తున్న అద్భుతమైన స్పందనతో సినిమాపై ఎక్స్‌పెక్టేషన్స్ ఆకాశాన్ని తాకుతున్నాయి. సాహూ గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా "షైన్ స్క్రీన్స్", "గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్" బ్యానర్లపై నిర్మిస్తున్న "మన శంకరవర ప్రసాద్ గారు" 2026 సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కానుంది.





'దాషమకాన్'

టైటిల్ ప్రోమో విడుదల

వైవిధ్యమైన సినిమాలో ఆకట్టుకుంటోన్న యంగ్ హీరో హరీష్ కళ్యాణ్ కథానాయకుడుగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ 'దాషమకాన్'. ఐడీఏఏ ప్రొడక్షన్స్, థింక్ స్టూడియోస్ బ్యానర్స్‌పై ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను వినీత్ వరప్రసాద్ స్వీయ దర్శక నిర్మాణంలో రూపొందిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రాబోతున్న ఈ సినిమా టైటిల్ ప్రోమోను మేకర్స్ శనివార విడుదల చేశారు. టైటిల్ ప్రోమోను గమనిస్తే.. ఊర్లో పేరు మోసిన రౌడీకి చెందిన కిరాయి మనుషులు హీరోని వెతుక్కుంటూ..ఎలాగైనా చంపాలని ఆయుధాలతో వెంబడిస్తుంటారు. హీరో బాత్రూమ్‌లోకి వెళతాడు. వాళ్లు కూడా ఫాలో అవుతూ వెళతారు. హీరో బాత్రూమ్‌లో ఒకడ్ని వేసేసి తాపీగా బయటకు నడుచుకుని వస్తాడు. హీరో చంపాలనుకున్న విలన్ మనుషులు బిక్క చచ్చిపోతారు. ఈ సీన్స్‌తో టైటిల్ ప్రోమో ఇంట్రెస్టింగ్‌గా ఉంది. హరీష్ కళ్యాణ్ ఇప్పటి వరకు చేసిన పాత్రలకు పూర్తి భిన్నమైన రోల్ ఇది. పక్కా మాస్ యాక్షన్ మూవీగా కనిపిస్తోంది. టైటిల్ ప్రోమోలో చేతిలో చురకత్తి తిప్పుతాడు హీరో. అది చేతిలో పాటలు పాడే మైక్‌లా మారిపోతుంది. అంటే ఈ సినిమాలో హీరో పాత్రలో రెండు షేడ్స్ ఉంటాయనేది తెలుస్తోంది. ఓ షేడ్‌లో పాటలు పాడితే.. మరో షేడ్‌లో మాస్ అవతార్‌లో యాక్షన్‌తో దుమ్మురేపుతుంటాడు. మరి ఈ రెండు షేడ్స్ వెనుకున్న అసలు కథ తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలోనూ కలుగుతోంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at H.No. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200